www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 గురువారం

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 05, డిసెంబర్ 2024

సంపుటి: 6 సంచిక: 186, పేజీలు: 12, వెల: రూ.5/-



## వీడిన ఉత్కంఠ..

- మహారాష్ట్ర సీఎంగా దేవేంద్ర ఫడణవీస్
- అధికారికంగా ప్రకటించిన మహారాష్ట్ర బీజేపీ చీఫ్
- నేడు సీఎంతో పాటు ఇద్దరు ఉప ముఖ్యమంత్రుల ప్రమాణం

**ముంబయి, డిసెంబర్ 4 (వెలుతురు):** మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై గత కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. మిగతా..2లో





## హైదరాబాద్‌లో కొత్త హంగులతో ఎకో టూరిజం

- వృక్ష క్షేత్రం, వర్చువల్ వైల్డ్ లైఫ్ మాడల్ సఫారీలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 4:** హైదరాబాద్ నగర వాసులకు శుభవార్త. నగరంలో సుందరీకరణ, పచ్చదం పెంపొందించి అహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధ వారం ప్రారంభించారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో సరికొత్త హంగులతో అభివృద్ధి చేసిన ఎకోటూరిజం, వృక్ష క్షేత్రం, వర్చువల్ వైల్డ్‌లైఫ్ మాడల్ సఫారీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రజాపాలన -ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్ కెవిబిఆర్ బొటానికల్ గార్డెన్‌లో జరిగిన కార్య క్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త గూడెం - పాల్వంచ, మరియు సత్తుపల్లి డివిజనల్ మేనే జర్ ఆఫీస్ కాంప్లెక్స్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఫారెస్ట్ - ఎకోటూరిజం అభివృద్ధి కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. గార్డెన్ లో 75 వనాలతో కొత్తగా రూపుదిద్దుకున్న వృక్ష పరిచయ క్షేత్రాన్ని, కొత్తగా ఏర్పాటు చేసిన వర్చువల్ వైల్డ్‌లైఫ్ మాడల్ సఫారీని ప్రారంభించారు. టిజిఎఫ్డీసీ నూతన వాహనాలను ప్రారంభించి బ్యాటరీ వాహనంలో ప్రయాణిస్తూ గార్డెన్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ , పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రైసింగ్ ఉత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 4:** ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరా బాద్ రైసింగ్ ఉత్సవంలో భాగంగా బుధ వారం నెక్లెస్ రోడ్డు ఎచ్ ఎం డి ఏ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ,దుద్దిళ్ల శ్రీధర్ బాబు ,పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్,శాసన మండలి చీఫ్ విప్ , ఎమ్మెల్సీ




పట్నం మహేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం ,గౌరవ ఎమ్మెల్యే దానం నాగేందర్ ,మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ లతో కలిసి పాల్గొన్న గౌరవ పిఏసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు,

## పేదవాడి సొంతింటికల సాకారం దిశగా ప్రభుత్వం

- నేడు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు మొబైల్ యాప్ ప్రారంభించనున్న సీఎం
- ప్రజా పాలనలో పేదవాడి సొంతింటి కల సాకారం
- లబ్ధిదారుల ఎంపికకు రంగం సిద్ధం
- పారదర్శకంగా ఎంపికకు మొబైల్ యాప్
- నేడు (5వ తేది) రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరాణ
- 6వ తేది నుంచి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ
- ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్

(రాపర్తి భాస్కర్ గౌడ్)



**వెలుతురు,హైదరాబాదు బ్యూరో, డిసెంబర్ 4:** తెలంగాణలో నిరుపేదలు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న పేదవాడి సొంతింటి కల సాకారం కానుంది. బడుగు బలహీన వర్గాల మహిళలు ఆత్మ గౌరవంతో బతకాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో నీడలేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇండ్ల పథకం అమలుకు ఉన్న అవరోధాలను అధిగమిస్తూ అమలుకు అవసరమైన కార్యాచరణను వేగవంతం చేసిందని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. "ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం, కాంగ్రెస్ అంటే ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ పేటెంట్. ఈ రోజు కూడా రాష్ట్రంలో ఏ గ్రామానికి పోయినా, ఏ తండాకు పోయినా, ఏమారుమూల ప్రాంతానికి పోయినా ఇందిరమ్మ ఇళ్ళే కనబడతాయి. ఈ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలు ఒక వంతు అయితే, మేం కట్టించే ఇందిరమ్మ ఇళ్లు మరో వంతు. మేం గర్వంగా చెబుతున్నాం ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించి ఇస్తామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు, లబ్దిదారుల ఎంపిక మిగతా..2లో

## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్

- ఏషియా పసిఫిక్ జోన్లో రెండో సెంటర్
- తెలంగాణలో పెట్టుబడులకు కుదిరిన ఒప్పందం
- గూగుల్‌తో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఒప్పందం
- సీఎం రేవంత్ నివాసంలో కంపెనీ ప్రతినిధి బృందం భేటీ
- డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజ
- గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా ఉంది
- ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో హైదరాబాద్ మేటి
- ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధికి కేంద్రంగా హైదరాబాద్
- తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, డిసెంబర్ 4 (వెలుతురు):** తెలంగాణ ప్రభుత్వం దిగ్గజ సంస్థ గూగుల్ కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. తెలంగాణలో భారీగా పెట్టు బడులు పెట్టేందుకు గూగుల్ ముందుకొచ్చింది. దేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ని హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు గూగుల్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలో స్థాపించే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రపంచంలోనే అయిదవది కాగా, ఏషియా పసిఫిక్ జోన్లో టోక్యో తర్వాత ఏర్పాటు చేస్తున్న రెండో సెంటర్ కావడం విశేషం గూగుల్ సేఫ్టీ ఇంజనీ రింగ్ సెంటర్ అనేది ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్ . ఈ సేఫ్టీ సెంటర్ అధునాతన భద్రతతో పాటు ఆన్‌లైన్ సేఫ్టీ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యాధునిక పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, రీసెర్చర్లకు ఈ సేఫ్టీ సెంటర్ సహ కార వేదికగా మారనుంది. భారతదేశంలో నైపుణ్యాభి వృద్ధిని పెంపొందించి, ఉపాధి పెంచడం, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించాలన్న లక్ష్యంతో ఈ సేఫ్టీ సెంటర్ పని చేస్తుంది. ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉద్యోగులున్న గూగుల్ సంస్థ అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్‌లో మిగతా..2లో

## తెలుగు రాష్ట్రాల్లో భూకంపం

- ములుగు జిల్లాలో భారీ భూకంపం
- ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ జనం
- ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీసిన జనం
- కొన్ని సెకన్ల పాటు కంపించిన భూమి
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ప్రకంపనల తీవ్రత
- తెలంగాణలో గడచిన 50ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపం
- ఏపీ, తెలంగాణలో పలు జిల్లాలో కంపించిన భూమి
- మళ్లీ భూకంపం వచ్చే అవకాశం : నిపుణులు

**హైదరాబాద్, డిసెంబర్ 4(వెలుతురు):** బుధవారం ఉదయం ములుగు జిల్లాలో భూకంపం సంభవించింది. దీని ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాలపై పడింది. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో



ప్రకంపనల తీవ్రత అధికంగా కనిపించింది. కూర్చున్న చోట చాలా మంది వణికిపోయారు. తెలం గాణలోని ఆదిలాబాద్ నుంచి ఇటు ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాల వరకు భూకంప ప్రభావం కనిపించింది. 4 డిసెంబర్ 2024 బుధవారం ఉదయం మిగతా..9లో



## పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులు..

భూ కేటాయింపులపై న్యాయస్థానంలో విచారణ

**హైదరాబాద్, డిసెంబర్ 4 (వెలుతురు):** బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పార్టీ కార్యాలయాలకు చౌకగా భూములు ఇచ్చారంటూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. హైదరాబాద్‌తోపాటు మిగతా జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం చౌకగా భూములు అమ్మకాలు దక్కించుకున్నారని పిటిషనర్ మిగతా..2లో




## రాజకీయ దురుద్దేశంతో ఎఫ్ఐఆర్ నమోదు

- నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే తప్పుడు కేసులు
- తగిన సాక్ష్యాధారాలు సేకరించకుండానే ఎఫ్ఐఆర్ నమోదు
- హైకోర్టులో హరీశ్‌రావు క్వాష్ పిటిషన్

**హైదరాబాద్, డిసెంబర్ 4 (వెలుతురు):** పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ దురుద్దేశంతో చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, ఈ కేసులో పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టకుండా, అరెస్ట్ చేయకుండా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ పంజాగుట్టలోని నాగార్జున సర్కిల్‌లో కార్యాలయం తీసుకొన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మిగతా..2లో

## తెలంగాణలో రెండు నూతన ఆర్టీసీ బస్సు డిపోలు మంజూరు

- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 4:** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ వ్యవస్థలో 10-15 సంవత్సరాల తర్వాత రెండు నూతన ఆర్టీసీ డిపో లు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన రవాణా శాఖ మంత్రిగా నాకు సంతృప్తిస్తుందన్నారు, కాగా గత 10 నుండి 15 సంవత్సరాలుగా నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో తీసుకుపోతున్నామని మంత్రి ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు.

నూతన ఉద్యోగ నియామకాలు, నూతల బస్సుల కొనుగోలు, ఆర్టీసీ సంస్కరణలు, కార్మికుల సంక్షేమం ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రాలుగా ఉన్న పెద్దపల్లి ములుగు జిల్లా లోని ఏటూరు నాగారంలో రెండు నూతన ఆర్టీసీ బస్సు డిపోలు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు.



ములుగు జిల్లా కు బస్సు డిపో మంజూరు చేసిన ధ్రువపత్రాలను మంత్రి సీతక్కకి అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్

ఈ రెండు ఆర్టీసీ డిపోలకు సంబంధించి ఆర్డర్లు వచ్చాయని ఆయన తెలిపారు.ములుగు ఆర్టీసీ డిపోకు సంబంధించి మంత్రి సీతక్క , పెద్దపల్లి ఆర్టీసీ డిపో సంబంధించి మంత్రి శ్రీధర్ బాబు స్థానిక ఎమ్మెల్యే విజయరమణ రావు లకు ఆర్డర్లు అందిస్తున్నామన్నారు.ఆర్టీసీ అభివృద్ధి లోకి ముందుకు వస్తుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. రెండు నూతన డిపోల ద్వారా ఆ ప్రాంత ప్రయాణికులకు మూడు రాష్ట్రల సరిహద్దు ప్రయాణికులకు సౌకర్యాన్ని అందుస్తు త్వరలోనే బస్సు డిపో నిర్మాణాలు ప్రారంభిస్తామని మంత్రి ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు, అలాగే పెద్దపల్లి పారిశ్రామిక ప్రాంతం జిల్లా కేంద్రం చేసిన అక్కడ బస్సు డిపో లేకపోవడంతో రవాణా శాఖ మంత్రిగా జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే విజయరమణారావు లకు విజ్ఞప్తి మేరకు అక్కడ బస్సు డిపో మంజూరు చేయడం జరిగిందన్నారు. రెండు జిల్లాల ప్రజలకు నూతన బస్సు డిపో మంజూరు అయిన సందర్భంగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.



## సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం

- గోల్డెన్ టెంపుల్ వద్ద కాల్పులు
- భద్రతా సిబ్బంది అప్రమత్తతతో తృటిలో తప్పిన ప్రాణాపాయం

**గుర్దాస్‌పుర్, డిసెంబర్ 4 (వెలుతురు):** పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌పై కాల్పులు జరిగాయి. మతపరమైన శిక్ష అనుభవించేందుకు స్వర్ణ మందిర్ చేరుకున్న సమయంలో ఓ దుండగుడు బాదల్‌పై కాల్పులు జరిపాడు. పక్కన నిలుచున్న భద్రతా సిబ్బంది అప్రమత్తతతో తృటిలో బాదల్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నిందితుడికి ఖలీస్థాన్ ఉగ్రముఠాతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శిక్షలో భాగంగా స్వర్ణ దేవాలయ ప్రవేశద్వారం వద్ద సుఖ్‌బీర్ చక్రాల కుర్చీపై కూర్చొని సేవాదార్ (కాపలాదారుడు)గా ఉండగా ఓ వృద్ధుడు మిగతా..2లో

## సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం

**మొదటిపేజీ తరువాయి..**

ఆయన దగ్గరకు వచ్చాడు. కొన్ని అడుగుల దూరంలోనే ఉన్న అతడు ప్యాంట్ జేబులోంచి తుపాకీ తీసి సుఖ్‌బీర్‌పై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. ఇంతలోనే సుఖ్‌బీర్ పక్కన నిలుచున్న భద్రతా సిబ్బంది దుండగుడి అనుమానాస్పద కదలికలను పసిగట్టారు. తుపాకీ తీసి కాల్చే లోపే దుండగుడిని పక్కకు తోసేశారు. దీంతో తుపాకీ గురితప్పి ఆ తూటా సుఖ్‌బీర్ పక్కనున్న గోడకు తగిలింది. దీంతో సుఖ్‌బీర్‌కు ఎలాంటి హాని జరగలేదు. సుఖ్‌బీర్‌పై కాల్పులు జరిపిన నిందితుడిని వెంటనే బంధించారు. గుర్దాస్‌పుర్ జిల్లాకు చెందిన నరేన్ సింగ్‌గా గుర్తించారు. అతడికి ఖలిస్థానీ ఉగ్రముఠా బబ్బర్ ఖల్సాతో సంబంధాలున్నట్లు పోలీసులు తెలిపారు. 2004లో బురేల్ జైల్-బ్రేక్ కేసులో ఇతడి హస్తం ఉందని, ఆ ఘటనలో నలుగురు బబ్బర్‌ఖల్సా ముఠా సభ్యులు జైలు నుంచి తప్పించుకున్నారని వెల్లడించారు. బుధవారం దాడిని ఆపింది రిష్‌పాల్ సింగ్, జస్బీర్‌సింగ్, పర్మీందర్ సింగ్ అనే పోలీసులని అమృత్‌సర్ సీపీ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లర్ తెలిపారు. సకాలంలో వారు అప్రమత్తమయ్యారని అభినందించారు. మత విశ్వాసాల కారణంగా స్వర్ణమందిర్ ప్రాంగణంలో పోలీసులను యూనిఫాంలో మోహరించేందుకు అనుమతి లేదని సీపీ వివరించారు. శిరోమణి అకాలీదళ్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సుఖ్?బీర్ సింగ్ బాదల్ సహా ఆయన అనుచరులు 2007-2017 మధ్య అధికారంలో ఉన్న సమయంలో తప్పులు, మతపరమైన దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని ఆగస్టులో అకాల్ తఖ్త్ తేల్చింది. ఈ విషయంలో పార్టీ చీఫ్ సుఖ్‌బీర్‌ను దోషిగా తేల్చింది. సేవకుడిగా అమృత్‌సర్?లోని స్వర్ణదేవాలయంలో పాత్రలు, బూట్లు శుభ్రం చేయాలని ఆదేశించింది. మంగళవారం తొలిరోజు ఆ శిక్షను సుఖ్‌బీర్ అనుభవించారు. రెండోరోజు శిక్ష అనుభవించేందుకు స్వర్ణమందిర్ వెళ్లారు. మెడలో తప్పు చేసినట్లు రాసి ఉన్న పలకను ధరించి ద్వారం వద్ద కూర్చున్న కొంతసేపటికే ఈ ఘటన జరిగింది.

### రాజకీయ దురుద్దేశంతో

## ఎఫ్ఐఆర్ నమోదు

**మొదటిపేజీ తరువాయి..**

ఈ నెల 1వ తేదీన పోలీసులు 120(బి), 386, 409,506 సెక్షన్ల కింద, అలాగే రెడ్‌విత్ 34, ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని హరీశ్‌రావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాలుగా రాజకీయంగా కీలకంగా వ్యవహరించడంతోపాటు 2014 నుంచి 2023 వరకు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించారని పిటిషనర్ తరఫు న్యాయవాది పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ కక్ష్యల కారణంగానే హరీశ్‌రావుపై ఫిర్యాదు చేశారని, పోలీసులు కూడా తగిన సాక్ష్యాధారాలు సేకరించకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. పోలీసులు తదుపరి చర్యలు తీసుకోకుండా, అరెస్ట్ చేయకుండా స్టే విధించాలని మధ్యంతర అప్లికేషన్‌లో కోరారు. 2021 మార్చిలో పంజాగుట్ట నాగార్జున సర్కిల్‌లో ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశానని హరీశ్‌రావుపై ఫిర్యాదు చేసిన గదగోని చక్రధర్‌గౌడ్ చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులను సేంద్రీయ వ్యవసాయం వైపునకు మళ్లించే దిశగా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఏర్పాటు చేశానని తెలిపారు. గతేడాది కూడా రైతు కుటుంబాలకు చెందిన 150 మంది వితంతులకు రూ.లక్ష చొప్పున నగదును పంపిణీ చేశానని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేతో సహా ఏ ఇతర నేతలను ఆహ్వానించలేదని చెప్పారు. ఇలాంటి సేవా కార్యక్రమాలతో తనకు మంచి పేరు వస్తుందనే స్థానిక ఎమ్మెల్యే అప్పటి మంత్రి అయిన హరీశ్‌రావు తనపై కక్ష పెంచుకున్నారని గదగోని చక్రధర్‌గౌడ్ వెల్లడించారు. అప్పటి నుంచి హరీశ్‌రావు, అయన అనుచరుల నుంచి బెదిరింపులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ఆపకపోతే చంపేస్తామని బెదిరించారని వివరించారు. ఎన్నికల సమయంలో తనతోపాటు తన కుటుంబసభ్యులు, మిత్రుల కదలికలపై కూడా నిఘా ఉంచారని, తమ ఫోన్లను సైతం ట్యాపింగ్ చేశారని ఫిర్యాదులో వివరించారు.

### పార్టీ కార్యాలయాలకు

## భూ కేటాయింపులు..

**మొదటిపేజీ తరువాయి..**

ప్రస్తావించారు. 500 కోట్లు విలువైన భూమిని కేవలం 5 కోట్లుకు కేటాయించారని వాదించారు. గజం 100 రూపాయలకే కేటాయింపు జరిగినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అధికారులు, జర్నలిస్టులకు భూ కేటాయింపులపై గత నెల 25న ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పుని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రెండేళ్లగా ఈ అంశంపై ప్రతివాది మాజీ సీఎం కేసీఆర్ కౌంటర్ దాఖలు చేయలేదని పేర్కొన్నారు. దీనిపై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా వేసింది హైకోర్టు.

## నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏసీబీ దాడులు

### - ఏసీబీకి చిక్కిన మరో అధికారి

**నిర్మల్, డిసెంబర్ 4 (వెలుతురు):** ఉమ్మడి అదిలాబాద్ లో ఏసీబీ దాడులు ఉద్యోగులకు కామన్ అయిపోయింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోనే ఎన్నో దాడులు జరిగినప్పటికీ ఏ ఒక్క ఉద్యోగి చలనం లేనట్టుగా ఉంది. వరుస దాడులు జరుగుతున్నప్పటికి ఉద్యోగులలో భయం లేకుండా పోయిందని మరొకసారి రుజువైంది. నిర్మల్ జిల్లాలో సరిగ్గా ఏడాది వ్యవధిలో ఏడు ఏసీబీ కేసులు నమోదైన విషయం మరువకముందే బుధవారం మరొక ఎనిమిదో కేసు నమోదు కావడం గమనార్హం. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బైల్ బజార్ వద్ద గల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు.



రూ. 7వేలు లంచం తీసుకుంటుండగా మార్కెట్ కమిటీ వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. కొత్త లైసెన్స్ రెన్యువల్ కు పదివేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా, ఏడు వేల రూపాయలకు బేరం కుదుర్చుకున్నారని, ఇవాళ రూ.7 వేలను కార్యాలయంలో ఏడీ శ్రీనివాస్ కు బాధితుడు వెంకట్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిర్మల్ జిల్లాలో ఏసీబీ అధికారుల వరుస దాడులతో అధికారుల గుండెల్లో దడ పుట్టిస్తుంది.

## పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా

### సాంకేతిక లోపం తలెత్తడంతో నిర్ణయం

**శ్రీహరికోట,డిసెంబర్ 4 (వెలుతురు):**
పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా పడింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఇవాళ నింగికి ఎగరాల్సిన ప్రోబా3 స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.12 నిమిషాలకు ప్రయోగం ఉంటుందని ఇస్రో చెప్పింది. కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిలైట్లను ఇస్రో నింగిలోకి పంపుతున్నది. నిజానికి ఇవాళ సాయంత్రం 4.06 గంటలకు పీఎస్ఎల్‌వీ-సీ59 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ సాంకేతిక లోపంతో ప్రయోగాన్ని వాయిదా వేశారు. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉన్నాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడమే ప్రోబా-3 లక్ష్యం. ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరించనున్నాయి.

# తెలంగాణ ఆర్థికంగా వృద్ధి చెందాలంటే ఆర్య వైశ్యుల పాత్ర అవసరం

### ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 4:** తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా ప్రగతి బాటలో పయనించాలంటే ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో ఉంటుందని, అందుకోసం ప్రతి ఒక్కరూ ముందు భాగాన ఉండి పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఆర్యవైశ్య ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు హైదరాబాద్‌లో ఏదైనా మంచి ప్రదేశాన్ని గుర్తిస్తే అక్కడ రోశయ్య విగ్రహ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగో వర్ధంతిలోపు రోశయ్య విగ్రహ ఏర్పాటు జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా అనేక పదవులకు రోశయ్య వన్నె తెచ్చారని సీఎం కొనియాడారు. సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రులకు కుడిభుజంగా రోశయ్య ఉండేవారని గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రభుత్వాన్ని కంచె వేసి



కాపాడేవారన్నారు. చట్ట సభల్లో రోశయ్య వ్యవహరించిన తీరుతెన్నులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మరించుకుంటూ చట్ట సభల్లో ఆనాటి స్ఫూర్తి కొరవడిందని అన్నారు. రోశయ్య పాలక పక్షంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా మాటల చతురతతో విషయావగాహనతో మాట్లాడేవారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. రోశయ్య నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉందన్నారు. ఆయన ఏనాడూ పదవులు కావాలని అడగలేదని, వారిలోని ప్రతిభ, క్రమశిక్షణ, పార్టీ పట్ల నిబద్ధత



రోశయ్య కు అనేక పదవులను తెచ్చిపెట్టిందని సీఎం చెప్పారు. కొణిజేటి రోశయ్య మెమోరియల్ ఫోరమ్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఇరు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు.

## వీడిన ఉత్కంఠ..

**మొదటిపేజీ తరువాయి..**

మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. బుధవారం జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో మహారాష్ట్ర సీఎంగా ఫడణవీస్ పేరును ఖరారు చేశారు. అనంతరం ముంబయిలోని విధాన్ భవన్‌లో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీలో ఫడణవీస్‌ను బీజేపీ ఎమ్మెల్యేలు తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి కేంద్ర పరిశీలకులుగా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ హాజరయ్యారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో ఏక్‌నాథ్ శిందే, దేవేంద్ర ఫడణవీస్, అజిత్ పవార్ భేటీ కానున్నారు. గవర్నర్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరనున్నారు. గురువారం ఆజాద్ మైదానంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా ఎన్‌డీఏ కీలక నేతలు దీనికి హాజరు కానున్నారు. సీఎంగా ఫడణవీస్‌తో పాటు శివసేన నేత ఏక్‌నాథ్ శిందే , ఎన్‌సీపీ నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. రానున్న రోజుల్లో మనకు కొన్ని అనుకూల అంశాలతో పాటు ప్రతికూల అంశాలు కూడా ఉంటాయని దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. అయితే రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం కలిసి పని చేసి అనుకున్న లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన తర్వాత ఫడ్నవీస్ ఈ మేరకు పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 288 సీట్లకు గాను బీజేపీ 132 స్థానాల్లో విజయం సాధించింది. ఆ రాష్ట్రంలో బీజేపీ అత్యుత్తమ ప్రదర్శన ఇదే. మహాయుతి కూటమి మొత్తంగా 230 స్థానాలు సొంతం చేసుకుంది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై కూటమిలో కొన్నిరోజుల పాటు ప్రతిష్టంభన నెలకొంది. సీఎం ఎంపిక, శాఖల కేటాయింపులపై బీజేపీ, శివసేన, ఎన్సీపీ మధ్య అనేక చర్చలు జరిగాయి. ఎట్టకేలకు ఆ చర్చలు కొలిక్కి వచ్చాయి. మహారాష్ట్ర సీఎంగా ఫడణవీస్ ప్రమాణస్వీకారం చేయనుండటం ఇది మూడోసారి. అంతకుముందు ఫడణవీస్ 2014 నుంచి 2019 వరకు సీఎంగా వ్యవహరించారు. 2019లో రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటికీ- నాటి రాజకీయ పరిస్థితుల కారణంగా 5 రోజులకే రాజీనామా చేయాల్సి వచ్చింది. సీఎం పదవి, శాఖల కేటాయింపుపై మహాయుతి కూటమి మధ్య గత కొంతకాలంగా ప్రతిష్టంభన నెలకొంది. ఉప ముఖ్యమంత్రి పదవి తనకు వద్దని, హోంశాఖను కేటాయించాలని శిందే పట్టుబట్టినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే మహారాష్ట్ర పరిస్థితులను పర్యవేక్షించడానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీని పరిశీలకులుగా బీజేపీ అధిష్ఠానం నియమించింది. అయితే ఎన్డీఏ నేత రామ్‌దాస్ అథవాలే తాజాగా ఏక్‌నాథ్ శిందేతో చర్చలు జరిపినట్లు సమాచారం. డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించాలని ఆయనకు నచ్చజెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకు శిందే కూడా సుముఖత వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. అంతకుముందు మరోసారి సీఎం పదవిని ఇచ్చేందుకు మహాయుతిలోని బీజేపీ అధిష్ఠానం సుముఖత వ్యక్తం చేయకపోవడంపై శిందే కలత చెందిన మాట వాస్తవమేనని అఠవలే అన్నారు. అయినప్పటికీ, బీజేపీ తన నిర్ణయాన్ని మార్చుకునే పరిస్థితులు కనిపించట్లేదన్నారు. శిందే ఎదుట ప్రస్తుతం మూడు దారులున్నాయని చెప్పారు. ఉపముఖ్య మంత్రి పదవిని తీసుకోవడం లేదంటే మహాయుతి కూటమి ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించడం, అది కూడా నచ్చకపోతే.. కేంద్ర ప్రభుత్వంలో స్థానం కోరుకోవడమేనని అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 288 స్థానాలకు గానూ మహాయుతి కూటమి 230 చోట్ల విజయం సాధించిన సంగతి తెలిసిందే. భాజపా 132 స్థానాలను దక్కించుకోగా, శివసేన 57, ఎన్సీపీ 41 చోట్ల విజయం సాధించింది. మరోవైపు ఏక్‌నాథ్ శిందే కొన్ని రోజులుగా జ్వరం, గొంతునొప్పితో ఇబ్బందిపడుతున్నారు. ఆరోగ్యం మెరుగుపడక పోవడంతో మంగళవారం ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు శిందే సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. థాణెలోని ఓ ఆసుపత్రిలో ఆయన చెకప్ చేయించుకున్నారు. ఆయనకు పలు వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచించినట్లు సదరు వర్గాలు తెలిపాయి.

## పేదవాడి సొంతింటికల సాకారం దిశగా ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి..**

పారదర్శకంగా ఉండేలా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా అర్హులైన వారిని ఎంపిక చేయడానికి వీలుగా మొబైల్ యాప్‌ను రూపొందించాం. ఈ యాప్‌ను ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గురువారం నాడు ఆవిష్కరించనున్నారు. లబ్దిదారుల ఆర్థిక మరియు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం, కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన భూమి వివరాలు వంటి అంశాలు ఈ యాప్ లో ప్రధానంగా ఉండనున్నాయి. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వీలుగా ప్రతి గ్రామం, వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు,

### "ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు"

దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక్కో ఇంటికి 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు,మహిళా పేరు మీద ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఈ ఇండ్లకు నాలుగు దశల్లో లబ్దిదారులకు చెల్లింపులు చేస్తాం. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. ఈ పథకం కింద నిర్మించే ఇండ్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యాలను కలిగి ఉంటాయి. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేది. ఇప్పుడు ఆవ్యవస్థను రద్దుచేసి లబ్దిదారులే ఇళ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పిస్తున్నామన్నారు,లబ్దిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా నిర్మించుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపడతామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు,

### "ఎన్నికల హామీకి కార్యరూపం"

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాలలో దశల వారీగా సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం పూనుకుందని మంత్రి పేర్కొన్నారు.
మొదటి విడతలో భాగంగా ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 నుంచి 4000 ఇండ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విడతలో నివాస స్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, రెండో దశలో ప్రభుత్వమే నివాస స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కర్మాచారులకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు,

### "హౌసింగ్ శాఖ పునరుద్ధరణ"

పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఆ విభాగాన్ని మూసివేసి ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ ఈ శాఖను పునరుద్ధరించి లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుంది. 296 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామని మంత్రి తెలిపారు,ఉమ్మడి రాష్ట్రంలో ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో 2006-2007లో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించింది. తెలంగాణ ప్రాంతంలో 2006-2007 నుంచి 2014 వరకు 23,85,188 ఇండ్లను మంజూరు చేయగా 19,32,001 ఇండ్లను పూర్తి చేసింది. 4,53,187 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసింది" అని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్

**మొదటిపేజీ తరువాయి..**

నిర్మిస్తోందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది అక్టోబర్ 3న జరిగిన గూగుల్ ఫర్ ఇండియా 2024 కాన్‌క్లేవ్‌లోనే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. అప్పటి నుంచి జీఎస్ఈసీని తమ రాష్ట్రంలోనే నెలకొల్పాలని, గూగుల్ పెట్టుబడులను ఆహ్వానించేందుకు దేశంలోని పలు రాష్ట్రాలు పోటీ పడ్డాయి.
కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. దాంతో హైదరాబాద్‌లో ఈ అత్యాధునిక సెంటర్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. ఈ సేఫ్టీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా, గర్వంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గూగుల్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్య ఒప్పందం చేసుకోవటంతో హైదరాబాద్ మరోసారి ప్రపంచంలో మేటీ ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్ అధ్వర్యంలోని కంపెనీ ప్రతినిధి బృందం బుధవారం జూబ్లీహిల్స్ లోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని ఈ సందర్భంగా హాన్సెన్ అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో అయిదు ఫేమస్ టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆపిల్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంఆ పరిష్కరించే వీలుంటుంది.
ఈ సెంటర్ ఏర్పాటుతో వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని' చెప్పారు. హైదరాబాద్ లో భారతదేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ను స్థాపించేందుకు సీఎం రేవంత్ రెడ్డిని గూగుల్ సీఐఓ కలిశారు. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత ఏర్పాటు చేసే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ హైదరాబాద్ లో స్థాపించడం గమనార్హం. ఈ సెంటర్ అధునాతన భద్రత, ఆన్లైన్ భద్రత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవల యూఎస్ఏ లోని గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన సందర్భంగా అక్కడ గూగుల్ సమస్త ప్రతినిధులతో పలు అంశాలను సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. హైదరాబాద్ నగరంలో జిఎస్ఈసిని ఏర్పాటు చేసేందుకు, గూగుల్ ముందుకు రావడం తనకు గర్వంగా ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు.
గూగుల్‌తో జరిగిన ఒప్పందంతో డిజిటల్ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు అవకాశం ఉంటుందని, సైబర్ సెక్యూరిటీ కార్యక్రమాలలో హైదరాబాద్ అగ్రగామిగా నిలుస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ఈ సందర్భంగా హాన్సెన్ మాట్లాడుతూ.. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో పేరొందిన అయిదు టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంఆ పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు.

## వచ్చే ఏడాది నుంచి పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు

### - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 4 (వెలుతురు):**
ప్రతి ఏడాది దీక్షా దివస్ సందర్భంగా నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు విస్తృతంగా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ లిటరేచర్ ఫెస్టివల్‌ను హైదరాబాద్ సహా పాత జిల్లాల కేంద్రంగా నిర్వహిస్తాం. సాహిత్య కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు చేసుకుందామని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ సాహితీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సంస్కృతి, భాషపరంగా తెలంగాణ ఔన్నత్యాన్ని చెప్పుకునే విషయంలో కొంతమేర సఫలం అయ్యాం. బతుకమ్మ, బోనాల పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా జరుపుకున్నాం. తెలంగాణ చరిత్రను, ఉద్యమకారులను సిలబస్‌లో పెట్టుకున్నాం. అదే మాదిరిగా యూనివర్సిటీలకు గొప్ప నాయకులు పేర్లు పెట్టుకున్నాం. పీవీ నరసింహారావు, ప్రొఫెసర్ జయశంకర్, కాళోజీ నారాయణరావు, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి గొప్ప మేధావుల




పేర్లు పెట్టుకున్నాం. కొత్త జిల్లాలకు కూడా ఉద్యమకారుల పేర్లు పెట్టుకున్నాం.. అలా తెలంగాణ చరిత్రను వెలుగెత్తే చాటే ప్రయత్నం చేశామని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభలు కేసీఆర్ నాయకత్వంలో మూడు రోజులు ఘనంగా నిర్వహించాం. రచయితలు, కవులను ఘనంగా సన్మానించుకున్నాం. సాంస్కృతిక సారథి పెట్టి రసమయి బాలకిషన్‌ను చైర్మన్‌గా నియమించి, 500 మంది కళాకారులకు ప్రభుత్వ కొలువులు ఇచ్చాం. ప్రాజెక్టులు కట్టుకుంటే.. ఆయా ప్రాంతంలో ఉండే దేవుళ్ల పేర్లు పెట్టుకున్నాం. కానీ మన పార్టీ నాయకుల పేర్లు పెట్టుకునే ప్రయత్నాలు జరగలేదు. మన డబ్బా మనమే కొట్టుకునే ప్రయత్నం జరగలేదు. ప్రాంతం శాశ్వతం.. అధికారం శాశ్వతం కాదు. తెలంగాణ శాశ్వతం కాబట్టి తెలంగాణ చరిత్ర శాశ్వతంగా గొప్పగా నిలవాలని ఈ ప్రయత్నం చేశాం. కేసీఆర్ పేర్ల మీద ఎలాంటి కార్యక్రమాలు చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కాళోజీ కళాక్షేత్రం వరంగల్‌లో కట్టినా.. ఇతర జిల్లాల్లో కాళోజీ కళాభారతి పేరిట నిర్మించాం. సాహితీ వేత్తలకు, రచయితలకు పెద్దపీట వేశారు కేసీఆర్. గ్రంథాలయాలు కొత్తవి ఎన్నో ప్రారంభించుకున్నాం. ఇంకా జరగాలి అని తెలంగాణ సమాజం కోరుకుంటుంది అని కేటీఆర్ తెలిపారు.

# చోటే మియా.. బడా చోర్...!

- అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ ఎక్సైజ్ శాఖ ఆఫీసు సూపరింటెండెంట్ సయ్యద్ ఒమర్ అలీ
- కమీషనర్లు, ఆఫీసర్లు వస్తుంటారు.. పోతుంటారు
- ఒమర్ అలీ మాత్రం ఆ కుర్చీ వదలడు...కదలడు
- ఏడాదిగా కాదు ఏకంగా 20 ఏళ్లకు పైగా ఒకేచోట విధులు
- సీఐలు, ఎస్ఐలు ఆయన పేరు చెబితేనే వణికిపోతున్న వైనం
- అడిగినంత ముట్టజెప్పకపోతే పదోన్నతులనే రివర్స్ చేసిన ఘనాపాటి
- చెప్పింది చేస్తే ఎవరూ వేలు పెట్టలేని సర్వీస్ బుక్కులో కూడా పుట్టిన తేదీలు మార్పు
- సీనియారిటీ లిస్టులోనూ భారీగా అవకతవకలు.. చాలామందికి అన్యాయం
- 2005 వరకు ప్రమోటీవ్స్, ఆ తర్వాత డైరెక్ట్ రిక్రూట్మెంట్ మాత్రమే తీసుకుని జీవితాలతో చెలగాటం
- ఒమర్ అలీ అక్రమాలపై ఎసిబికి ఫిర్యాదు చేస్తాం
- బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 04: అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి ఉద్యోగులను అధికారులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్న ఎక్సైజ్ ఆఫీస్ సూపరింటెండెంట్ సయ్యద్ ఒమర్ అలీ అక్రమాలపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు బుధవారం నాంపల్లిలోని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఒమర్ అలీ అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.

అనంతరం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ శాఖలో కమీషనర్లు, అధికారులు వస్తుంటారు.. పోతుంటారు కానీ అతడు మాత్రం ఆ కుర్చీ వదలకుండా ఏడాది కాదు 20 ఏళ్లకు పైగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్నాడన్నారు.

ఆబ్కారీ సీఐలు, ఎస్ఐలు ఆయన పేరు చెబితేనే వణికి పోతున్నారని, అడిగినంత డబ్బు ముట్టజెప్పనందుకు పదోన్నతులు పొందిన దాదాపు 50 మంది ఎస్సైలను రివర్స్ చేసిన ఘనాపాటి అని మండిపడ్డారు. సీనియారిటీ లిస్టులోనూ భారీగా అవకతవకలు జరిగాయని, డబ్బులిస్తే ఎవరూ వేలు పెట్టలేని సర్వీస్ బుక్కులో కూడా వేలు పెట్టడం ఈయన నైజమని, వనపర్తి ఎక్సైజ్ అధికారిగా పనిచేసిన ప్రభు వినయ్ గారి పుట్టినతేదీని 1964 కు బదులు 1969 గా మార్చిన ఘనుడని, ఇందుకు గాను దాదాపు 20 లక్షల రూపాయలు కూడా తీసుకున్నట్లు ఒమర్ అలీపై ఆరోపణలు ఉన్నాయన్నారు

ఈవిషయంపై మేము ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే ప్రభు వినయ్‌ను ఈమధ్యనే సస్పెండ్ చేశారని, కారకుడైన ఒమర్ అలిపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు అని ప్రశ్నించారు.

2005 వరకు డైరెక్ట్ రిక్రూట్ మెంట్ ద్వారా ఎస్సైలను నింపాల్సిన కోటాలో పదోన్నతులతో నింపి డిఆర్ కోటాకు అన్యాయం చేశారన్నారు. 2005 నుంచి డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా మాత్రమే తీసుకుని ప్రమోటివ్స్‌కు అన్యాయం చేసి ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని.మండిపడ్డారు.

అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల విషయానికొస్తే... 2015 వరకు పదోన్నతుల ద్వారా భర్తీ చేసి, 2015 తరువాత డిఆర్ కోటాలో మాత్రమే నింపుతున్నారన్నారు..

బదిలీల విషయంలో కూడా అనేక అవకతవకలు జరిగినట్లు తెలుస్తోందని, ఆయనకు డబ్బులిచ్చిన వారికి మాత్రమే మంచి పోస్టింగులు ఇప్పించి, ఇవ్వని వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేసి తీవ్ర మనోవేదనకు గురిచేశారన్నారు.

ఒమర్ అలీ తనకున్న అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికారులను, ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేసి దాదాపు వందల కోట్లు సంపాదించినట్లు అతడిపై ఆరోపణలున్నాయని, చోటేమియా... బడా చోర్ అన్న చందంగా ఆయన తీరు ఉందని, ఆయన అక్రమ ఆస్తులపై ఎసిబికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, కమీషనర్లు, అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇకనైనా స్పందించి ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేసి నిజాయితీ గల ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి సలహాదారు బడేసాబ్, బిసి విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి గౌడ్, గాలిగల్ల సాయిబాబా, రఘురాం గౌడ్, వెంకట్, వెంకన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## మదీనాగూడలోని శ్రీ చైతన్య కాలేజి
# గుర్తింపు రద్దు చేయాలి

**విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థినులకు అసభ్యకర మెసేజ్‌లు పంపడం దుర్మార్గమైన చర్య : జాజుల లింగంగౌడ్**

హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 04: మదీనాగూడ లోని శ్రీ చైతన్య కాలేజీలో పనిచేసే వైస్ ప్రిన్సిపల్ విద్యార్థినులకు అసభ్యకర మెసేజ్ లను స్నాప్ చాట్ లో పంపిస్తూ మానసికంగా వేధిస్తు శునాకనందం పొందుతున్న అతనిని అరెస్ట్ చేసి,కళాశాల గుర్తింపు రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కళాశాల ముందు నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ ఇప్పటికే కార్పొరేట్ కాలేజీల ఒత్తిడికి తట్టుకోలేక అనేకమంది మానసిక వేదనతో ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఆ సంఘటనలు మరవక ముందే మదీనాగూడ భారతి భవన్ శ్రీ చైతన్య కాలేజీలో అమ్మాయిలను వేధించిన సంఘటన జరగడం దురదృష్టకరం.విద్యాబుద్ధులు నేర్పిస్తూ కంటికి రెప్పలా కాపాడుతూ గొప్ప ప్రయోజకులను చేయాల్సిన అధ్యాపకులే సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తిస్తూ అసభ్యకరమైన మెసేజ్ లను స్నాప్ షాట్ లో పంపడం చాలా దుర్మార్గమైన సంఘటనని అన్నారు.వేంటనే అతనిని అరెస్టు చేసి కళాశాల గుర్తింపు రద్దు చేయాలని లింగంగౌడ్ దిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన విద్యార్థి పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్ గౌడ్, గోదా రవికుమార్, బండి నరేష్

# హిందువుల ఐక్యతను చాటాలి

**- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 04: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దౌర్జన్యాలు తక్షణమే ఆగాలని, ఇస్కాన్ ప్రతినిధి చిన్మయి కృష్ణ దాస్‌ను అన్యాయమైన జైలు శిక్ష నుండి విముక్తి చేయాలనీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బంగ్లాదేశ్‌లో





హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందు ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సంఘీభావ సభ నిర్వహించారు.

ఎమ్మెల్యేతో పాటు మాటదిపతి శ్రీ యోగానంద సరస్వతి, పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు మాట్లాడుతూ... బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అమానవీయ హింసలు ఆందోళన కరమని అన్నారు. దాడి ఘటనలను ఆపేందుకు అక్కడి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని, బంగ్లా ప్రభుత్వ నిస్సహాయత కారణంగా హిందువులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ పీఠాధిపతి హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## బుర్ర వెంకటేశం, ఐఏఎస్‌కి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర "గోపా" కార్యవర్గము

హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 04: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా త్వరలో బాధ్యతలు చేబట్టబోతున్న బుర్ర వెంకటేశం, ఐ ఏ ఎస్ గారిని బుధవారం రోజున మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన గోపా రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యులు. ఈ సందర్భంగా వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ "గోపా" అభివృద్ధి కోసం పలు సూచనలు చేశారు. అందులో ముఖ్యంగా గోపాను గ్రామ స్థాయిలో ప్రతీ పది - పదిహేను సభ్యులతో ఒక క్లబ్ గా ఏర్పాటు చెయ్యాలి. అందులోని ఒక్కొక్క క్లబ్ నుంచి ఓక్కొరు కలిసి గ్రామ క్లబ్ గా, అందులో నుండి మండల క్లబ్‌గా, ఆ తర్వాత ప్రతీ మండల కమిటీ నుంచి ఒక్కొక్క సభ్యుడిని తీసుకుని డివిజన్ కమిటీని ఏర్పాటు చేయాలి.



ఆ తరువాత ఒక్కొక్క డివిజన్ కమిటీ నుంచి ఒక్కో సభ్యున్ని తీసుకుని జిల్లా కమిటీగా ఏర్పాటు చేయాలి, ఆ తర్వాత కొన్ని జిల్లాలను కలిపి జోనల్ కమిటీలుగా ఏర్పాటు చేయాలని అలా చేయడం వల్ల సభ్యులకు చేరువ కావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది, అతి త్వరగా ఆర్గనైజేషన్ అభివృద్ధి చేయడానికి సునాయాసంగా ఉంటుంది అని తెలియచేసారు. బుధవారం రోజున కలిసిన కమిటీ సభ్యులలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ ప్రధాన కార్యదర్శి గౌడిశాల వెంకట శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్, కార్యనిర్వహక కార్యదర్శి యల్మకంటి మీరయ్య గౌడ్‌లు ఉన్నారు.

# కాంగ్రెస్‌పై బిఆర్ఎస్ దాడి ఎందుకు చేస్తుంది...!?

- దాడిని ఎందుకు తిప్పికొట్టటం లేదు..?
- సూత్రదారులెవరు..? పాత్రదారులేవరు...!?
- రాజు, మంత్రి, బంటుగా రేవంత్ రెడ్డి మాత్రమేనా...!?
- మంత్రులు, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు...!?
- కాంగ్రెస్ వాదులు, కార్యకర్తలు ఎక్కడ...!?
- మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి..!?
- కాంగ్రెస్ నాయకుల గాలివాటం ధోరణికి అంతం లేదా..!?
- ఐఎన్టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్ధారం 9441739988





వెలుతురు హైదరాబాద్ డిసెంబర్ 04, 2024: కాంగ్రెస్ పార్టీ మూలాలు లేకుండ చేస్తాం బీజేపీ. కాంగ్రెస్ ను మట్టుపెడతాం బిఆర్ఎస్ ఇలా ఒకరిపై ఒకరు ఒకరిని మించి ఒకరు కాంగ్రెస్ పై విరుచుకు పడుతుంటే పార్టీ నాయకత్వం మన్ను తిన్నపాములా పదవుల మాయలోపడి అది పర్మనెంట్ సీటు అయినట్టుగా వ్యవహారం కొనసాగటం చూస్తుంటే కొందరి పదవి అధిరోహకుల జీవితం ఇంతేనా అనిపిస్తుంది. తెలంగాణ ప్రజల అకాంక్షలు నెరవేర్చగల సత్తా రేవంత్ రెడ్డి కి ఉంది అన్న ధీమాతో కెసిఆర్ పై ఉన్న వ్యతిరేకం, బిఆర్ఎస్ మంత్రుల అహంకారం, ఆ ఎమ్మెల్యేల నిర్వాకం మాత్రమే మీకు తెలంగాణ ప్రజల చేత ఈ అవకాశం ఇవ్వబడిందని గ్రహించి ప్రజా శ్రేయస్సుకోసం రేవంత్ రెడ్డి నాయకత్వం వైపు ప్రజలు మొగ్గారు అనటానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. వాస్తవానికి 2018ఎన్నికల్లోనే కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు ఎన్నోరేట్లు అవకాశం ఉన్నది. కానీ అప్పటి నాయకత్వం కెసిఆర్ కు ఢీ కొట్టగల దమ్ము దైర్యం లేదని అంతటి ఘట్స్ ఉన్నవారు లెరని తొండో, మొండో కెసిఆర్ కే అవకాశం ఇస్తే కనీసం వచ్చేది అయినా వస్తుందని కాంగ్రెస్ పార్టీ లో ఉన్న ప్రస్తుత చర్యలే అప్పుడు కూడా ఉంటాయని ప్రజలు బలంగా నమ్మి ఆ రిజల్ట్ ఇచ్చారు.

ఇలా దెబ్బతిన్న పార్టీని కనీసం నమ్మలేని పరిస్థితిలో ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతుంటే చెంప దెబ్బ, గోడ దెబ్బ రెండు తగులుతుంటే వాటాన్నింటిని తట్టుకుంటూ కూతురి పెళ్లి అనగా రేవంత్ ను లొంగదీసుకునేందుకు తలుపులు బద్దలు కొట్టి అరెస్ట్ చేస్తే అటువంటి అనేక ఒడి దుడుకులను సైతం ధీమాతో ఎదుర్కొని నిలబడ్డ రేవంత్ రెడ్డికి సహకరించి ఎక్కడికక్కడ ఘాటు విమర్శలు చేసే బద్మాష్గాళ్ళకు అదే రీతిలో సమాధానం చెప్పకుండా ఒంటరిని చేసి కొందరు కాంగ్రెస్ లో ఉండి తల్లిపాలు తాగి తల్లి రొమ్మును గుద్దే చర్యలకు పాల్గొంటూ వాడు చస్తే మేళాయే వాని ఆలి నాదాయె అన్న ఛందంగా రేవంత్ రెడ్డి గద్దెదిగితే నేను సీఎం అవుతానని పిచ్చి కలలు కంటూ భ్రమలో బ్రతుకుతున్నారు. రేవంత్ రెడ్డి ని పక్కకు జరిపే కుట్ర ఆల్రెడీ బీజేపీ, బిఆర్ఎస్ లు చేస్తూనే ఉన్నాయి. ఇక మీరు చేసేది ఏందీ అని తెలంగాణ ప్రజలు గ్రహిస్తూనే ఉన్నారు. మిమ్మల్నే గోతికాడి నక్కల వలే, శవాలపై పేలాలు ఏరుకునే మూరు?ల వలే చూస్తున్నారు అది గ్రహించండని ప్రజలు అంటున్నారు.

ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం తన మన తేడా గ్రహించకపోతే అనేక ఇబ్బందులు సైతం కొనసాగక తప్పదు. ఎందుకంటే భజనగాళ్ళ వల్లనే బిఆర్ఎస్ మునిగింది. అదేవిధంగా కొందరు భజనగాళ్లు నీ చుట్టూ ఉన్నారని గ్రహించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా ఇంటలీజెన్స్ రిపోర్ట్ కూడా ఎప్పటికప్పుడు, ఏ రోజుకారోజు నిత్యం పర్యవేక్షణ అవసరం.

ఇక ఇక్కడ ఒక హాస్యస్పద విషయం ఏమిటంటే ఆర్ ఎస్ ప్రవీణ్ కు ఉన్న కనీస దర్మం కాంగ్రెస్ మంత్రులకు లేకపోవటం గమనార్హం. ఎందుకంటే బిఎస్పీలో ఉన్నంత కాలం కేసీఆర్ కేటీఆర్, హరీష్ రావు, కవిత, సంతోష్ లను రాయటానికి వీలు లేని సంస్కృతం వాడిన భూత.... పురాణం ఎంతటిదో తెలంగాణ ప్రజలందరికీ తెలుసు. అయినా ఇప్పుడు ఎంత రెచ్చిపోయి రెచ్చగొట్టి మాట్లాడుతున్నాడో కూడా తెలుసు అయినా చేతకాని దద్దమ్మల వలే మన వర్గం మిన్నకుండటం చూస్తుంటే నవ్వొస్తుంది. కావున మంత్రులు, ఎమ్మెల్యే లు, డీసీసీ లు, మండల ప్రెసిడెంట్ లు బిఆర్ఎస్ కుట్రలను ఎప్పటి కప్పుడు ఎక్కడికక్కడ అదే రీతిలో తిప్పికొట్టకపోతే మీ భవిష్యత్ మీకే కనిపించటం ఖాయం అనవచ్చు. ఇక నామినేటెడ్ పోస్ట్ నాయకులు కూడా కనీస చిత్త శుద్ధిని చూపి ప్రభుత్వంపై విరుచుకు పడే వీరోచితులకు ఎప్పటికప్పుడు వాస్తవిక విధానంతో ఎండగట్టకపోతే మీ బ్రతుకులు కుక్కలు చించిన విస్తరులే అని గ్రహించండి. ఇక ఇంతకు మించి మీకు చెప్పినా సూచించినా మారకపోతే మీరు కూర్చున్న కొమ్మను మీరే నరుక్కోవటం ఖాయం అని గుర్తించాలి. అలాగే ప్రజలకు ప్రభుత్వంపై సడలుతున్న నమ్మకం సైతం మనవల్లే అని గ్రహించాలి. ముఖ్యమంత్రి చేపట్టిన ప్రతి కార్యక్రమం ప్రజాశ్రేయస్సే కానీ వ్యక్తిగతం కాదని ఆధారాలతో గ్రామస్థాయి ప్రజల్లోకి తీసుకుని వెళ్ళాలి కానీ, నా పూట గడుస్తుంది అనే ధోరణి వీడాలి. ప్రజాప్రభుత్వానికి రవాణా రంగం కీలకం ప్రజలనాడిని ప్రతి నిత్యం పరీక్షించగల ఏకైక మార్గం అదేకావున ముఖ్యమంత్రి దానిపై ద్రుష్టి సారిస్తే వందకు వందశాతం వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉందని గ్రహించాలని పార్టీ గెలుపులో కృషి చేసిన అనేకమంది కార్యకర్తల, నాయకుల అభిప్రాయం. నా వ్యక్తిగత బలమైన నమ్మకం.







## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో
# వరల్డ్ ఎయిడ్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహణ

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వెలుతురు డిసెంబర్ 04: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి నేతృత్వంలో వరల్డ్ ఎయిడ్స్ డే కార్యక్రమం మల్కాజ్‌గిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సంవత్సరం థీమ్ "టేక్ ద రైట్స్ పాత్: మై హెల్త్, మై రైట్"గా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి టీజీఎస్ఏసీఎస్ రాష్ట్ర సంయుక్త డైరెక్టర్ డాక్టర్ పి.ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రతినిధులు మరియు వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించి, అనంతరం ప్రముఖులతో దీప ప్రజ్వలన కార్యక్రమం జరిగింది, హెచ్ఐవీ/ఎయిడ్స్ పై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. సభలో ప్రసంగించిన డాక్టర్ పి. ప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులను ఎప్పుడూ కరుణతో చూడాలని, మానసిక ప్రోత్సాహం అందించాలని చెప్పారు. గత 14 ఏళ్లలో తెలంగాణలో హెచ్ఐవీ ప్రబలత్వం 0.84% (2010) నుండి 0.44% (2024) కు తగ్గడం ముఖ్యమైన విజయమని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలోని 30 ఆర్టీ (ఆంటీ రెట్రోవైరల్ థెరపీ) కేంద్రాలు హెచ్ఐవీ బాధితులకు సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు.

అనంతరం డాక్టర్ టి. రఘునాథ్ స్వామి నేతృత్వంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. వివిధ విద్యాసంస్థల విద్యార్థుల నుండి ఉత్సాహభరితమైన స్పందనతో నిర్వహించిన పోస్టర్-మేకింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే, ఉత్తమ సేవలందిస్తున్న ఎన్జిఓలకు మరియు వాలంటీర్లకు అవార్డు ఇచ్చారు.

డాక్టర్ శ్రీదేవి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, వోట్ ఆఫ్ థాంక్స్ తెలుపుతూ ప్రసంగిస్తూ, హెచ్ఐవీ/ఎయిడ్స్ పై అవగాహన కల్పించడంలో ఈ కార్యక్రమాలు ముఖ్యమని చెప్పారు. ప్రజలు సత్ఫలితాలను పొందేందుకు ఆరోగ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, అలాగే హెచ్ఐవీ పై శాస్త్రీయ అవగాహన కలిగిన, సానుభూతితో కూడిన సమాజాన్ని నిర్మించడంలో తమ పాత్ర పోషించాలని ఆరోగ్య సిబ్బందిని కోరారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ శోభారాణి (ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, మల్కాజ్‌గిరి డివిజన్),

డాక్టర్ సత్యవతి (ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, కీసర డివిజన్), డాక్టర్ గీతా ప్రసాద్ (జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్‌యూహెచ్ఎమ్ & సీఈఏ), డాక్టర్ సరస్వతి (జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి), డాక్టర్ పద్మావతి (జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, టిడీ మినీ హబ్‌లు), డాక్టర్ కౌశిక్ (సహాయ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్సీడీ), డాక్టర్ విజయ నిర్మల (వైద్య అధికారి), డాక్టర్ వెంకట్ నరేష్ (సహాయ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్‌వీబీడీసీపీ) పాల్గొన్నారు.

# సంపాదకీయం

### ఇక పిల్లాడికి పెళ్లవుతుందా?

## మారుతున్న అమ్మాయిల ఆలోచనలు

ఎనబయ్యో దశకం వరకు మగపిల్లలకి పెళ్లి కావాలంటే కనీసం ప్రభుత్వ ఉద్యోగమో, టీచరు లేదా బ్యాంక్ జాబో ఉండాల్సిన పరిస్థితి. దాంతో పాటూ అబ్బాయిల వైపు నుంచి కట్నకానుకల డిమాండ్స్ ఎలాగూ ఉంటాయి. అదే తొంబైల తర్వాత గాలి అమెరికా వైపుకు వీయడం మొదలు పెట్టింది. అమ్మాయిల ఆలోచనల్లో ఇండియాలోనే ఉండే పెద్ద ఉద్యోగం వాడికంటే అమెరికా భర్త

అయితే బాగుంటుందని కోరుకోవడం ఎక్కువయ్యింది. దాంతో ఎన్నారై మ్యాచ్‌లకు గిరాకీ పెరిగింది. కట్నాలు కూడా దానికి తగ్గట్టే ఉండేవి. క్రమంగా రోజులు మారుతూ వచ్చాయి. గల్లీకొ పిల్లడు అమెరికాలో ఉండడం వల్ల, కేవలం ఎన్నారై స్టాటస్ కాకుండా, అబ్బాయికి ఆస్తిపాస్తులుం టేనే పెళ్లికి రెడీ అంటున్నారు అమ్మాయిలు. అబ్బాయిల సంఖ్య పెరిగి, అమ్మాయిల సంఖ్య తగ్గడంతో కట్నాల డిమాండ్స్ కూడా తగ్గుతూ వచ్చాయి. 'మంచి అమ్మాయి దొరికితే చాలు.. కట్నాలక్కర్లేద'నే రోజులు వచ్చాయి. దాంతో అమ్మాయిలకే డిమాండ్ పెరిగింది. కట్నాలు డిమాండ్ చేసే అబ్బాయిలు తగ్గారు. తెలియని వాళ్లకి ఇది ఆశ్చర్యంగా అనిపించవచ్చు. కానీ, అబ్బాయిల పెళ్లిళ్ల కోసం వధువుని వెతుక్కుంటూ మ్యాట్రిమోనీ సైట్లల్లో తొంగిచూసే తల్లిదండ్రు లకి కళ్లు బయర్లు కమ్ముతున్నాయి. తమ కొడుకు అమెరికాలో హెచ్ 1 బి మీద ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడని చెబితే చాలు అమ్మాయిలు క్యూ కడతారు అనుకునే వాళ్లకి చుక్కెదురవుతోం ది. కేవలం అమెరికా ఉద్యోగం సరిపోదంటున్నారు అమ్మాయిలు. ఫ్యామిలీ ఫైనాన్షియల్ స్టాటస్ లోనూ, చదువులోనూ, అందచందాల్లోనూ జస్ట్ యావరేజ్ అనిపించే అమ్మాయిలు అమెరికాలోనూ, ఇండియాలోనూ సొంత ఇళ్లు ఉండాలంటున్నారు. లేదా కనీసంలో కనీసం 10-15 ఎకరాల పొలమైనా ఉండాలట. ఈ తరహా అమ్మాయిల తల్లిదండ్రుల్లో చాలామందికి సొంత ఫ్లాట్ కూడా ఉండట్లేదన్నది ఇక్కడ కఠిన వాస్తవం. అబ్బాయిల తల్లిదండ్రులు నచ్చిన సంబంధం

కోసం ఒక ఏడాది కాలయాపన చేసి వెనక్కి వచ్చి చూస్తే ఈ రకం అమ్మాయిల్లో సగం



మందికి పెళ్లిళ్లు కుదిరిపోతున్నాయి. అంటే వాళ్లకి కావాల్సిన వరులు దొరికేస్తున్నారని అనుకోవాలి.

ఇక కొద్దో గొప్పో ఆస్తి ఉండి, అందచందాలు కూడా ఉంటే ఇక ఆ అమ్మాయిల కోరికలు అన్నీ ఇన్నీ కావు. పదుల కోట్లల్లో ఆస్తులు, విల్లాలు, అమెరికాలో టాప్ యూనివెర్సిటీ బ్యాక్ గ్రౌండ్ ఉండి టాప్ లెవెల్లో జాబ్ ఉన్న అబ్బాయిలు మాత్రమే కాకుండా, కచ్చితంగా గ్రీన్ కార్డ్ వాళ్లు కావాలని కోరుకుంటున్నారు. ఆ రేంజ్ అబ్బాయిలు కూడా ఇలాంటి వాళ్ల కోసం వెతుక్కుని వచ్చి పోటీ పడి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. లవ్ మ్యారేజీలైతే ఓకే కానీ, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలంటే ఆ పెద్దలకి చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక ఇప్పుడు పరిస్థితి మరీ కఠినంగా మారుతోంది. ట్రంప్ ప్రమాణస్వీకారం తర్వాత అమెరికాలో సీన్ మారుతోంది. హెచ్ 1 బి శాశ్వతంగా ఎత్తేస్తున్నాడని టాక్. అలాగే టాప్ యూనివర్సిటీల్లో సీట్ పొంది మెరిట్లో పాసైన విద్యార్థులకి మాత్రం సత్వరం గ్రీన్ కార్డ్ ఇచ్చేస్తానంటున్నాడు. అంటే వాళ్లకి తప్ప ఎ-క్లాస్ అమ్మాయిలు దొరికే పరిస్థితి ఉండదు ఇండియన్ మ్యారేజ్ మార్కెట్లో. క ఇందాక చెప్పుకున్న యావరేజ్ అమ్మాయిల పరిస్థితి కూడా మారనుంది. వాళ్ల కోరికలు తగ్గించుకోవాల్సిన పరిస్థితి రాబోతోంది. ఎన్నారై సంబంధాలే.. కావాలంటే కుదరదు. ఎందుకంటే హెచ్ 1 బి లేకపోతే ఎన్నారై పెళ్లికొడుకులే తగ్గిపోతారు కాబట్టి. ఉన్నంతలో ఇండియాలోనే పెద్ద ఉద్యోగం, మంచి సంపాదన ఉన్నవాళ్లని వెతుక్కోవచ్చు. అమ్మాయిల్లో ఈ కాంప్రమైజ్ వల్ల అబ్బాయిలకి పెళ్ళిళ్లు ఈజీగా అవుతాయా అంటే చెప్పలేం. ఎందుకంటే మారిన సినారియోలో ఇండియాలో నిరుద్యోగులు పెరిగే అవకాశాలున్నాయి. కొద్దో గొప్పో ఉద్యోగాలుంటేనే పరిస్థితి కష్టంగా ఉంటే, ఇక ఉద్యోగం లేని అబ్బాయిల్ని చేసుకునేదెవరు? ఆస్తులుంటే కాస్త పర్వాలేదనుకోవాలి. అందుకే ఈ పరిస్థితిని దాటాలంటే అమెరికాని వదిలేసి మరో దేశాన్ని వెతుక్కోవాలేమో భారతీయ యువకులు. అలా అనుకుందామనుకున్నా అమెరికా తర్వాత డిమాండ్ ఉన్న దేశం కెనెడా. అక్కడ జాబ్ మార్కెట్ అమెరికా అంత స్ట్రాంగ్ కాదు. ఆ తర్వాత యూకే. అది ఆల్రెడీ ఇబ్బందుల్లో ఉంది. అసలక్కడ చదివిన ఏ భారతీయుడైనా తిరిగి ఇంటికొస్తున్నాడే తప్ప అక్కడ జాబ్ పొందడం చాలా కష్టంగా ఉంది. ఇక మిగిలింది ఆస్ట్రేలియా. అక్కడ కూడా జాబ్ వీసాలు కఠినమయ్యాయి. మరి ఎప్పటికప్పుడు పెరిగిపోతున్న భారతీయ యువ జనాభాకి ప్రపంచంలో మంచి చోటెక్కడ అనేది ప్రశ్న. దీనికి కాలమే సమాధానం చెప్పాలి.

## ఏపీ ప్రజలకు సంక్రాంతి కానుక ఇదే..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మరో భారీ శుభవార్త చెప్పను న్నారు. సంక్రాంతి కానుకగా మరో సంచలన పథకాన్ని అమలు చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతి సారీ సంక్రాంతి వచ్చిందంటే చాలు రాష్ట్ర ప్రజలకు ఏదో ఒక రూపంలో కానుకలు అందించేవారు. అయితే ఈ సారి భారీ మెజారిటీతో అధికారం చేపట్టిన కూటమి మరికొద్ది రోజుల్లో రానున్న సంక్రాంతికి ఎటువంటి కానుకలు ఇవ్వనుందో అని ప్రజలలో లోనూ ఆసక్తి నెలకొంది. కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రజలు కూటమి మేనిఫెస్టోలో ఉన్న వాటిని ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేశారు. ఈ తరుణంలో వచ్చే సంక్రాంతికి ఏ పథకాన్ని సీఎం చంద్రబాబు సర్కార్ అమలు చేయబోతోందోనని ప్రజలు వేయి కళ్లతో చూస్తున్నారు.




అయితే గతంలో కూటమి సర్కార్ ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేస్తుందనే ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వం దీనికి సంబంధించి ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ పథకాన్ని సంక్రాంతి కానుకగా రాష్ట్రంలో అమలు చేస్తే మహిళలకు మేలు జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఈ పథకాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభించే యోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. మరోవైపు ఈ పథకానికి సం బంధించి ప్రభుత్వం ఇప్పటికే పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో ప్రత్యేక బృందాల ద్వారా అధ్యయనం చేసి డీటెయిల్డ్ రిపోర్ట్ తయారు చేసినట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని అమలు చేయడా నికి కావాల్సిన విధివిధానాలు, ఏ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి, ఆర్టీసీపై పడే భారం, రాష్ట్ర ఖజానాపై పడే భారాలపై అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. రాష్ట్రంలోని పలువురు మంత్రులు ఇదివరకే ఈ పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. త్వరలోనే ఈ పథకానికి కావాల్సిన, అవసరమైన నిధులు, కేటాయిం చాల్సిన బస్సులు వంటి వాటిపై ఆర్టీసీ అధికారులతో ప్రభుత్వం చర్చలు జరిపే అవకాశం ఉంది. అయితే సంక్రాంతికి కూటమి సర్కార్.. ఉచిత బస్సు పథకం మే కాకుండా తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1,500 ఆర్థిక సాయం పథకాల్లో ఏదో ఒకదానిని అమలు చేసే అవకాశం ఉంది. ఈ పథకాల అమలుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. వీలైనంత త్వరగా ప్రభుత్వం వీటిని అమలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ఈ పథకాలు అమలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు భారీ లబ్ది చేకూరనుంది.

# మూడేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో పాక్

ఉగ్రవాద కార్యకలాపాలు, రాజకీయ ఘర్షణలు, మతపరమైన హింసాకాండతో దాయాది దేశం పాకిస్తాన్ అతలాకుతలమవుతోంది. మూడేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన దేశాన్ని ఎలా గట్టెక్కించాలో తెలియక అధికారంలో ఉన్న సంకీర్ణ ప్రభుత్వం తలపట్టుకుంటోంది. ఒకవైపు దేశంలోని కొన్ని ప్రాంతాల్లో షియా- సున్నీల ఘర్షణలు తీవ్రతరమవుతున్నాయి. పది రోజుల క్రితం ఖైబర్ పంఖ్తూన్ ఖ్వా రాష్ట్రంలోని కుర్రంలో తలెత్తిన షియా- సున్నీ ఘర్షణలు 150 మందిని బలిగొన్నాయి. మరోవైపు బలూచిస్థాన్‌లో చైనా-పాకిస్తాన్ కారిడార్‌పై వేర్పాటువాదుల దాడులు ఉధృతమవు తున్నాయి. ఇక ఉగ్రవాదుల దాడులు ఉండనే ఉన్నాయి.

గోరుచుట్టుపై రోకటిపోటులా మాజీ ప్రధాని, ఒకప్పటి క్రికెట్ స్టార్ ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్- ఏ-ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ మద్దతుదారులు చీటికీమాటికీ చేపడుతున్న నిరసనలు ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత ఏడాదిన్నరగా ఇమ్రాన్ జైలులోనే ఉన్నారు. ఆయనపై దాదాపు 150కి పైగా కేసులు విచారణలో ఉన్నాయి. వాటిలో కొన్నింటి లో నేరం నిరూపితమై గత ఏడాది మేనుంచి ఆడియాలా జైలులోనే మగ్గుతున్నారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ జైలునుంచే ఇచ్చిన లాంగ్ మార్చ్ పిలుపునకు స్పందించిన కార్యకర్తలు దేశ రాజధాని ఇస్లామాబాద్ ముట్టడికి భారీయెత్తున తరలివచ్చారు.

ఇమ్రాన్ మూడో భార్య బుష్రా బీబీ నాయకత్వంలో ఇస్లామాబాద్‌కు తరలివచ్చిన వేలాది కార్యకర్తలను అడ్డుకోవడం పోలీసులకు చేతగాకపోవడంతో ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దింపింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతోపాటు రాజధాని నగరాన్ని షట్‌డౌన్ చేసింది. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సైన్యం జరిపిన కాల్పుల్లో పదిమంది వరకూ పిటిఐ కార్యకర్తలు మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. దేశ రాజధానిలో నిరసన ప్రదర్శనలు చేపట్టరాదన్న చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఇమ్రాన్ దంపతులతోపాటు వందలాది కార్యకర్తలపై ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్లు ప్రభుత్వం అభియోగాలు మోపడం తాజా పరిణామం. ఈ ఆరోపణలు రుజువైతే ఇప్పటికే జైలులో మగ్గుతున్న ఇమ్రాన్, ఆయన సతీమణి కటకటాలకే పరిమితమయ్యే ప్రమాదం లేకపోలేదు. పొరుగు దేశంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పలు సందర్భాల్లో పిటిఐ భారీస్థాయిలో నిరసనలు చేపడుతూ ప్రభుత్వాన్ని చీకాకు పెడుతూనే ఉంది. పాక్ సైన్యానికి, అమెరికాకు కంటగింపుగా మారి, పదవీచ్యుతుడైన ఇమ్రాన్‌కు ఇప్పటికీ స్వదేశంలో విపరీతమైన జనాదరణ ఉంది. ఇదే ప్రస్తుత ప్రభుత్వానికి కంటిమీద నిద్ర లేకుండా చేస్తోంది.

ఇమ్రాన్ జైలునుంచి బయటికొస్తే మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకోవడం ఖాయమన్న భయంతో ఆయనను జైలులోనే ఉంచేందుకు ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోంది. ప్రపంచీకరణను అందిపుచ్చుకుని భారత్, చైనా, బంగ్లాదేశ్



అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తే, పాకిస్తాన్ మాత్రం ఈ రేసులో వెనుకబడింది. పదవులను కాపాడుకునేందుకు భారత దేశంపై అక్కసు వెళ్లగక్కుతూ, ఉగ్రవాదులకు అండదండలు అందిస్తూ తనకు తానే గోతులు తవ్వుకుంది. నాలుగేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి విలవిల్లాడుతున్న పాకిస్తాన్‌కు రాజకీయ అస్థిరత పెనుశాపంగా పరిణమించింది. దాయాది దేశంలో ప్రజలు నిత్యావసర సరకులు సైతం దొరక్క ఆకలితో అల్లాడుతున్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అందిన చోటల్లా ప్రభుత్వం అప్పులు చేస్తోంది. గత ఏడాది దివాలాకు చేరువకావడంతో అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి మూడు బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం పొంది, అప్పటికి గండం నుంచి గట్టెక్కగలిగింది. తాజాగా మరో ఏడు బిలియన్ డాలర్లకోసం దేహీఅనడంతో ఐఎంఎఫ్ అనేక షరతులు విధించింది. ఫలితంగా పాలనాపరమైన వ్యయాలను తగ్గించుకోవడంలో భాగంగా లక్షన్నర ఉద్యోగాలకు కోత పెట్టకతప్పలేదు. చివరకు మంత్రిత్వశాఖలను సైతం విలీనం చేసుకోవలసిన దుస్థితి దాపురించింది.

ఈ నేపథ్యంలో ఆర్థిక పరిస్థితిని గట్టెక్కించేందుకు తంటాలు పడుతున్న ప్రభుత్వానికి ఇమ్రాన్ పార్టీ నుంచి ఎదురవుతున్న రాజకీయ నిరసనలు తలనొప్పిగా పరిణమిస్తున్నాయి. సైనిక కుట్రలకు వెరచి, ఇతర అగ్రనేతల మాదిరి దేశాన్ని వదిలి పారిపోకుండా జైలు నుంచే పోరాట పటిమ కనబరుస్తున్నందుకు ఇమ్రాన్‌ను అభినందించవలసిందే.

అయితే దేశం సంక్షోభంలో కూరుకుపోయిన వేళ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేవిధంగా కార్యకర్తలను రెచ్చగొడుతూ, అశాంతికి, అల్లర్లకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు ఆయనపై వెల్లువెత్తుతున్నాయి. ఆర్థిక సంక్షోభంనుంచి గట్టెక్కాలన్నా, రాజకీయ అస్థిరతను చల్లార్చాలన్నా సైన్యం, ప్రభుత్వం ఒక తాటిమీదకు వచ్చి, విపక్ష పార్టీ ప్రతినిధులతో చర్చలు జరిపి, దేశం కుదుటపడేందుకు ఒక నిర్ణయానికి రావలసిన అవసరం ఎంతైనా ఉంది.

# మైనార్టీల భద్రత గాలిలో దీపం




మతపరమైన హింసకు బంగ్లాదేశ్ ఆలవాలంగా మారుతోంది. షేక్ హసీనా గత ఆగస్టులో ప్రధాని పదవిని వదిలి, ఇండియాలో తలదాచుకున్నప్పటినుంచీ బంగ్లాదేశ్ లోని మతఛాందసవాదులు హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం పరిపాటిగా మారింది. ఒక అంచనా ప్రకారం గత ఐదు నెలల్లో హిందువులపై 200కి పైగా దాడులు జరిగాయి. తొమ్మిదిమంది చనిపోగా, వందల సంఖ్యలో హిందువులు గాయపడ్డారు. భారీయెత్తున హిందువుల ఆస్తులు విధ్వంసానికి గురయ్యాయి. బంగ్లాదేశ్ లో శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి? నోబెల్ శాంతి బహుమతి విజేత మహమ్మద్ యూనుస్ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినా, ఈ దాడులు పెరిగాయే తప్ప తగ్గిన దాఖలాలు కనిపించడం లేదు. తాజాగా ఇస్కాన్ మాజీ అధికార ప్రతినిధి, బంగ్లాదేశ్ సనాతన్ జాగరణ్ మంచ్ నేత అయిన చందన్ కుమార్ దాస్ అలియాస్ చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టుతో ఉద్రిక్తతలు మరింత పెచ్చరిల్లాయి. పదిహేడు కోట్ల బంగ్లా జనాభాలో హిందువుల సంఖ్య కోటిన్నరకు మించదు. ఇతర మైనారిటీ వర్గాల సంఖ్య మరింత అల్పం. హిందువులలో అధికశాతం ఓటర్లు షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీకి మద్దతు ఇస్తారనే దుగ్ధతో, అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లు హసీనా ప్రభుత్వంపై పెల్లుబుకిన ప్రజాగ్రహం, ఇప్పుడు హిందువులపైకి మళ్ళింది. వారిపై మతఛాందసవాదులు దాడులకు పాల్పడుతూ, ఆస్తులను విధ్వంసం చేస్తూ వికృతానందం పొందుతున్నారు. చిట్టగాంగ్ లో ఇటీవల జరిగిన ఓ భారీ బహిరంగ సభలో జాతీయ పతాకానికంటే ఎత్తులో కాషాయ జెండాను ఆవిష్కరించి, తమ దేశ పతాకాన్ని అగౌరవపరిచారంటూ వచ్చిన ఓ ఫిర్యాదును ఆధారంగా చేసుకుని అక్కడి పోలీసులు కృష్ణదాస్ ను అరెస్టు చేసి, జైలుకు పంపారు. అంతటితో ఆగకుండా కృష్ణదాస్ తోపాటు మరో 18మంది బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు.

చిట్టగాంగ్ లోని పుండరీక ధామ్ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్న కృష్ణదాస్ హిందువుల రక్షణకోసం పోరాటం సాగించడంలో ముందు వరసలో ఉంటున్నారు. హిందువుల పరిరక్షణకోసం ఆయన ఎనిమిది డిమాండ్లు చేసి, వాటి సాధనకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. హిందువులపై జరుగుతున్న దాడులపై విచారణకు ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం, బాధితులకు పరిహారం చెల్లించడం, ధ్వంసమైన ఆస్తులకు పరిహారం చెల్లించడం వంటివి ఆయన డిమాండ్లలో ప్రధానమైనవి. ఇటీవల జరిగిన అల్లర్ల నేపథ్యంలో యూనుస్ మైనారిటీ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరిపినా, జాగరణ మంచ్ డిమాండ్లపై మాత్రం పెదవి విప్పలేదు. మైనారిటీలపై దాడులు జరిగితే తాను పదవినుంచి వైదొలగుతానని మొదట్లో ప్రకటించిన యూనుస్ ఇప్పుడు స్వరం మార్చారు. తమ దేశంలో జరుగుతున్నవి మతపరమైన దాడులు కావంటూ దౌర్జన్యకారులకు వత్తాసు పలకడంతో విస్తుపోవడం ప్రజాస్వామికవాదుల వంతయింది. మరోవైపు కృష్ణదాస్ చేస్తున్న పోరాటం మత ఛాందసవాదులకు కంటగింపుగా మారింది.

ఆయన అరెస్టుతో శాంతించని దౌర్జన్యకారులు హిందూ దేవాలయాలపై మూకుమ్మడి దాడులు జరిపి విధ్వంసం సృష్టిస్తున్నారు. కృష్ణదాస్ అరెస్టు అనంతరం, తమ దేశంలో ఇస్కాన్ కార్యకలాపాలను నిషేధించాలంటూ దాఖలైన ఓ పిటిషన్ ను ఢాకా హైకోర్టు కొట్టివేయడం బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్య వ్యవస్థ కొన ఊపిరితోనైనా బతికి ఉందనడానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. బంగ్లాదేశ్ కు చెందిన ఓ జాతీయ పత్రిక నిర్వహించిన తాజా సర్వేలో దేశంలోని 49 జిల్లాల్లో హిందువులపై దాడులు జరిగినట్లు వెల్లడి కావడం అక్కడ ప్రజాస్వామ్య పతనావస్థను కళ్లకు కడుతోంది.

అంతేకాదు, ఆ దేశంలో మతపరమైన హింస క్రమేపీ పెరుగుతోందని రెండేళ్ల క్రితమే ఆమ్నెస్టీ ఇంటర్నెషనల్ ఆందోళన వ్యక్తం చేసింది. అయినా కనువిప్పు కలగని యూనుస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తాజాగా జరుగుతున్న దాడులపట్ల కూడా ఉదాసీన వైఖరి కనబరచడమే ఆశ్చర్యకరం. ఈ నేపథ్యంలో బంగ్లాను కట్టడి చేసేందుకు భారత్ రంగంలోకి దిగవలసిన ఆవశ్యకత కనబడుతోంది. మైనారిటీల భద్రతకు చర్యలు తీసుకోవాలంటూ భారత్ పదేపదే చేస్తున్న విజ్ఞప్తులను బంగ్లాదేశ్ పెడచెవిన పెట్టడమే కాదు, పరిస్థితిని భారత్ తప్పుదోవ పట్టిస్తోందంటూ నిరసించడం యూనుస్ ప్రభుత్వం తెంపరితనానికి నిదర్శనం. విజ్ఞప్తులు, విన్నపాలతో యూనుస్ ప్రభుత్వం దారికి వస్తుందన్న ఆశలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో భారత్ ఆంక్షల కొరడా విధించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

# పుష్ప2తో దేశమంతా ఊగిపోతోంది..ఎందుకీ క్రేజ్?

సినిమా అత్యంత ప్రభావవంతమైన మాధ్యమం. ప్రాథమికంగా ఇది వినోద ప్రధానమైనది. కానీ, దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సినిమా అద్దం పడుతుంది. ఒక దేశ సంస్కృతి, ప్రజల జీవన పరిస్థితులకు దర్పణం. కాలానికి అనుగుణంగా, ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా సినిమాలు రూపొందుతాయి. అన్ని రంగాల మాదిరిగానే సినీ రంగంలో కూడా జనరేషనల్ షిఫ్ట్ ఉంటుంది. దానిని అందుకున్న వారే విజయవంతమవుతారు. ఇప్పటి వరకు మనం రెండు రకాల సినిమాలను చూశాం. అవి వాస్తవిక చిత్రాలు, కాల్పనిక చిత్రాలు. వీటినే ఆర్ట్ సినిమా, కమర్షియల్ సినిమా అని అంటుంటాం.

ఇక, ప్రపంచానికి ఇండియన్ సినిమా అంటే బాలీవుడ్. కానీ ఇప్పుడు ఆ చిత్ర పరిశ్రమ ప్రతిష్ట మసకబారుతోంది. దానికి కారణం దక్షిణాది సినిమాల ప్రభావం. భారీ తనంలో హిందీ సిని మా తక్కువేమీ కాదు..కానీ ప్రేక్షకులను మెప్పించటంలో విఫలమవుతున్నాయి. ఏడాదికి ఒకటి రెండు మినహా ప్రేక్షకులను ఆకట్టుకోలేక పోతున్నాయి. కాగా, తాజాగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న తెలుగు సినిమా పుష్ప2పై దేశ వ్యాప్తంగా ఊహకందని అంచనాలు నెలకొన్నాయి. దక్షిణాది రాష్ట్రాలే కాదు.. బీహార్ సహా యావత్ ఉత్తర భారతదేశం అల్లు అర్జున్ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హిందీ వెర్షన్ అడ్వాన్స్ బుకింగ్‌లో 24 గంటల్లోనే లక్ష టికెట్స్ అమ్ముడ య్యాయంటేనే దీని క్రేజ్ ఏమిటో అర్థమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో అయితే బుకింగ్ ఓపెన్ అయిన గంటలోనే ఫస్ట్‌డే టికెట్స్ మొత్తం అమ్ముడయ్యాయి. ఇలా తెలుగు రాష్ట్రాల్లో నే కాదు సౌత్ నార్త్ ఓవర్సీస్ లో ఏ సెంటర్ చూసినా పుష్ప 2 రికార్డులు ఇపుడు హాట్ టాపిక్. 670 కోట్లకు పైగా థియేట్రికల్ బిజినెస్ అయింది. ఆడియో రైట్స్, డిజిటల్ రైట్స్, ఓటిటి రూపంలో 400 కోట్లు వచ్చినట్టు ఇండస్ట్రీ టాక్. ఇప్పటి వరకు ఏ తెలుగు సినిమా కూడా ఈ రేంజ్ లో బిజినెస్ చేయలేదు . దాదాపు 1060 కోట్ల బిజినెస్ తో సరికొత్త ట్రెండ్‌ని సెట్ చేస్తోంది. సుమారు 12 వేల 500పైగా థియేటర్లలో విడుదలకాబోతంది. ప్రపంచ వ్యాప్తంగా మొదటి రోజే దాదాపు 55 వేల వేల షోస్ పడుతున్న మొట్టమొదటి తెలుగు సినిమా పుష్ప 2 కావడం విశేషం. 80 దేశాల్లో ఆరు భాష ల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఫస్ట్ డే కలెక్షన్ ప్రపంచ వ్యాప్తంగా 250- 270 కోట్లు ఉంటుందని బాక్సాఫీస్ పండితుల అంచనా.

ఈ నెల 5న 'పుష్ప'రాజ్ థియేటర్స్‌లో అడుగుపెడుతున్నాడు. పుష్పతో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్న అల్లు అర్జున్ ఆ చిత్రం ద్వారా జాతీయ ఉత్తమ నటుడు అవార్డు కూడా గెలుచు కున్నారు. ఆ తరంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్ బాబు, చిరంజీవి, ఈ తరంలో ఏ తెలుగ హీరో ఆ అవార్డు దక్కించుకోలే



కపోవటం గమనార్హం. పుష్ప రాజ్ పాత్ర ద్వారా అల్లు అర్జున్‌కు వచ్చిన క్రేజ్ ఇప్పుడు ఈ సినిమాకు ఈ స్థాయిలో రెస్పాన్స్ రావటానికి ఒక కారణం.

అలాగే బాలీవుడ్ సినిమాల పట్ల ఉత్తారాది ప్రేక్షకులలో నెలకొన్న స్తబ్ధత మరో కారణం. .నిజానికి ఈ క్రేజ్ ఊహించనిదేమీ కాదు. చేతిలో చిల్లిగవ్వ లేని దశనుంచి వ్యవస్థను శాసించే స్థాయికి ఎదిగే పాత్ర పుష్ప రాజ్ . సహజంగా ఇలాంటి రోల్స్‌లో ప్రేక్షకులను ఆకట్టుకునే హీరో యిక్ అండ్ ఎమోషనల్ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. సగటు సినిమా అభిమాని కోరుకునేది ఇదే. ఇలాంటి పాత్రలు..సినిమాలు ఇప్పుడు బాలీవుడ్‌లో కరువయ్యాయి. వాటి కోసం ప్రేక్షలు మొహం వాచిపోయి ఉన్నారు. ఈ గ్యాప్ ని దక్షిణాది సినిమా బర్తీ చేస్తోంది. అందుకే భాషా బేధం లేకుండా ఉత్తరాది వారు కూడా వాటిని ఆదరిస్తున్నారు. టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్ వంటి మాస్ హీరోలు యాక్షన్, రొమాన్స్‌తో అలరించినా .. వారి పాత్రల్లో సగటు భారతీయ సినిమా హీరో పడే కష్టాలు, కన్నీళ్లు కనిపించవు. దీనికి భిన్నంగా పుష్పలో అల్లు అర్జున్, కేజీఎఫ్ లో యష్ ధరించిన పాత్రలను చూడవచ్చు. వారు ప్రేక్షకుడిని సరిగ్గా ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టారు. ఆయా పాత్రలు రోజువారీ ప్రేక్షకులు తమను తాము చూసుకునేలా ఉంటాయి. పుష్ప: ది రైజ్‌లో, అల్లు అర్జున్ సెల్ఫ్ మేడ్ క్యారెక్టర్ అటువంటిదే. అతని అక్రమార్జన, తిరుగుబాటు వైఖరి, లోతైన భావోద్వేగం 'రాగ్స్ టు రిచ్స్' ఫార్ములాకు తిరిగి జీవం పోసాయి. పుష్ప 2 దీనిని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకువెళుతుందని హామీ ఇచ్చింది.



## చిన్న వర్షంకే జలమయమైన డిఫేన్స్ కాలనీ

**వెలుతురు, హయత్ నగర్,డిసెంబర్ 4:**
హయత్ నగర్ డిఫేన్స్ కాలనీవాసుల వర్షపు నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేసిన స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి కాలనీ లో రోడ్లు పూర్తిగా చెర్వు, కుంటలు గా మారాయి. కాగా హయత్ నగర్ డివిజన్లో కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచి కాలనీ వాసులకు మరియు వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని సమాచారం రావడంతో సంబంధిత అధికారులతో కలిసి డిఫెన్స్ కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు.

ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా తక్షణమే రోడ్డు మరమ్మత్తులు జరిపించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు,ఈ పరిశీలనలో డీఈ దామోదర్,ఏఈ హేము నాయక్ ,వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద అంబర్‌పేట్ అశోక్ రెడ్డి లే అవుట్‌లో ం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**వెలుతురు, పెద్ద అంబర్ పేట్, డిసెంబర్ 4:**



పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీలోని అశోక్ రెడ్డి లే అవుట్ లో 8 లక్షల రూపాయలతో నిర్మించనున్న కాలనీ రోడ్డు నిర్మాణ పనులను బుధ వారం ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో మున్సిపాలిటీ 7వ డివిజన్ స్థానిక కౌన్సిలర్ దండెం కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండుగుల జయశ్రీ రాజు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చామా సంపూర్ణ విజయ్ శేఖర్ రెడ్డి ,మున్సిపల్ కమీషనర్ రవీందర్ రెడిలు పాల్గొన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పసుల రాజేందర్, కో ఆప్షన్ మెంబర్ కలీమ్ మరియు అశోక్ రెడ్డి లేఔట్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే



## మల్ రెడ్డి రంగారెడ్డికి స్థానం కల్పించాలి

**తుర్కయంజాల్ : వెలుతురు, డిసెంబర్ 04**
మంత్రివర్గ విస్తరణలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి స్థానం కల్పించాలని సామాజిక కార్యకర్త, తెలంగాణ బట్రాజు యోజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కూరపాటి నరసింహారాజు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కూరపాటి నరసింహారాజు, సరికొండ రుషికేశ్వర్ రాజులు క్యాంప్ కార్యాలయం నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు పాదయాత్రగా బయలుదేరారు.





# పరిసరాల విజ్ఞానం-క్షేత్రస్థాయి పరిశీలన

**చేవెళ్ళ, వెలుతురు డిసెంబర్ 4:**
చేవెళ్ళ నియోజకవర్గం షాబాద్ మండలం ప్రాథమిక పాఠశాల మన్మర్రి లో చదువుకునే మూడు, నాలుగు, ఐదువ తరగతుల విద్యార్థులకు సంబంధించిన పరిసరాల విజ్ఞాన శాస్త్రంలో గల వ్యవసాయం, వ్యవసాయ పనిముట్లు, వివిధ రకాల పంటలు అనే అంశాలకు సంబంధించి ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ విద్యార్థులను క్షేత్రస్థాయి పరిశీలనకు తీసుకెళ్లి వ్యవసాయ పొలంలో ఉన్న వరిపంట, మరియు పత్తి పంట వాటిని పండించే విధానాన్ని వివరించడం జరిగింది.

ప్రస్తుత ఆధునిక కాలంలో పట్టణాల్లోనే గాక, గ్రామాల్లో కూడ కొంతమంది విద్యార్థుల్లో వ్యవసాయం, ఆహార పంటలు, వాణిజ్య పంటలు, వివిధ రకాల ధాన్యాలు, సంప్రదాయ వ్యవసాయ పనిముట్లు, ఆధునిక వ్యవసాయ పనిముట్లకు సంబంధించిన విషయ అవగాహన లోపించిందని భావించి, ఈరోజు విద్యార్థులను వ్యవసాయ క్షేత్రాకి తీసుకెళ్లి వరి పంట, మరియు పత్తి పంటలకు సంబంధించి విత్తనాలు జల్లటం, కలుపు తీయడం, చీడపురుగుల నివారణ, రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు పంట అధిక దిగుబడికి తోడ్పడే కంపోస్ట్ ఎరువులకు సంబంధించిన అంశాలన్నిటిని వివరించి పంట కోత,నూర్పుడి మరియు మార్కెటింగ్ వరకు రైతులు అనుసరించే వివిధ రకాల పద్ధతులను వివరించి విషయ అవగాహన ప్రత్యక్షంగా కల్పించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మూడు, నాలుగు,ఐదు తరగతుల విద్యార్థులు పాల్గొనడం జరిగింది.





# మహిళలు ఆర్థికంగా ఎదిగితే రాష్ట్రం అలాగే దేశం అభివృద్ధి చెందుతుంది

### మహిళా సంఘాలకు కాంగ్రెస్ మొదటి ప్రాధాన్యతనిస్తుంది

### ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో ఎంఎల్ఏ కాలె యాదయ్య

**శంకర్పల్లి వెలుతురు డిసెంబర్ 4:** మహిళలు ఆర్థికంగా ఎదుగుతే దేశం దానంతట అదే అభివృద్ధి చెందుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రూపాయలు 1.95 కోట్ల రూపాయల చెక్కులు బుధవారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాల యాదయ్య



మాట్లాడుతూ మహిళా సంఘాలు ప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు తమ పిల్లలను బాగా చదివించి అభివృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ప్రభుత్వం ఇచ్చే రుణాల ద్వారా స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధిలోకి రావాలని సూచించారు ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం కొత్తగా కొనుగోలు చేసిన రెండు స్వచ్ఛ ఆటోల ప్రారంభోత్సవం కూడా చేశారు. అలాగే పరిశుద్ధ కార్మికులు ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెంగిచెర్ల ఆర్టీసీ డిపోలో వనభోజనాలు

**మేడిపల్లి, వెలుతురు:**
ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో కార్తీక మాస వన భోజనాల కార్యక్రమాలు డిపో మేనేజర్ కే కవిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగస్తులందరూ కార్తీక మాస వనభోజనాలలో వారి భాగస్వాములతో కలిసి హాజరు అయ్యారు. ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాల మేరకు రుచికరమైన వంటకాలు తయారు చేయించి ఉద్యోగులతో కలిసి డిపో మేనేజర్ సహా పక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా డీఎం కే. కవిత మాట్లాడుతూ ఉద్యోగుల సమిష్టి సహకారము, సమన్వయం, అంకితభావంతో ఆర్టీసీ సంస్థ ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆర్టీసీ సంస్థను లాభాల్లోకి తీసుకురావడానికి సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి కష్టపడి సమన్వయంతో పని చేయడమే కారణమన్నారు.

మరింత పట్టుదలతో, సమన్వయంతో పని చేస్తేనే సంస్థ



మనుగడ సాధిస్తుందని చెప్పారు. ఆర్టీసీ సిబ్బంది ఉద్యోగులతో పాటు వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న వారి భాగస్వాముల సహకారాన్ని గుర్తించి ఆహ్వానం మేరకు కార్తీక మాస వనభోజన వేడుకలకు భార్యాభర్తలిద్దరూ కలిసి హాజరు కావటంతో వారిని అభినందించారు. సహా పక్తి బోజనాలతో ఆయా కుటుంబాల మధ్య స్నేహపూర్వక బంధం ఏర్పడుతుందని ఆమె పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగులకు వారి భర్తలు అందించే సహకారం, పురుష ఉద్యోగులు అయితే వారి భార్యలు సమయానకూలంగా సకాలంలో విధులకు వెళ్లే విధంగా ఉద్యోగులకు కావలసిన సౌకర్యాలు కల్పించడం వల్లనే సకాలంలో విధులకు హాజరై ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకురావడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు ఆట పాటల మధ్య ఆనందోత్సవాలతో సంబురాలు జరుపుకున్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు, పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్..

**కూకట్‌పల్లి, డిసెంబర్ 4 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మచెరువు వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులు అర్ధ భాగం పూర్తి అయ్యింది అన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన రోడ్డును నేటి నుండి వినియోగంలోకి తీసుకువచ్చి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అతి త్వరలోనే మిగతా నిర్మాణ పనులన్నీ పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి,



పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

### -అర్చనపల్లి సూర్యారావు..

**కూకట్‌పల్లివో, డిసెంబర్ 4 వెలుతురు:**
బంగ్లాదేశ్ లో ఆలయాలు హిందువులపై దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ బిజెపి, హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ లోని ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సంఘీభావ సభలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్చనపల్లి సూర్యారావు తో పాటు పలువురు బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.





# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం

### - బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూరి రాజశేఖర్ రెడ్డి..

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 04:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద బుధవారం జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో అసెంబ్లీ కన్వీనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూరి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరం పాలన వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు రైతులను అధికంగా ఉన్నప్పటికీ ఇక్కడ ఉన్నా చెరుకు రైతులకు మద్దతుగా నిలవకుండా ఇక్కడ రైతుల భూములను కూడా ఫార్మా కంపెనీ కోసం లాక్కోవడం తెలంగాణ రైతాంగాన్ని అలాగే చెరుకు రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉన్నా చిత్త శుద్ధి తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సాగునీరు కోసం నారింజ ప్రాజెక్ట్ వున్నప్పటికీ కనీసం జహీరాబాద్ ప్రాంత ప్రజలకు నిరుపయోగంగా మారడం దురదృష్టకరమని అన్నారు. ప్రస్తుతం ఈ జిల్లా నుండి వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న దామోదర రాజనర్సింహా జహీరాబాద్ ప్రాంతలో ఇప్పటికే వాయుకాలుష్యంతో ప్రజలు సతమతం అవుతున్న కూడా వారి ఆరోగ్యం పట్ల ఎలాంటి ఆలోచన లేకుండా ఇక్కడి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడటం వారు ఈ ప్రాంత ప్రజలపై చూపిస్తున్న ప్రేమకు నిదర్శనమని తెలిపారు. ఈ ప్రాంతలో ఇటీవలే వక్ఫ్ బోర్డు కూడా భూములు అక్రమించి నట్లుగా వార్తలు రావడం రాష్ట్రంల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భూములన్నీ వక్ఫ్ అధీనంలోకి వెళ్ళడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

మహాలక్ష్మి పేరుతో మహిళలకు తులం బంగారం పేరు చెప్పి ఇప్పటి వరకు ఎంత మందికి ఇచ్చారో చెప్పాలన్నారు.

ఉచిత విద్యుత్ పేరుతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతాం అని చెప్పి మొత్తం తెలంగాణ రాష్ట్రాన్నె అంధకారం లోకి నెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కార్యక్రమ ఇంచార్జి గొల్ల భాస్కర్, మల్లికార్జున్ పాటిల్, శ్రీనివాస్ గౌడ్, సుధీర్ బండారి, బక్కయ్య గుప్తా, అరుణ కైలాస్, సుభాష్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు విశ్వనాథ్ స్వామి, వివిధ మండల అధ్యక్షులు వైద్యనాథ్, బంటు విశ్వనాథ్, శ్రీకాంత్, ఓంకార్ యాదవ్, ఎంజి దుర్గయ్య , సుమ అనిల్ , శోభారాణి తదితరులు వేదిక పై ఉన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ పురి, ఉమా రాణి, బొగ్గుల సంతోష్, పూల సంతోష్, అప్పం శ్రావణ్, విశ్వనాథ్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, అరుణ్, మంజుల కైలాస్, గంగవరం మల్లేష్,జగన్, సతీష్, జగన్నాథం, సంగారెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, నాగేందర్, రమేష్, శంకర్ రెడ్డి, అశోక్,రవికుమార్ కుల్కర్ణి, వేణు కడిగే, చందు, శేఖర్, నరేష్, ఉపేందర్, కాశీనాథ్ పాటిల్, ఆఫీసర్ దిల్లర్, శ్రీనివాస్, రామ్ శెట్టి, మల్లికార్జున స్వామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### - జహీరాబాద్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. కాశీ నాథ్..

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 04:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కకళాశాలలో బుధవారం సైబర్ జాగ్రత్త దివాస్ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డి వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. కాశీ నాథ్, ఎస్సైటు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ ఐ కాశీ నాథ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహనా కల్పించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు ఏ విధంగా దాని ప్రివెంట్ చేయాలని నిర్మూలించడానికి మనం ఏ విధంగా ఫాలో అవ్వాలని చెప్పడం జరిగింది. అదేవిధంగా సైబర్ నేరాల నివారణ కోసం 1930 నెంబర్ వాడాలని, ఎన్ సి ఆర్ పి పోర్టల్ వాడాలని సూచించారు. ఈ మధ్యకాలంలో జరుగుతున్న డిజిటల్ అరెస్ట్ గురించి కూడా కులంకుశంగా వివరించడం జరిగింది. ఎలాంటి గుర్తుతెలియని కాల్స్ వచ్చినా, గుర్తుతెలియని లింక్స్ వచ్చిన, ఎలాంటి




ఏపికె ఫైల్స్ మీ మీ వాట్సాప్ గ్రూపులో వచ్చినప్పుడు మీరు వాటిని క్లిక్ చేయకుండా ఉండాల్సిందిగా కోరడం జరిగింది. ఒకవేళ క్లిక్ చేస్తే మీ ఫోన్లో సేవ్ అయినటువంటి మీ బ్యాంకు ఖాతా వివరాలు మీ ఆధార్ కార్డు వివరాలు వారు దొంగలించి మీ దగ్గర నుంచి మీ అకౌంట్ లోని నగదును ఖాళీ చేసే అవకాశం ఉందని వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

**వెలుతురు న్యూస్ డిసెంబర్ 4:** రామన్నపేట ప్రతి గీత కార్మికునికి బైకు మరియు సేఫ్టీ మొకు ఇవ్వాలి.కేజీ కేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బావడ్లపల్లి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు పులిబిక్షం. రామన్నపేట మండలంలో కల్లుగీత కార్మికుల 2000 కుటుంబాలు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరి ఉపాధి మెరుగు పడే విధంగా, ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కల్లుగీత కార్మిక సంఘం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జనం పెల్లి గ్రామంలో గల అమృత వనములో కూనూరు మల్లేశం అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు భావనల పెల్లి బాలరాజు మండల కార్యదర్శి పులిబిక్షమయమాట్లాడుతూ ప్రభుత్వాన్ని కోరారు. కల్లుగీత వృత్తి ద్వారా వచ్చే ఆదాయంతో బ్రతుకుతెరువు పొందే కుటుంబాలు మండలంలో 2000 పైన ఉన్నాయి కావున భవిష్యత్తులో వారికి ఇబ్బంది కలగకుండా ప్రతి గ్రామానికి 5 ఎకరాల భూమి కేటాయించి చెట్లు పెంచి సేఫ్టీ మొకులు ఇచ్చి తాటి చెట్టు పైనుంచి పడి మరణిస్తే మెడికల్ సర్టిఫికేట్ పాత పద్ధతిని



అమలుపరిచి 50 సంవత్సరాలు నిండిన వ్యక్తులకు వెంటనే పింఛన్ మంజూరు చేయాలని మరియు కొత్త సభ్యత్వాలు పూర్తిగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు ఇట్టి సమావేశానికి మండల కోశాధికారి మునుకుంట్ల లేని న్ లగ్గాల స్వామి పలుసం కిష్టయ్య పబ్బువెంకన్న గుండాల సుందర్ పబ్బుగంగాధర్ చెరుకు శంకరయ్య, గడ్డమీది సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అమరుల ఆశయాలు ఆకాంక్షలకు అనుగుణంగా
# కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

### - కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్

**సమస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు డిసెంబర్ 04:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూరతైన సందర్భంగా ప్రజా తీర్పును గౌరవిస్తూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి శు భాకాంక్షలు తెలిపిన ఐలయ్య యాదవ్. తెలంగాణా రాష్ట్ర కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల ఆశయాలకు ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. 10సంవత్సరాల బి.ఆర్.ఎస్ పాలనా లో అవినీతి అక్రమాలు దోపిడీ అరాచకాలకు పాల్పడుతు ప్రజల సంపదను కొల్లాకొడుతూ నియంత పాలనా చేశారు. అందుకే కెసిఆర్ కు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చి సంవత్సరం అయినా వారి తీరు మారలేదాన్నారు. కెసిఆర్ ప్రభుత్వని ఓడించి కాంగ్రెస్ కు ప్రజా తీర్పు ఇచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ఐలయ్య యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. తెలంగాణా కోసం పోరాటం చేసిన వారం దరిని కెసిఆర్ ప్రభుత్వం అవమానాపరిచితే



ఉద్యమ కారుల సలహాలు సూచనలతో కాంగ్రెస్ ప్రభుత్వం నీతి నిజాయితీగా సమర్ధవంతమైన పాలనా నియోజకవర్గంలో రాష్టంలో జరుగుతుందని చెప్పారు. ఏడాది కాలం లో 25 లక్ష ల మంది కి 21వేల కోట్లతో 2 లక్ష ల వరకు రైతు ఋణ మాపి చేసి,రైతు బంధు,రైతు బీమా పంటల బీమా,వడ్లకు 500 బోనస్ తో ఒక్క రైతు సంక్షేమానికి 50 వేల కోట్ల రూపాయల ను ఖర్చు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వనిదే అన్నారు. 54వేల ప్రభుత్వ ఉద్యోగలు భర్తీ చేసి స్పోర్ట్స్ స్కిల్ యూనివర్సిటీ పెట్టి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టి విద్య రంగానికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుంద న్నారు. 500 రూపాయలకె గ్యాస్ 200యూనిట్ వరకు ఇంటికి ఉచిత విద్యుత్ ఇచ్చి సంక్షేమం,అభివృద్ధి రెండు, రెండు కళ్ళల్ల పాలన చేస్తుంటే,కెసిఆర్ కుటుంబ తట్టుకోలేక ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నా రని ఆరోపించారు.

ఒక్క సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని 10 ఏండ్ల బి.ఆర్.ఎస్ పాలనాలో కూడా చేయలేద న్నారు. బి.ఆర్.ఎస్ పాలనలో నీళ్లు,నిధులు, నియమా కాలు కెసిఆర్ కుటుంబనీకె వచ్చా యని కాంగ్రెస్ ప్రభుత్వంలోని సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు,ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని చెప్పారు.



## రజకుల సమస్యల గురించి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం

**వెలుతురు న్యూస్ డిసెంబర్ 4:**
రామన్నపేట మండంలోని వివిధ గ్రామాల రజక సంఘాల నాయకులు రజకుల సమస్యల గురించి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కి వినతి పత్రం ఇచ్చారు. ఇందుకు గాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్యలను విచారించి, పరిష్కరిస్తానని చెప్పారు .ఈ కార్యక్రమంలో రామన్నపేట మండల రజక సంఘం అధ్యక్షులు కొండూరు శంకర్. యాదాద్రి జిల్లా రజక సంగం అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య మరియు పట్టణ నాయకులు దామెర నరసింహ,. అక్కెనపల్లి లింగయ్య, మాంద్ర కిష్టయ్య, నడిగోట్ రమేష్, గంప సత్తయ్య, ఎలిమినేటి యాదయ్య, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

## క్రికెట్‌లో విద్యార్థి అత్యుత్తమ ప్రదర్శన

**మేడిపల్లి, వెలుతురు:**
బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి హిమగిరి కాలనీకి చెందిన అర్యన్ బోడుప్పల్ కార్పొరేషన్ వేదికగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరి చాడు. ఈ మేరకు బోడుప్పల్ ఎస్కేఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం నాడు జరిగిన మ్యాచ్‌లో విజయానంద్ టీంతో జరిగిన మ్యాచ్‌లో సత్యం కోల్ట్స్ తరుపున బౌలింగ్‌లో ఆరు వికెట్లు, బ్యాటింగ్‌లోనూ రాణించి 47 పరుగులు చేశాడు.ఈ సందర్భంగా అర్యన్ కోచ్, అతను చదువుతున్న మేడిపల్లి సేజ్ స్కూల్ యాజమాన్యం, అర్యన్ తల్లి దండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవి ష్యత్తులో అర్యన్ మరింతగా రాణిం చాలని ఆకాంక్షించారు.



## భూసార పరీక్ష కొరకు మట్టి నమూనాలు సేకరించిన మల్లారెడ్డి ఉద్యాన కళాశాల విద్యార్థులు...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 04:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామం లో హైదారాబాద్ లోని మల్లారెడ్డి ఉద్యాన కళాశాల విద్యార్థులు భూసార పరీక్ష కొరకు మట్టి నమూనాలు సేకరించారు. సేకరణ విధానం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతి పంట కోత అనంతరం మట్టి పరీక్ష చేసుకోవాలని సూచించారు. మట్టి పరీక్ష ఫలితాల కార్డు లో చూపించిన ఎరువులు వాడాలని




తెలిపారు. అనంతరం ఆలు గడ్డ పంట లో పసుపు రంగు జిగురు అట్టలు అమర్చి వాటి వలన కలిగే ఉపయోగాలు, కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు.విద్యార్థులు పూజిత,అలేఖ్య వైష్ణవి ఫైసీ స్నేహితా ప్రీతి రైతులు మోహనరెడ్డి లక్షరెడ్డి కృష్ణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రజాపాలన వారోత్సవాలు

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 04:**
ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో అటవీశాఖ ఆధ్వర్యంలో వన దర్శిని కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అర్బన్ ఫారెస్ట్ పార్కులో వన దర్శిని కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన





కల్పించారు. అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై చిన్నారులకు వివరిం చారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ పార్కులోని వాచ్ టవర్, గజేబో, ట్రెక్కింగ్ లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వన దర్శినిలో భాగంగా విద్యార్థులకు ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ అటవీ క్షేత్రాధికారిని సాలెహ ఫేరోజ్, జహీరాబాద్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ దుర్గయ్య, డిప్యూటీ రేంజ్ అధికారి బాలకృష్ణం రాజు, కోహీర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ కృష్ణమ్మ, బిట్ ఆఫీసర్లు గంగాభవాని, సంతోషి, వనజ, నిజామొద్దీన్, ఇనాయత్ అలీ, విద్యా భారతి స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ రాజు మృతి పట్ల నివాళులర్పించిన జర్నలిస్టులు..

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 4:** సూర్యాపేటకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ తాళ్లపల్లి రాజు (కేబుల్ టీవీ రాజు) ఇటీవల మరణించారు. రాజు దశదిన కార్యక్రమం బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్సార్ ఎన్ ఫంక్షన్ హాల్లో జరిగిన సందర్భంగా దశదిన కార్యక్రమానికి హాజరై రాజు చిత్రపటానికి పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించిన సూర్యాపేట జర్నలిస్టులు డాక్టర్ కృష్ణ బంటు, ఐయితబోయిన



రాంబాబు, పెద్దింటి శ్యామ్ సుందర్ రెడ్డి, అమర గాని నాగేందర్, పల్లె మణి బాబు, తండు వెంకన్న, జహీర్, రాంబాబు, శ్రీనివాస్ తదితరులు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు, నాయకుల ద్వారా వచ్చిన ఆర్థిక సహాయాన్ని రాజు కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.





## మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీఓ రాంరెడ్డి

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 04:**
జహీరాబాద్ మండల పరిధిలోని అల్గోల్ మైనార్టీ గురుకుల పాఠశాలను జహీరాబాద్ రెవిన్యూ డివిజన్ అధికారి పి. రాంరెడ్డి బుధవారం మధ్యాహ్న సమయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని వారిని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ అధికారికి విద్యారిని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన భోజనం అందించాలని, ఆహారం అందించే విషయం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బిక్షపతి, తహసీల్దార్ రవీందర్,
ఎం ఈ ఓ ఎం. బస్వరాజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వసంత తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేయడం అన్యాయం



**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 4:**
పెద్దపల్లి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అ జిల్లా సర్పంచులను ముందస్తూ అరెస్టులు చేయడం అన్యాయమని రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ అన్నారు, సిఎం పర్యటన సందర్భంగా పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం, తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ పేరుకే ప్రజా పాలన ముఖ్యమంత్రి ని కలిసి వినతి పత్రం ఇచ్చే అవకాశం ఇవ్వా లని కోరగా రాత్రికి రాత్రే అరెస్టు చేసి సర్పంచుల ఉద్యమాన్ని అణిచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని యాదయ్య గౌడ్ ఆరోపించారు. ఇకనైనా సర్పంచులు అందరం ఏకమై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సర్పంచుల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఇలాంటి అరెస్టులతో సర్పంచుల ఉద్యమాన్ని ఆపలేరని రాష్ట్ర ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలని మీరు ఎంత అణచివేతే మా సర్పంచ్లో ఒక ఉద్యమం తీవ్రత అంతకు రెట్టింపుగా ముందుకు వచ్చి పోరాటం చేస్తామని యాదయ్య గౌడ్ హెచ్చరించారు.



## కొరటికల్‌లో ఎర్పాటు కానున్న సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన రాజగోపాల్ రెడ్డి

### -2 కోట్ల 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సబ్ స్టేషన్

**వెలుతురు, మునుగోడు నియోజకవర్గం, డిసెంబర్ 4:**
మునుగోడు మండలం, కొరటికల్ గ్రామంలో రూ.2 కోట్ల 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే 33/11 కె వి విద్యుత్ సబ్ స్టేషన్ కు బుధ వారం మునుగోడు ఎంఎల్ ఏ కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి భూమి పూజ చేశారు, ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు. పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు,

## ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందిన నకిరేకంటి అశోక్

### నకిరేకంటి అశోక్ ఆత్మీయ సమ్మేళన సభకు ప్రొఫెసర్ కోదండరాం

**వెలుతురు న్యూస్ డిసెంబర్ 4 రామన్నపేట:** మండలంలోని వెల్లంకి గ్రామంలో కొన్ని రోజుల క్రితం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందిన నకిరేకంటి అశోక్ ఆత్మీయ సమ్మేళనా సభకు ప్రొఫెసర్ కోదండరాం విచ్చేయుచున్నారు. సభలో



పుస్తకావిష్కరణ (అశోక అక్షరం ఒక ఆయుధం) అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తారు తదానంతరం బౌద్ధ అంబేద్కర్ గ్రంథాలయం ప్రారంభిస్తారు సదానంతరం ఉద్యమకారులతో మాట ముచ్చట ఉంటుందని టీజేఎస్ జిల్లా అధ్యక్షులు దేశపాక శ్రీనివాస్ తెలిపారు.
ఈ కార్యక్రమానికి ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొనాలని అదేవిధంగా ఉద్యమకారులు పాల్గొనాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గడ్డం యాదగిరి, కంధల శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ లిమిటెడ్ ఆధ్వర్యంలో

# పట్టణ పోలీసులకు బారికేడ్లు అందజేత

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 04:**
ట్రాఫిక్ సమస్యను గుర్తించి సిఎస్ఆర్ నిధులతో క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ లిమిటెడ్ వారు బుధవారం నాడు 10 బ్యారికేట్స్ అందజేయడంతో సంస్థ ప్రతినిధులకు జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశినాథ్ ప్రశంసించారు. సంగారెడ్డి క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ & క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా సిఎస్అర్ నిధులతో బ్యారికేట్స్ లను జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ యస్ ఐ కాశీనాథ్ కు ఏరియా మేనేజర్ జి. సతీష్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై కాశీనాథ్ మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో ముందుకు వచ్చిన బ్యారికేట్స్ లను అందజేసిన సంస్థకు వారి బృందానికి ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం సతీష్ బాబు మాట్లాడుతూ రోజు రోజుకు జహీరాబాద్ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య దృష్ట్యా వాహనాల ట్రాఫిక్ మల్లింపుకు ఉపయోగపడే బ్యారికేట్స్ లను అందజేశామని ఈ సందర్భంగా అన్నారు. భవిషత్తులో ఇలాంటి




మరిన్ని కార్యక్రమలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి, కానిస్టేబుల్ ఆనంద్, జహీరాబాద్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్ వారి కార్యాలయ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల నేతల ఫోన్లుట్యాపింగ్ చేస్తున్నారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**- రాష్ట్ర ముఖ్య మంత్రి,ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డిలపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు**

**- ఎంఎల్ ఏ పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు అందించిన ఎర్రోల శ్రీనివాస్. మన్నె గోవర్ధన్ రెడ్డి, క్రిశాంక్‌లు**

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 4:**
రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారంటూ బిఆర్ ఎస్ పార్టీ నాయకుడు, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎంఎల్ ఏ పాడి కౌశిక్ రెడ్డి బుధ వారం నాడు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు, రాష్ట్రంలో ప్రతి పక్ష పార్టీల నాయకుల మొబైల్ ఫోన్లను రేవంత్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డిలు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలోనే కౌశిక్ రెడ్డి బంజారాహిల్స్



పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే స్పందించి ఈ వ్యహారంపై దర్యాప్తు చేపట్టాలని ఆయన పోలీసులను కోరారు. ఈ ఫోన్ ట్యాపింగ్ ఫీర్యాదు కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్ రెడ్డి. క్రిశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటియూసీ పోరాటంతో హెడ్ ఓవర్‌మెన్ కుటుంబంలో ఒకరికి సుటబుల్ జాబ్ ఇవ్వడానికి యాజమాన్యం అంగీకారం..

**యాక్టింగ్ మేనేజర్‌గా విధులు నిర్వహించినందున ప్రత్యేక కేసుగా పరిగణించి అంగీకరించిన యాజమాన్యం**

**యజమాన్యంతో గుర్తింపు సంఘంతో జరిగిన చర్చల్లో అంగీకరించిన యజమాన్యం**

**గోదావరిఖని, డిసెంబర్ 4, (వెలుతురు):**
సింగరేణి ఆర్జీ టూ ఏరియా లోని జిడికే సెవెన్ ఎల్.ఇ.పి లో మంగళవారం జరిగిన బంకర్ ప్రమాదం లో మృతి చెందిన హెడ్ ఓవర్ మెన్ సత్యనారాయణ యాక్టింగ్ మేనేజర్‌గా విధులు, అధికారిగా, నిర్వహించినందున యాజమాన్యం అతని కుటుంబ లో ఒకరికి సుటబుల్ జాబ్ ఇవ్వనని పేర్కొన్నందున ఇట్టి విషయం లో ఏఐటియుసి యాజమాన్యం వైఖరిని వ్యతిరేకించడం



జరిగింది. సత్యనారాయణ పార్థీవ దేహాన్ని పోస్ట్ మార్టం చేయనియ్యమని, బుధవారం సింగరేణి వ్యాప్తంగా మైనింగ్ స్టాఫ్ కు నిరసన తెలపాలని, ఏఐటియుసి, పిలుపు నిస్తుందని హాస్పిటల్ లో చర్చల్లో, ఉన్న అధికారులతో ఏఐటియుసి, నాయకులు అనడంతో, అధికారులు వెంటనే ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో పాటు సి అండ్ డి తో ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, స్థానిక ఎమ్మెల్యే, మాట్లాడడం తో యాజమాన్యం సత్యనారాయణ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రత్యేక కేసుగా పరిగణించి సుటబుల్ జాబ్ ఇవ్వడానికి అంగీకరించిందని ఏఐటియుసి నాయకులు తెలిపారు. మొదటి సారిగా ఇలాంటి కేసులో హెడ్ ఓవర్ మెన్ కుటుంబ లో ఒకరికి సుటబుల్ జాబ్ సాధించడం కార్మిక విజయమని ఎందుకంటే అతను యాక్టింగ్ మేనేజర్ గా విధులు నిర్వహించినందున చర్చల్లో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.
ఈచర్చల్లో ఏఐటియుసి, ఉప ప్రధానకార్యదర్శి వై.వి రావు,కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శులు ఆరెల్లి పోషం, జీగురు రవిందర్, బ్రాంచి సహాయ కార్యదర్శి బి.శ్యాంసన్ లతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు ఉన్నారు.

## ప్రజాపాలన కాదు నయవంచన పాలన సాగిస్తున్న కాంగ్రెస్

**ప్రతిపక్ష పార్టీలను అరెస్టు చేసి పరిపాలన సాగిస్తుందా..**

**ఇదేనా కాంగ్రెస్ ప్రజా పాలన, ప్రతిపక్షాల విమర్శ**

**గోదావరిఖని, డిసెంబర్ 4, (వెలుతురు):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవ పేరిట జరిగే సభలు ప్రజా పాలన కాదు నయవంచన పాలన రాక్షస పాలన రాబందుల పాలన రాష్ట్రంలో పేద ప్రజల నడ్డి విరుస్తూ పేద ప్రజల యొక్క ఆర్థిక స్థితిగతులను దెబ్బతీస్తూ రైతులను మోసం చేస్తూ యువతకు ఉద్యోగాల పేరిట ఉద్యోగ భృతి పేరిట ఇస్తానన్న ఉద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేస్తున్నటువంటి కాంగ్రెస్ పాలన ఇది ముమ్మాటికి రాక్షసపాలని రాబందుల పాలనే ప్రతిపక్ష పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించి సాగిస్తున్న సభలను జరుపుకోవాలని ప్రజలు విశ్వసించాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసినటువంటి అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పడం జరిగింది కానీ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పరిపాలన అనేక రాష్ట్రాలలో చరమగీతం పాడి ఈ దేశంలో కాంగ్రెస్ పరిపాలనకు ఇక కాలం చెల్లింది రాబోయే రోజులు పూర్తిగా కాషాయమయమవుతూ అన్ని రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తున్న తరుణంలో అనుకోని తరుణంలో ఈ తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారంటీ ల పేరుతో 66 మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చినటువంటి ఈ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న



సందర్భంగా మేమేదో ఘనత సాధించామని ఆవిర్రవీగుతూ ప్రజా పాలన విజయోత్సభల పేరిట ఈరోజు పెద్దపల్లిలో జరుగుతున్న టువంటి ఆ సభకు గత ప్రభుత్వాల వలెనే ఈ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ నాయకులను ప్రతిపక్ష పార్టీల నాయకులను ముందస్తు అరెస్టులు చేసి పరిపాలన సాగిస్తుంది దానికి నిద ర్శనమే ఈ ముందస్తు అరెస్టులు ఈ ముందస్తు అరెస్టులతో గత ప్రభుత్వం అబాసపాలైంది మీరు నిజంగా ప్రజా పాలన సాగించినట్లయితే ప్రతిపక్షాలను నిరోధించాల్సిన అవసరం లేదు ప్రతిపక్ష నాయకుల కార్యకర్తలను నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించి మీరు సభలు జరుపుకుంటున్నా రంటేనే ఇది ప్రజా పాలన కాదు ఇది రాక్షస పాలన ఇది రాబందుల పాలన అని మరొక్కసారి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు తేటతెల్లం చేస్తున్నాయి ఇలాంటి పాలన మునుముందు కూడా ఇంకా ఇలానే కొనసాగినట్లయితే తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు ఎవ్వరు అమాయకులు కాదు గత టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఏ విధంగానైతే గుణమాసం చెప్పారో ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా తెలంగాణ ప్రజలు అదే గుణపాఠం చెప్తారని భారతీయ జనతా పార్టీ పక్షాన హెచ్చరిస్తున్నాం ఖబర్దార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీ అరాచకుపాలను అంతమొందించి రైతులను, విద్యార్థులను, ఇదేవిధంగా నువ్వు మోసం చేస్తూ పరిపాలన సాగించినట్లయితే వారికి పట్టిన గతే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరిస్తున్నాం ముందస్తు అరెస్ట్ లో భాగంగా ఎన్టిపిసి పోలీస్ స్టేషన్ పరిధిలో భారతీయ జనతాపార్టీ పెద్దపల్లి పార్లమెంటు కో కన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్ యాదవ్, రామగుండం ఎన్టిపిసి మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్ కుమార్, మూడవ డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, ఐదో డివిజన్ కార్పొరేటర్ శ్రీ కృష్ణవేణి, టిఆర్ఎస్ అధికార ప్రతినిధి ఈదునూరి శ్రీకాంత్, ముందస్తుగా అరెస్టు చేయడం జరిగింది.

## జాతీయ నాయకుల్ని ఆదర్శంగా తీసుకోవాలి

**- డా. పెండెం కృష్ణ కుమార్**

**సూర్యాపేట వెలుతురు డిసెంబర్ 04:**
ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నాలుగు సార్లు పొందిన విభిన్న పాత్రాభినయ కళాకారులు, పర్యావరణవేత్త, రచయిత డా,, పెండెం కృష్ణ కుమార్ సూర్యాపేట జిల్లా మండల వనరుల కేంద్రం నకు మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్ గౌడ్ కు అనేక 14 రకాల దేశ నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు , వాటర్ క్యాన్ , గోడ గడియారం, మరియు క్లాత్ బాగ్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ కుమార్ మాట్లాడుతూ జాతీయ నాయకులు శాస్త్రవేత్తలు ఎంతో మంది మన దేశానికి చేసిన కృషిని మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలని వారిని ఆదర్శంగా తీసుకొని వారి మార్గంలో పయనించాలని తెలిపారు.
ఈ సందర్భంగా ఎంఇఓ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దాత పెండెం కృష్ణ కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల శారీరక మరియు మానసిక ఆరోగ్యం పెంపొందించడానికి క్రీడా సామాగ్రిని ,దేశభక్తిని పెంపొందించడానికి దేశ నాయకుల పటాలను, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి శాస్త్రవేత్తల పటాలను, పర్యావరణ పరిరక్షణ అలవర్చడానికి క్లాత్ బ్యాగులను



అందించడం జరిగింది. ప్రస్తుత భారత దేశ రాష్ట్రపతి గౌరవనీయులు శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రశంసలు పొందిన వ్యక్తి పాఠశాలలను సందర్శించడం విద్యార్థులలో ఎంతో స్ఫూర్తిని నింపుతుందని, అది వారి భవిష్యత్తుకు ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని ,ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు వారి కృషి ఎంతో ప్రశంసదాయకమని, మెడికల్ రంగంలో వారు అందిస్తున్న సేవలు, అన్నదానాలు పేదలకు ఆపన హస్తంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్ అవార్డు గ్రహీత మరియు తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డా.సతీష్ బాబు, నీరజలత పాల్గొన్నారు.



## మేమున్నామంటూ హనుమాన్ యూత్ సభ్యులు ఆర్థిక సహాయం

**వెలుతురు న్యూస్ రామన్నపేట డిసెంబర్ 4:** అనారోగ్యంతో మరణించిన బొజ్జ శ్రవణ్ కుమార్ కుటుంబానికి తోడుగా మేము ఉన్నామంటూ. హనుమాన్ యూత్ సభ్యులుగా అందరి కలిసి 14000=00 వేళా రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.

## రామగుండం పోలీస్ కమీషనరేట్ ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**గోదావరిఖని, డిసెంబర్ 4,(వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రం లో మొదటసారిగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో పల్లె నిద్ర,, కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలతో మమేకం అవుతూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని చట్టపరిదిలో పరిష్కారం చేస్తూన్న వివరాలు, తీసుకొంటున్న చర్యలు వివరించారు. ఆపరేషన్ గరుడ, పేరు తో నేర, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ కోసం "ఆపరేషన్ గరుడ" ప్రారంభం చేసి డ్రోన్ లతో పట్టణం లో




పెట్రోలింగ్ నిర్వహిస్తు అసాంఘీక శక్తుల నిర్మూలనకు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, లా అండ్ ఆర్డర్ దృష్ట్యా ప్రయోగాత్మకంగా ఆపరేషన్ గరుడ మొదలు పెట్టమని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ తెలియజేశారు.
గంజాయి, కి నియంత్రణ కు సంబందించి రాష్ట్ర ప్రభుత్వము తీసుకుంటున్న చర్యలలో భాగంగా గంజాయి కేసులలో ఉన్నటువంటి నేరస్తులపై నిరంతర నిఘా ఉంచి గంజాయి అనేది పూర్తి స్థాయిలో నిర్మూలన చేయడంలో భాగంగా ప్రత్యేక నిఘాతో పాటు గతంలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఉన్న నేరస్థుల కదలికలను గమనిస్తూ ప్రత్యేక బృందం ఎప్పుడు ఉంటుందన్నారు. ఒకవేళ ఎవరైనా తిరిగి తమ నేర ప్రవృత్తిని మార్చుకోక మరల ఇలాంటి నేరాలు చేసినచో వారి పై పి ఐ టి, ఎన్ డి పి ఎస్, పి.డి.యాక్టు కేసు నమోదు చేసి జైలుకు పంపడం సాధారణ పి.డి.యాక్టు అమలు గంజాయి రవాణా, అమ్మకాలు వినియోగం జరుగకుండా కేసుల నమోదు తీసుకుంటున్న పటిష్టమైన చర్యలు
రామగుండం పోలీస్ కమీషనరేట్ లో షీ టీమ్, ద్వారా తీసుకుంటున్న రక్షణ చర్యలు, అవగాహనా కార్యక్రమాలు, డెకొయ్ ఆపరేషన్ లు నమోదు చేసిన కేసుల గురించి సి ఎం.కి సీపీ, వివరించారు.

## రాష్ట్రంలో దుర్మర్గాపు పాలన సాగుతుంది

### హామీలు నేరవెర్చాలనీ ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు...
### రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**గోదావరిఖని, డిసెంబర్ 4, (వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలో దుర్మర్గాపు పాలన సాగుతుందని...హామీలు నేరవెర్చాలనీ ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు.
కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంను ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామిలను అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం, గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని టీబీజీకేఎస్ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ ప్రజా వంచన నిరసనగా దీక్షను చేపట్టారు. నిరసన దీక్ష ప్రారంభం కాగానే మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ని బలవంతంగా అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల హామిలతో




అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.ఎన్ని అరెస్టులు చేసిన ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చంతా వరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన దీక్షను కొనసాగించారు.
ఈ కార్యక్రమంలో నాయకులు గోపు అయులయ్య యాదవ్, నారాయణదాసు మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, పిల్లి రమేష్, జడ్సన్, సట్టు శ్రీనివాస్, కుడుదుల శ్రీనివాస్, దాసరి అనంద్, కొడి రామకృష్ణ, సారయ్య, జిట్టవేన ప్రశాంత్, కుమార్, ఆవునూరి వెంకటేష్, ఓదేలు, పాల్గొన్నారు.

## 95 మంది చిన్నారులకు 'గుండె' పరీక్షలు

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 4:**
ప్రభుత్వ జిల్లా అస్పత్రిలోని ఆర్బీఎస్కె కేంద్రంలో, అపోలో ఆసుపత్రి తో సంయుక్తంగా బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆరోగ్య 2 కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ ఆర్.వి. కర్ణన్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 95 మంది చిన్నారులకు సంబంధించిన గుండె పరీక్షలు నిర్వహించగా, ఇందులో 42 మంచి పిల్లలకు గుండెకు సంబంధించిన సర్జర అవసరం ఉందని గుర్తించారు. మరో 53 కేసులలో చిన్నారులకు వైద్యులు కావాల్సిన మెడిసన్స్ అందించారు. అపోలో అస్పత్రి అంత కార్డియాలజిస్ట్ డాక్టర్ అమల్ గుప్తా, చిన్న పిల్లలకు గుండె జబ్బులకు సంబంధించి పలు 3. రకెల స్క్రీనింగ్ చేసి 2-D ఎకో పరీక్షలు నిర్వహించారు. సర్జరీ అవసరం



అయిన చిన్నారులకు హైదరాబాద్, జూబ్లీహిల్స్ అపోలో అస్పత్రిలో శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డా. జసుధీరా, రంగారెడ్డి జిల్లా డిఎం మరియు & హెూఓ డా. వెంకటేశ్వర్లు, జిల్లా అస్పత్రి సూపరింటెండెంట్ డె) అనురాగిణి, జిల్లా టీకాల అధికారి డా. షీబా, అపోలో అస్పత్రి సూపరింటెండెంట్ డా. అబ్దుల్ వాసే, సిటీ సర్జన్ డా. సునీల్కుమార్, రంగారెడ్డి జిల్లా ఆర్బీఎస్కె - డీజీసీ వైద్యులు. మరియు ఇతర నిబ్బంది పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ హిందువుల కోసం
# కదం తొక్కిన హిందూ ఐక్యవేదిక...

- కరీంనగభారీ ర్యాలీ. కలెక్టరేట్ ఎదుట నిరసన..
- బంగ్లాదేశ్లో హిందువులు ఏం పాపం చేశారని దాడులు చేస్తున్నారు..?
- హిందువులకు రక్షణ కల్పించమని అడిగినందుకు ఇస్కాన్ స్వామీజీ చిన్మయి కృష్ణదాస్ ను జైల్లో వేయడం అన్యాయం..
- వరదలొస్తే ఎవరి మతం ఏంటనేది చూడకుండా అన్నం పెట్టినోళ్లపై దాడులు చేయడం ఏం సంస్కృతి...?
- బంగ్లాదేశ్ హిందువులపై వెంటనే దాడులు ఆపాలి... హిందువులకు రక్షణ కల్పించాలి...
- నిరసన కార్యక్రమం సందర్భంగాపీఠాధిపతులు,హిందూ ఐక్య వేదిక నేతల వ్యాఖ్యలు..






**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 04:**
బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న నిరంతర దాడులను నిరసిస్తూ కరీంనగర్ హిందూ ఐక్యవేదిక బుధవారం రోజున భారీ నిరసన, ఆందోళన కార్యక్రమం చేపట్టింది. వేలాదిగా తరలి వచ్చిన అశేష హిందూ జన సమూహం తో కరీంనగర్లోని గోపికృష్ణ ఫంక్షన్ హాల్ నుండి ప్రారంభించిన నిరసన ర్యాలీ పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా కలెక్టరేట్ వరకు కొన సాగింది. ర్యాలీ సందర్భంగా బంగ్లాదేశ్ హిందువులను కాపాడండి, రక్షించండని ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ వద్ద పీఠాధి పతులు, హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో హిందువులు ఏం పాపం చేశారని దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్యం లేదని, హిందువులకు రక్షణ కల్పించమని అడిగినందుకు ఇస్కాన్ స్వామీజీ చిన్మయి కృష్ణ దాస్ ను జైల్లో వేశారని, ఆయనకు అండగా నిలిచిన వారిపై దాడులు చేస్తు మారణ హెూమం సృష్టిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బంగ్లాదేశ్లో ఇస్లామిక్ తీవ్రవాదుల దాడులు రోజురోజుకీ అధికమయ్యాయన్నారు. హిందువులు, ఇతర మతపరమైన మైనార్టీలపై నిరంతరం దాడులు ,హత్యలు, దోపిడీలు, మహిళలపై అమానవీయ వేధింపులు పెరిగిపోతు న్నాయని, ఇవి తీవ్రమైన ఆందోళనకరమైన విషయమని, దీన్ని హిందూ ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ హిందువులు స్వీయ రక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో తమ గళాన్ని ఎత్తినప్పుడు, వారి గళాన్ని అణచివేయ డానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం దుర్మార్గ ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో బంగ్లాదేశ్ లో వరదలొస్తే ఎవరి మతం ఏంటనేది చూడకుండా అన్నం పెట్టిన ఇస్కాన్‌పై బంగ్లాదేశ్ నియంత ప్రభుత్వం అణిచివేత ధోరణి అవలంబిస్తుందన్నారు. అందులో భాగంగానే ఇస్కాన్ స్వామీజీ చిన్మయి కృష్ణ దాస్‌ను జైల్లో వేసి ఇబ్బంది పెడుతుందన్నారు. స్వామీజీకి అండగా నిలిచిన వారిపై ఉక్కు పాదం మోపు తుందన్నారు.
ఇలాంటి చర్యలు సరికావని బంగ్లాదేశ్ ఇప్పటికైనా హిందూ మైనార్టీల పైన జరుగుతున్న దాడులను నివారించడానికి అన్ని విధాలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ హిందువులకు విశ్వ మానవాళి అండగా నిలబడి సంఘీభావాన్ని వ్యక్తపరచడం అత్యవసరమన్నారు. బంగ్లాదేశ్ మైనారిటీ హిందువుల రక్షణ కోసం, అక్కడి ప్రజలకు అండగా నిలవడానికి, నైతిక మద్దతు అందించడానికి హిందూ ఐక్యవేదిక నిరంతర ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా భారత రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా కన్వీనర్ అనుమండ్ల రాజిరెడ్డి, కో కన్వీనర్లు డా. రమణాచారి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, రామ్ కిరణ్, పి .కిషన్, కిరణ్ సింగ్, ఆది శ్రీనివాసరావు, పీఠాధిపతులు శ్రీశ్రీ సనక సనంద స్వామీజీ, పురాణం మహేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాకు ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి వరాల జల్లు

### 1000కోట్లతో,అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

**గోదావరిఖని, డిసెంబర్ 4, (వెలుతురు):**
పెద్దపల్లి జిల్లా పై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి,సీఎం రేవంత్ రెడ్డి, వరాల జల్లుకురిపించారు.
ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువ వికాసం విజయో త్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హాజరయ్యారు.
బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. రూ.1000కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యువ వికాస సభను జ్యోతి ప్రచురణ చేసి ప్రారంభించారు.
అనంతరం 9వేల మంది నిరుద్యోగులకు నియామ కపు పాత్రలు అందించే కార్యక్రమంలో పదిమంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఏడు కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ముఖ్య మంత్రి బహిరంగ సభకు జిల్లా నుండి లక్ష మందికి పైగా జనం తరలివచ్చారు. సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది.
వెయ్యి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు :
జిల్లా పరిధిలో చేపట్టే రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. 82 కోట్ల రూపాయలతో నిర్మించే పెద్దపల్లి బైపాస్ రోడ్డు, సుల్తానాబాద్ బైపాస్ రోడ్ల నిర్మాణాలకు, జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో స్వశక్తి మహిళా ప్రాంగణం భవన నిర్మాణంతోపాటు..
రామగుండం నియోజక వర్గంలో రూ. 60 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు, మంథనిలో ఆర్అండ్‌బీ పెండింగ్ రోడ్ల పూర్తికి, రూ. 10 కోట్లతో అంతర్గాంలో, మంథని



గంగపురిలో, పోతారం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు, అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లిలో బండ్లవాగు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించారు.
జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం మున్సిపా లిటీల పరిధిలో రూ. 51కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు, ఓదెల మండలం రూపునారాయణపేట వద్ద మానేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 80 కోట్లతో చేపట్టే పనుల తో పాటు...
కాల్వశ్రీరాంపూర్ నుంచి మొట్లపల్లి రూ.25కోట్లతో, పీడబ్ల్యు రోడ్ నుంచి ఎల్లంపల్లి వరకు రూ.7 కోట్లతో రోడ్ల నిర్మాణాలకు, రూ.6 కోట్లతో గర్రెపల్లి నుంచి ఎలిగేడు వరకు రహదారి విస్తరణ, రూ.5 కోట్లతో హుస్సేన్ మియా వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి, రూ. 12 కోట్లతో సుగ్లాంపల్లి నుంచి ధూళికట్ట వరకు రహదారి విస్తరణ పనులకు, రామగుండంలో రూ. 60 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
మంథనిలో బ్రిడ్జి, రోడ్ల నిర్మాణానికి,మంథని ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే పనులను ప్రారంభిం చారు.2.45 కోట్ల రూపాయలతో నిర్మించే గుంజపడుగులో 30 పడకల ఆస్పత్రికి, పెద్దపల్లి 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే పనులను ప్రారంభించారు.
పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.9 వేల మందికి నియామక పత్రాలు%ెూ%యువజన వికాస విజయోత్సవ సభలో 9వేల మంది నిరుద్యోగులకు నియామకపు పత్రాలు సీఎం అందించనున్నారు.
500మందికి సింగరేణి ఉద్యోగాల నియామకాలు, గ్రూప్-4, ఇతర ఉద్యోగాలు దాదాపు 8500 మందికి ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారు.4 పోలీస్ స్టేషన్లు, ఆర్టీసీ డిపో మంజూరు%ెూ%జిల్లా పర్యట నకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు పోలీస్ స్టేషన్లో తో పాటు పెద్దపల్లికి ఆర్టీసీ డిపో మంజూరు చేశారు.
జిల్లా కేంద్రంగా ఏర్పడిన పెద్దపల్లిలో ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్ల తో పాటు నూతనంగా పెద్దపల్లి రూరల్, ఎలిగేడు పోలీస్ స్టేషన్లను మంజూరు చేశామని, జీవో సైతం విడుదల చేశామన్నారు. ఈ సభలో రామగుండం ఎమ్మెల్యే, ఎమ్మెస్ మక్కా న్సింగ్, పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, మాట్లాడుతూ తమ నియోజకవర్గ లోనే అభివృద్ధి కై రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది,

## ఈనెల 7న జరిగే ఆటో, క్యాబ్, టాక్స్ డ్రైవర్ల సమస్యల పరిష్కారంకై బందును జయప్రదం చేయండి

### బందు పోస్టర్లు ఆవిష్కరించిన కార్మిక సంఘాలు

**గోదావరిఖని, డిసెంబర్ 4, (వెలుతురు):**
ఆటో,క్యాబ్,టాక్సీ, డ్రైవర్స్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న జరిగే రాష్ట్రవ్యాప్త బందును జయప్రదం చేయండి.,
గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో బుధవారం టాక్సీ డ్రైవర్స్ తో పోస్టర్స్ విడుదల చేయడం జరిగింది.
ఈ సందర్భంగా, ఏ.ఐ.టి.యూ.సి. జిల్లా నాయకులు గౌతం గోవర్ధన్, సీ.ఐ.టీ.యూ. జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, టి.యూ.సి.ఐ. రాష్ట్ర కమిటీ సభ్యులు తోకల రమేష్, లు మాట్లాడుతూలి గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు
ఏ మాత్రం ప్రయత్నం చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఆటో,క్యాబ్ డ్రైవర్ల కు,రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డ్ ను ఏర్పాటు చేస్తామని,ఆటో,క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని, తదితర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారనీ అన్నారు.
కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సం..రం గడుస్తున్నా ఆ హామీలు నెరవేర్చలేదని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలందరికి ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో,క్యాబ్ డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని



అన్నారు. వారిని ఆదుకోవడానికి సంవత్సరానికి 15 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.
దీంతో పాటు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిం చాలన్నారు. యాక్సిడెంట్స్ భీమాను 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2019 నూతన మోటార్ వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలని, దీంతో పాటు అన్ని రకాల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7 న జరిగే బందు పిలుపులో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న డ్రైవర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నేర్వట్ల నర్సయ్య, క్యాబ్ డ్రైవర్లు అంజి బాబు, శ్రీనివాస్,సంజీవ్, కిషోర్, సతీష్, లింగన్న, మొగిలి, రవి, సుధాకర్, మల్లేష్,బేతి రవి, పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్‌లో డ్రైనేజ్ సమస్యను పరిష్కరించిన మహాలక్ష్మి రామన్ గౌడ్

**వెలుతురు, హిమాయత్ నగర్, డిసెంబర్ 4:**
హిమాయత్ నగర్ డివిజన్ లో ఉన్న స్ట్రీట్ నెంబర్ 17, లో చాలా కాలంగా కచమురి మరియు డేనేట్ సేవేరేజ్ లైన్ కలిసి పోవడంతో డ్రైనేజ్ మ్యాన్ హెూల్స్ ఓర్ఫ్లో ఎప్పుడు కావడంతో స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారు, దీంతో కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ దృష్టికి తీసుకురావడం జరిగింది, వెంటనే కార్పొరేటర్ జలమండి అధికార అధికారులకు మరియు మున్సిపల్ అధికారులకు ఈ సమస్యను తొందరగా పరిష్కరించ మని విజ్ఞప్తి చేశారు.
జలమండల అధికారి మేనేజర్ ఉమామహేశ్వర్ మరియు సానిటైజింగ్ డిపార్ట్మెంట్ సుబ్బయ్య అక్కడ దగ్గర ఉండి చేస్తున్న పనిని కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పర్యవేక్షించారు.






# అసోంలో బీఫ్ బ్యాన్

## అసోం ప్రభుత్వం కీలక నిర్ణయం

**అసోం, డిసెంబర్ 4 (వెలుతురు):** అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హొటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో గొడ్డు మాంసం విక్రయించడాన్ని, తినడాన్ని నిషేధిస్తున్నట్లు సీఎం హిమంత బుధవారం ప్రకటించారు. 'రెస్టారెంట్లు, హొటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో గొడ్డు మాంసం విక్రయించడాన్ని, తినడాన్ని నిషేధించాలని నిర్ణయం తీసుకున్నాం' అని మీడియా సమావేశంలో సీఎం చెప్పారు.కాగా, రాష్ట్రంలో ఇప్పటికే గొడ్డు మాంసం వినియోగంపై ఆంక్షలు ఉన్నాయి. అయితే ఆ చట్టాన్ని సవరించి కొత్త నిబంధనలను చేర్చాలని రాష్ట్ర మంత్రివర్గం తాజా సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బీఫ్ వ్యవహారంపై కొద్దిరోజులుగా అసోంలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ నేపథ్యంలో హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాసేపటికే కాంగ్రెస్‌కు అధికార పక్షం ఓ సవాలు విసిరింది. "బీఫ్ బ్యాన్‌ను కాంగ్రెస్ సమర్థించాలి. లేదంటే ఆ పార్టీ నేతలు పాకిస్థాన్ వెళ్లిపోవాలి" అని ట్వీట్ చేశారు అసోం మంత్రి పిజూష్ హజారికా.

## ఢిల్లీ సరిహద్దుల్లో

# ఉద్రిక్త పరిస్థితులు

## సంభల్‌కు బయల్దేరిన రాహుల్, ప్రియాంక గాంధీ - అడ్డుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 4 (వెలుతురు న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ లో న్యాయస్థానం ఆదేశాల మేరకు ఓ ప్రార్థనా మందిరంలో సర్వే చేస్తుండగా అల్లర్లు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ



అల్లర్లలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం సంభల్‌కు బయల్దేరారు. అయితే, వారిని ఘాజీపూర్ సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను వారి వాహనాలకు అడ్డుపెట్టారు. సంభల్ వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బారికేడ్లను ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ కారు దిగి పోలీసులతో మాట్లాడినప్పటికీ వారు ఎలాంటి అనుమతీ ఇవ్వలేదు. చేసేదేమీ లేక రాహుల్, ప్రియాంక సరిహద్దు వద్దే వెనక్కి తిరిగారు. ఢిల్లీకి బయల్దేరారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. మేము సంభల్‌కు వెళ్లాలనుకున్నాం.. కానీ పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. 'సంభల్ వెళ్లేందుకు పోలీసులు మమ్మల్ని అనుమతించడం లేదు. అక్కడికి వెళ్ళడం నా హక్కు. కానీ వారు నన్ను అడ్డుకుంటున్నారు. సంభల్ వెళ్లి అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకోవాలనుకుంటున్నాం. అక్కడ ఏం జరుగుతోందో చూడాలనుకుంటున్నాం. కానీ మమ్మల్ని అక్కడికి వెళ్లకుండా అడుగడుగునా అడ్డుకుంటున్నారు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంభల్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై ప్రియాంక గాంధీ స్పందించారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత అని, ఆయనకు రాజ్యాంగపరమైన హక్కులు ఉన్నాయన్నారు. ఆయన్ని అడ్డుకోవడం సరికాదన్నారు.

# ఎవరీ నారాయణ్ సింగ్ చౌరా..?

## సుఖ్‌బీర్ సింగ్ బాదల్ కాల్పులపై ఘటనపై నిందితుడి గుర్తింపు

**అమృత్‌సర్, డిసెంబర్ 4 (వెలుతురు న్యూస్):** శిరోమణి అకాలీ దళ్ చీఫ్, పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎం సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై ఓ దుండగుడు ఇవాళ కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. గన్‌తో ఫైర్ చేసిన అతన్ని నారాయణ్ సింగ్ చౌరాగా గుర్తించారు. అతను మాజీ ఖలిస్తానీ మిలిటెంట్. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద సేవాదార్



విధులు నిర్వర్తిస్తున్న సుఖ్‌బీర్‌పై నారాయణ్ సింగ్ కాల్పులు జరిపాడు. గతంలో అకాల్ ఫెడరేషన్ చీఫ్‌గా చేశాడతను. పాకిస్థాన్‌లో శిక్షణ పొందాడు. సిక్కు తీవ్రవాదంపై పుస్తకాలు రాశాడు. మూడుసార్లు అతను పాకిస్థాన్‌కు వెళ్లాడు. 1995లో అతను ఇండియాకు వచ్చాడు. పంజాబ్ మాజీ సీఎం బియాంత్ సింగ్ హత్య కేసులో చౌరా అనుమానితుడిగా ఉన్నాడు. 2004లో బురెయిల్ జైలు నుంచి పారిపోయిన కేసులోనూ అనుమానితుడిగా ఉన్నాడు. బియాంగ్ సింగ్‌ను హత్య చేసిన బబ్బార్ ఖల్సా ఇంటర్నేషనల్ చీఫ్ గజతార్ సింగ్ హవారాతో పాటు నలుగురు వ్యక్తులు జైలులోని బరాక్ నెంబర్ 7 నుంచి పారిపోయారు. 2004 , జనవరి 21వ తేదీన ఆ ఎస్కేప్ ఘటన చోటుచేసుకున్నది. చౌరాపై మొత్తం 30 కేసులు ఉన్నాయి. 2010 మే 8వ తేదీన అతనిపై ఎక్స్‌ప్లోజివ్స్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. అమృత్‌సర్‌లోని సివిల్ లైన్స్ పోలీసు స్టేషన్‌లో ఆ కేసు నమోదైంది. యూఏపీఏ చట్టం కింద కూడా అతనిపై అమృత్‌సర్, తరన్ తారన్, రోపర్‌లో కేసులు రిజిస్టర్ అయ్యాయి. 2013, ఫిబ్రవరి 28వ తేదీన అతన్ని అరెస్టు చేశారు. తరన్ తారన్ లోని జలాలాబాద్ గ్రామంలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత బెయిల్‌పై రిలీజ్ అయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. 1984లో చౌరా పాకిస్థాన్‌కు పారిపోయాడు. సిక్కు తీవ్రవాదం జోరుగా ఉన్న రోజుల్లో అతను భారీ స్థాయిలో ఆయుధాలను, పేలుడు పదార్థాలను స్మగ్లింగ్ చేశాడు. పాకిస్థాన్‌లో ఉన్న సమయంలో నారాయణ్ సింగ్ గెరిల్లా యుద్ధంపై పుస్తకాలు రాశాడు.

## కోహెడ మార్కెట్‌ను అంతర్జాతీయ స్థాయిలో

# అభివృద్ధి చేస్తామన్న సీఎం ప్రకటన పట్ల హర్షం

**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 4:**

కొహెడ ప్రాంతంలో అంతర్జాతీయ మార్కెట్ ఏర్పాటుకై ప్రకటన చేసిన రాష్ట్ర ముఖ్య మంత్రి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి బుధ వారం రైతులు మరియు వర్తకుల తో కలిసి పాలబిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం

రైతు పక్షపాతి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ,స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ,స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి లకు రైతాంగం తరపున ధన్యవాదములను తెలియజేశారు కొహెడ లో పండ్ల మార్కెట్ ను అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేస్తామని ముఖ్య మంత్రి తెలియజేయడం పట్ల గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ,వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కర్ చారి లు హర్షం వ్యక్తంచేశారు,ఇబ్రహీంపట్నం నియోజికవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ రెవెన్యూ పరిధిలో దాదాపు 250 ఎకరాలలో 2000 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ సమీకృత మార్కెట్ (పండ్లు..కూరగాయలు...డైరీ ఉత్పత్తులు) ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ



పాలకవర్గం మరియు రైతులు వర్తకులు పెద్ద ఎత్తున బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలబిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేశారు,గత ప్రభుత్వం మార్కెట్ ఏర్పాటు చేస్తామని కాలాయపన చేసి రైతులను వర్తకులను మోసం చేసిందని..కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదని అన్నారు.ఈ ప్రజా ప్రభుత్వంలో అధునాతన మార్కెట్ నిర్మిస్తామని అన్నారు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ల సహకారంతో మార్కెట్ ని మరింత అభివృద్ధి చేస్తామని చైర్మన్ ,వైస్ చైర్మన్ పాలకవర్గ సభ్యులు తెలిపారు, రైతులకు న్యాయం




చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు.రైతు రుణమాఫీ చేసిన చరిత్ర ప్రజా ప్రభుత్వం దే అన్నారు.

ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి ,వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కర్ చారి%%మార్కెట్ డైరక్టర్లు బండి మధుసూదన్ రావు.జైపాల్ రెడ్డి .అంజయ్య.రఘుపతి రెడ్డి,గణేష్ నాయక్ ,నరసింహ.నవరాజ్ ,గోవర్ధన్ రెడ్డి.వెంకట్ గుప్తా,ఇబ్రహీం. తో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భూకంపం

**మొదటిపేజీ తరువాయి..**

7 గంటల 27నిమిషాలకు రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. వరంగల్ కు ఈశాన్యంగా 85కిలోమీటర్లు, హైదరాబాద్‌కు ఈశాన్యంగా 218, విజయవాడకు ఉత్తరంగా 212 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. భూమికి 40కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు గుర్తించారు. తెలంగాణలో గడచిన 50ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపం అని చెప్పుకోవచ్చు. హైదరాబాద్ కు 300కిలోమీటర్ల దూరంలోని మహారాష్ట్ర లాతూరులో సమీపంలో ఆసాలో 6.2 మాగ్నిట్యూడ్‌తో 1993 లో భారీ భూకంపం వచ్చింది. అప్పట్లో 8 వేల మందికిపైగా చనిపోయారు. గడచిన 30ఏళ్లలో హైదరాబాద్ సమీపంలో ఇదే అతిపెద్ద భూకంపం. 1993 సెప్టెంబర్ 30న తెల్లవారు జామున 3గంటల 55 నిమిషాలకు వచ్చిన భూకంపం చుట్టుపక్కల ప్రాంతాలను వణికించింది. ఇది గత 124 సంవత్సరాలలో హైదరాబాద్ సమీపంలో సంభవించిన అత్యంత బలమైన భూకంపం .

గడచిన 31ఏళ్లలో వచ్చిన హైదరాబాద్ సమీపంలో వచ్చిన వాటిలో లాతూర్ భూకంపం అతిపెద్దది. ఇప్పటి వరకు వచ్చిన భూకంపాల తీవ్రత 5.0 లోపే ఉండేది. హైదరాబాద్ నుంచి 300కిలోమీటర్ల పరిధి తీసుకుంటే గడచిన 10ఏళ్లలో 12 భూకంపాలు 4 అంతకంటే ఎక్కువ తీవ్రత ఉన్నవి నమోదయ్యాయి. గడచిన 50ఏళ్లలో ఇవాళే తొలిసారిగా హైదరాబాద్ పరిధిలో 5 తీవ్రతకు మించి భూకంపం వచ్చింది.

2020 ఏప్రిల్ 24 ఆసిఫాబాద్‌లో 4.8తీవ్రతతో భూకంపం సంభవించింది. దాని తర్వాత మహారాష్ట్రకు చెందిన బాస్మత్‌లో 4.6 తీవ్రతో 2024 మార్చిలో భూకంపం సంభవించింది. 57 ఏళ్ల కిందట భద్రాచలంలో అతిపెద్ద భూకంపం వచ్చింది. ఏప్రిల్ 13, 1969 న రాత్రి 9గంటల ప్రాంతంలో వచ్చిన ఈ భూకంప కేంద్రాన్ని భద్రాచలానికి 14.2 కిలోమీటర్ల దూరంలో గుర్తించారు. అయితే 20 కిలోమీటర్ల లోతున రావడంతో ప్రభావం తక్కువగా ఉంది. 1969లో వచ్చిన భూకంపానికి సంబంధించి ప్రాణనష్టం జరిగినట్లుగా గుర్తించలేదు. హైదరాబాద్ మాత్రమే కాదు మొత్తం తెలంగాణ వ్యాప్తంగా తీసుకున్నా భూకంపాల తాకిడి ఎక్కువగానే ఉంది. తెలంగాణలో, తెలంగాణకు 300కిలోమీటర్ల పరిధిలో గడచిన 10ఏళ్లలో 17 భూకంపాలు.. 4 కంటే ఎక్కువ తీవ్రతతో వచ్చాయి. ఇవాళ ములుగులో వచ్చిన భూకంపం 40కిలోమీటర్ల లోతులో రావడం వల్ల తీవ్రత అంతగా తెలియలేదు. ఇది గోదావరి వాయువ్య, ఆగ్నేయ ఫాల్ట్ లైన్స్ పరిధిలో జరిగిందని.. ఈ ప్రాంతంలో భూకంపాల తీవ్రత ఉంటుందని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మిలాజీ ఇవాల్టి రిపోర్టులో చెప్పింది. లాతూరు భూకంప కేంద్రం 6కిలోమీటర్ల లోతులో ఉండటం.. మాగ్నిట్యూడ్ కూడా ఎక్కువగా ఉండటం వల్ల దాని ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఒక వేళ ఇదే తీవ్రతతో భూమి పై పొరల్లో వస్తే ఇక్కడ కూడా తీవ్రత హెచ్చుగానే ఉండే అవకాశం ఉంటుంది. కాగా భూకంపం... చాలా భయంకరమైన ప్రకృతి విపత్తు. ఇది వచ్చిందంటే చాలు సమస్తాన్ని తుడిచిపెట్టేస్తుంది. భూకంపం తీవ్రతను బట్టి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తుంటాయి. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఈ విలయం వలన ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతో ఆస్తి నష్టం జరిగింది. ఇక భూకంపం సంభవించిన ప్రాంతాలు కోలుకోవడానికి ఏళ్ల సమయం పడుతుంది. ప్రస్తుతం భూకంపం టర్కీ, సిరియా దేశాలను అతలాకుతలం చేసింది. ఈ రెండు దేశాల్లో ఈ విపత్తు కారణంగా ఇప్పటివరకు 4500 మంది మరణించారు. 14వేల మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆస్తి నష్టం ఎంతో ఇంకా అంచనా వేయలేదు. ఇప్పుడు ప్రపంచమంతా దీని గురించే మాట్లాడుకుంటోంది. ఈ క్రమంలో ఈ భూకంపాలు ఎలా వస్తాయో దీనికి కారణాలేంటో తెలుసుకుందాం. భూమి లోపల అకస్మిక కదలికల కారణంగా భూకంపాలు సంభవిస్తుంటాయి. భూకంపం అనేది భూమి యొక్క క్రస్ట్‌లో అకస్మాత్తుగా విడుదలయ్యే స్ట్రెయిన్ ఎనర్జీ (ఒత్తిడి శక్తి). దీని ఫలితంగా భూమి లోపలి నుంచి బయటకు షేక్ చేసే తరంగాలు ఏర్పడతాయి. క్రస్ట్ లో ఏర్పడే ఒత్తిళ్లు చాలా వరకు రాతి పొర వరకు మాత్రమే వస్తాయి. రాతి పొర వాటిని పైకి రానీయకుండా చేస్తుంది. అయితే రాతి పొరను మించిపోయిన ఒత్తిడి వచ్చినప్పుడు... బలహీన ప్రాంత్నాన్ని టార్గెట్ చేస్తుంది. అప్పుడు భూకంపం ఏర్పడుతుంది. భూకంపం వచ్చినప్పుడు శక్తివంతమైన తరంగాలను విడుదల అవుతాయి. వీటిని సీస్మిక్ తరంగాలు అంటారు. రాయి విసిరితే నీటిలో అలలు ఏర్పడినట్లే... భూకంప తరంగాలు భూమి లోపల, ఉపరితలంపై ప్రయాణిస్తాయి. అందులో రకాలు ఉంటాయి. అన్ని తరంగాలు అన్ని ప్రాంతాల్లో ప్రయాణించలేవు. తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం భూ ప్రకంపనలు భయాందోళనలకు గురిచేశాయి. ములుగు కేంద్రంగా వచ్చిన ఈ భూకంపం ప్రభావంతో దాదాపు 225 కి.మీ. వ్యాసార్థంతో భూమి 5 సెకండ్ల దాకా కంపించింది. ఈ నేపథ్యంలో భూ ప్రకంపనలకు గల కారణాలపై ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు స్పందించారు. భూకంప తీవ్రత 6 వరకు ఎలాంటి ప్రమాదం లేదని ఎన్‌జీఆర్ఐ సైంటిస్ట్ డాక్టర్ శేఖర్ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో భూ ప్రకంపనలు కామన్ అని చెప్పారు. మళ్లీ భూ ప్రకంపలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అయితే తమ అంచనా ప్రకారం భూ ప్రకంపనల తీవ్రత 6కు మించకపోవచ్చని అభిప్రాయపడ్డారు. 1969లో భద్రాచలంలో అత్యధికంగా 5.7 తీవ్రతతో నమోదైందని తెలిపారు. భూప్రకంపనలతో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కాగా, గోదావరి పరివాహక ప్రాంతంలో భూ ప్రకంపనలు వచ్చాయని ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ తెలిపారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపైనే ఎక్కువ ప్రభావం ఉందని పేర్కొన్నారు. నది పరివాహక ప్రాంతాల నుంచి 300 కి.మీ.వరకు భూకంప ప్రభావం ఉంటుందని అన్నారు. అందువల్లే హైదరాబాద్‌లో భూమి కంపించిందని వివరించారు. మళ్లీ భూ ప్రకంపనలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాత భవనాలు, పగుళ్లు వచ్చిన భవనాలను ఖాళీ చేయడం మంచిదని సూచించారు

అందుకే వాటిని రెండుగా విభజించవచ్చు.

1. బాడీ తరంగాలు 2. ఉపరితల తరంగాలు

బాడీ వేవ్స్ భూమి లోపలి నుంచి ప్రయాణిస్తాయి. అవి భూకంపం కేంద్రం వద్ద పుట్టి.. చాలా వేగంతో ట్రావెల్ చేస్తాయి. వీటిని పీ, ఎస్ తరంగాలుగా విభజిస్తారు.

ఉపరితల తరంగాలు భూకంపం ఏర్పడిన తర్వాత భూమి ఉపరితలంపై ప్రయాణించే తరంగాలు. భూకంపాల వల్ల జరిగే విధ్వంసానికి ప్రధానంగా ఈ వేవ్స్ కారణమవుతాయి.

పీ తరంగాలనే ప్రాథమిక తరంగాలు అని కూడా అంటారు. భూకంపం సంభవించినప్పుడు సీస్మోగ్రాఫ్‌లను తాకే మొదటి తరంగాలు కాబట్టి వీటికి ప్రాథమిక వేవ్స్ అంటారు. ఇవి స్ట్రెట్‌గా ట్రావెల్ చేస్తాయి.

ఎస్ తరంగాలను సెకండరీ వేవ్స్, షియర్ వేవ్స్ అని అంటారు. ఇవి సీస్మోగ్రాఫ్‌ను తాకిన రెండో తరంగాలు. అందుకే వీటికి సెకండరీ వేవ్స్ అని పిలుపుస్తారు. ఇవి అలలు మాదిరిగా ఘన పదార్థాల ద్వారా మాత్రమే ప్రయాణిస్తాయి. భూమి లోపల ఉంటే మైన్స్ గుర్తించడానికి ఈ ఎస్ తరంగాలు ఉపయోగపడతాయి.

భూమి అనేక పొరలతో కూడి ఉంటుంది. భూమిపైన పొర ఖండాల వద్ద 25 నుంచి 70 కి.మీ. వరకు.. మహాసముద్రాల కింద 5 నుంచి 10 కి.మీ వరకు మందంగా ఉంటుంది. ఈ పొర చాలా క్లిష్టంగా, రాళ్లతో కూడి ఉంటుంది. క్రస్ట్ కింద దాదాపు 2900 కి.మీ లోతులో మాంటిల్ ఉంటుంది. ఇది దట్టమైన సిలికేట్ శిలలతో ఉంటుంది. భూకంపాల నుంచి వచ్చే పీ, ఎస్ తరంగాలు రెండూ మాంటిల్ గుండా ప్రయాణిస్తాయి. దాదాపు 2900 కి.మీ లోతులో మాంటిల్ మరియు ఎర్త్ కోర్ మధ్య సరిహద్దు ఉంది. కోర్ ఇనుముతో కూడి ఉంటుంది. ఇది 103చి మరియు 143చి మధ్య దూరం వద్ద 'షాడో జోన్' సృష్టించే భూకంప తరంగాలను వక్రీభవనం చేస్తుంది. భూమి బయటి పొర టెక్టోనిక్ ప్లేట్లు అని పిలిచే 15 ప్రధాన స్లాబ్‌లతో విభజించి ఉంటుంది. ఈ స్లాబ్‌లు లిథోస్ఫియర్‌ను ఏర్పరుస్తాయి, ఇది క్రస్ట్ (కాంటినెంటల్ మరియు ఓషియానిక్) మరియు మాంటిల్ యొక్క ఎగువ భాగాన్ని కలిగి ఉంటుంది. టెక్టోనిక్ ప్లేట్లు ఒకదానికొకటి సాపేక్షంగా చాలా నెమ్మదిగా కదులుతాయి, సాధారణంగా సంవత్సరానికి కొన్ని సెంటీమీటర్లు కదులుతాయి. అయితే ఈ కదలికలు ఎక్కువగా ఉంటే ప్లేట్ సరిహద్దుల వద్ద డిఫర్మేషన్ కు కారణమవుతుంది. దీని ఫలితంగా భూకంపాలు సంభవిస్తాయి. చాలా భూకంపాలు టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దులతో సంబంధం కలిగి ఉన్నాయని పరిశోధనలు చెప్తున్నాయి.

భూకంపాలు రావడానికి మానవ తప్పిదాలు కూడా ఒక కారణం అంటున్నారు శాస్త్రవేత్తలు. పర్యావరణ సమతుల్యం దెబ్బతినడం, భూగర్భ జలాన్ని అధిక మొత్తంలో దుర్వినియోగం చేయడం.

అడవుల్లో చెట్లను నరికివేయడం వంటి వాటి వల్ల కూడా భూకంపాలు సంభవించే అవకాశం ఉంది. పెద్ద పెద్ద ప్రాజెక్టుల్లో ఉన్న వందలాది ఘనపు మైళ్ల నీటి ఒత్తిడి భూమిపై పడడం వల్ల భూగర్భంలో మార్పులు జరిగి భూమి కంపిస్తుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతున్న సమయంలో భూమి అంతర్గత పొరల్లో సర్దుబాట్ల ఫలితమే ఈ ప్రకంపనలు జరగడానికి కారణమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

# సౌత్ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం

## మంగళవారం రాత్రి ఎమర్జెన్సీ విధించిన ప్రెసిడెంట్

**సౌత్ కొరియా, డిసెంబర్ 4 (వెలుతురు):** సౌత్ కొరియాలో మంగళవారం ఉన్నట్టుండి ఎమర్జెన్సీ విధించిన ప్రెసిడెంట్ యూన్ సుక్ యోల్ పై అక్కడి ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎమర్జెన్సీ విధింపును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ తీర్మానం ప్రవేశపెట్టినట్లు సమాచారం. పార్లమెంట్ లో ప్రతిపక్షానికే మెజారిటీ ఉండడంతో అభిశంసన తీర్మానం నుంచి ప్రెసిడెంట్ యోల్ గట్టెక్కే సూచనలు కనిపించడంలేదని సౌత్ కొరియా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్మానంపై శుక్రవారం పార్లమెంట్ లో ఓటింగ్ జరుగుతుందని, ఆ లోపే అధ్యక్షుడు పదవి నుంచి దిగిపోయే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు. మంగళవారం రాత్రి టీవీ ప్రత్యక్షప్రసారంలో అధ్యక్షుడు యోల్ సౌత్ కొరియన్లను ఉద్దేశించి మాట్లాడారు. పార్లమెంట్ లో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉండడంతో ప్రభుత్వాన్ని ప్రతీ విషయంలో అడ్డుకుంటున్నాయని, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. దాయాది దేశం నార్త్ కొరియాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్షాలపై అధ్యక్షుడు తీవ్ర విమర్శలు చేశారు. వారిని కట్టడి చేసి, దేశంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు మార్షల్ లా విధిస్తున్నట్లు ప్రకటించి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే, ఈ నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత రావడం, పార్లమెంట్ కూడా వ్యతిరేకించడంతో బుధవారం ఉదయం మార్షల్ లాను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో మార్షల్ లా విధిస్తూ అధ్యక్షుడు చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ వెంటనే తన పదవికి రాజీనామా



చేయాలని డిమాండ్ చేశాయి. అంతేకాదు, అధ్యక్షుడిపై పార్లమెంట్ లో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ తీర్మానంపై శుక్రవారం పార్లమెంట్ లో ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. అధ్యక్షుడు ఈ తీర్మానం గట్టెక్కాలంటే పార్లమెంట్ సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది (300 మందిలో 200 మంది ఎంపీలు) ఆయనకు మద్దతుగా ఓటేయాలి. అంతేకాదు, కనీసం ఆరుగురు రాజ్యాంగ న్యాయమూర్తులు కూడా మద్దతు తెలపాలి. అయితే, పార్లమెంట్ లో ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీకి చెందిన సభ్యులే ఎక్కువగా ఉన్నారు. దీంతో అధ్యక్షుడికి పార్లమెంట్ మద్దతు దక్కడం అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు.

# మా కార్యకర్తలు, నాయకులు పోరాటం స్ఫూర్తిదాయకం

## ప్రజా సమస్యల పరిష్కారంలో సింహాల్లా పోరాటం : కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 4 (వెలుతురు):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల పోరాటం స్ఫూర్తిదాయకంగా ఉందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కార్యక్షేత్రంలో ప్రతి రోజు కాంగ్రెస్ ప్రభుత్వంతో తలపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు, కేసులకు వెరవకుండా సింహాల్లా పోరాడుతున్న మా పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మరో నాలుగేండ్లు ఈ పోరాటాన్ని ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కొన్ని అబద్దాలు పదేపదే వల్లె వేస్తుంటే బాధ అనిపిస్తుంది. ఒక అబద్దాన్ని వందసార్లు చెప్తే నిజమైపోతదనే నానుడి ఏదైతో ఉందో దాన్ని అనుసరించుకుని ఇవాళ జోసెఫ్ గోబెల్స్‌ను ఆదర్శంగా తీసుకుని ఈ సీఎం, మంత్రివర్గం ప్రయత్నం చేస్తోంది. ప్రజలు, మీడియా దృష్టికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల గురించి తెలియజేయాలని ఈ సమావేశం నిర్వహించాం అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నిన్నటికి సంవత్సరం అయింది. బాక్సింగ్ క్రీడలో ఒక సామెత ఉంటది.. ఎంత గట్టిగా పంచ్ విసరగలిగామన్నది కాదు.. ఎంత గట్టిగా పంచ్‌ను విసిరినా తట్టుకుని తిరిగి నిలబడాలన్నది ముఖ్యం. ఇది క్రీడాకారుడికి పరీక్ష. ఆ విధంగా ఈ ఏడాది కాలంలో బీఆర్ఎస్ అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైన, కేసీఆర్‌కు గాయమైనా.. కవితను అరెస్టు చేసి ఐదున్నర నెలలు జైల్లో పెట్టినా, పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించని ఓటమి పాలైనా.. మా పార్టీ జెండా మీద గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినా.. కేసులు పెట్టినా, అవమానాలకు గురి చేసినా తట్టుకుని నిలబడ్డాం. లగచర్లలో గిరిజన రైతుల పక్షాన నిలబడ్డాం. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోరుబాట పట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. బుధవారం తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌గా మారింది. హైడ్రా, మూసీ బాధితులతో పాటు పలువురు క్యూ కడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బాధితులు తమ వేదనను చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉండాలి.. తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష అని వాలంటీర్లుగా పని చేస్తున్న వారికి, సోషల్ మీడియా సైనికులకు, ప్రతి రోజు కాంగ్రెస్‌తో తలపడుతున్న కార్యకర్తలకు, కేసులకు వెరవకుండా

# యువతకు మిగిలింది విలాపమే

- కాంగ్రెస్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చింది 12,527 మాత్రమే
- కాంగ్రెస్ ఇంకా 1,87,473 ఉద్యోగాలు తెలంగాణ నిరుద్యోగులకు బాకీ.
- ఎక్స్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,డిసెంబర్ 4 (వెలుతురు):

ఏడాది కాలంలో రాష్ట్రంలో జరిగింది యువ వికాసం కాదు.యువతకు మిగిలింది విలాపమే. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి యువతను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లు తామే ఇచ్చినట్లుగా పబ్లిసిటీ. 55, 143 ఉద్యోగాలు భర్తీ చేసినట్లు కాంగ్రెస్ బడాయి.

ఏడాదిలో కాంగ్రెస్ భర్తీ చేసింది కేవలం 12,527 ఉద్యోగాలు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగ నియమాక పత్రాలు ఇస్తూ గొప్పలు. ఇచ్చిన హామీలు మరిచి.. నిరుద్యోగ యువతను మోసం చేయాలని చూస్తే కాంగ్రెస్ కు అధోగతే. కాంగ్రెస్ యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని గుర్తు చేస్తూనే ఉంటాం.

జాబ్ క్యాలెండర్ జాడ లేదు. 2 లక్షల ఉద్యోగాల ఊసు లేదు. కాంగ్రెస్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చింది 12,527 మాత్రమే. కాంగ్రెస్ ఇంకా 1,87,473 ఉద్యోగాలు తెలంగాణ నిరుద్యోగులకు బాకీ. ఏరు దాటాక తెప్ప తగిలేసినట్లు, అధికారం వచ్చాక కూడా అబద్దాలతో కాలం గడుపుతున్నారు. నిజం నిప్పులాంటిది. కాంగ్రెస్ మోసాలకు తెలంగాణ జవాబు చెబుతుంది.

# పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్ తోసిపుచ్చిన హైకోర్టు

హైదరాబాద్,డిసెంబర్ 4 (వెలుతురు):

బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు తిరస్కరించింది. కేసులోని మెరిట్స్ ఆధారంగా నరేందర్ రెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ ను పరిశీలించాలంటూ కింది కోర్టుకు సూచించింది.




ఈమేరకు తీర్పు వెలువరించింది.

లగచర్లలో ప్రభుత్వ అధికారులపై రైతుల దాడి కుట్రలో నరేందర్ రెడ్డి హస్తం ఉందనే ఆరోపణలతో ఆయనను అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ కోసం ఆయన పెట్టుకున్న పిటిషన్ పై హైకోర్టు సానుకూలంగా స్పందించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, లగచర్ల దాడి ఘటనకు సంబంధించి తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ ఆయన మరోమారు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ పిటిషన్ ను పరిశీలించిన కోర్టు, కేసు కొట్టేయలేమంటూ పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్ ను తోసిపుచ్చింది. ఈమేరకు తీర్పు వెలువరించింది.

## రేవంత్, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్ రెడ్డి

# నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు

- సీఎం రేవంత్ రెడ్డి, శివధర్ రెడ్డిపై కేసు బుక్ చేయాల్సిందే
- రేవంత్ దేవుళ్ళ మీద ఒట్లు వేయడం వల్లే రాష్ట్రం లో భూ కంపం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



హైదరాబాద్,డిసెంబర్ 4 (వెలుతురు):

బంజారాహిల్స్ ఏసీపీ కి పొద్దునే ఫోన్ చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు రమ్మన్నారు. నేను పోలీస్ స్టేషన్ వెళ్ళేకన్నా ముందే ఏసీపీ వెళ్లిపోయారు. సీఐ కూడా వెళ్లి పోయేందుకు ప్రయత్నిస్తే మా పార్టీ కార్యకర్తలు ప్రశ్నించారు. నేను ఎమ్మెల్యే అని గౌరవం లేకుండా సీఐ ప్రవర్తించారు. డీజీపీ కన్నా ఎక్కువ ప్రోటో కాల్ ఎమ్మెల్యే కు ఉంటుందని సీఐ కి తెలియదా ? ఏ ప్రజాప్రతినిధి కానీ సీఎం సోదరులకు పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారు. చివరకు బంజారాహిల్స్ పి ఎస్ సీఐ కి నా పిర్యాదు నిచ్చి రసీదు తీసుకున్నా. నా ఫోన్ ట్యాప్ అవుతుంది అనేది నా ప్రధాన ఆరోపణ. సీఎం రేవంత్ రెడ్డి ,ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్ రెడ్డి నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు. నేను ఓ మిత్రుడి పార్టీ కి వెళితే శివధర్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసి అక్కడికి పోలీసులను పంపించారు. నా దగ్గర డ్రగ్స్ పెట్టించి కేసు పెట్టించాలని శివధర్ రెడ్డి ప్రయత్నించారు.

కచ్చితంగా సీఎం రేవంత్ రెడ్డి ,శివధర్ రెడ్డి పై కేసు బుక్ చేయాల్సిందే ..ఎఫ్ .ఐ .ఆర్ .నమోదు చేయాల్సిందే.మా నేత హరీష్ రావు పై బ్రోకర్ రేవంత్ రెడ్డి సూచనతో బ్రోతల్ చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టారు. బ్రోకర్ ,బ్రోతల్ లు కేసు పెడితే పోలీసులు హరీష్ రావు పై ఎఫ్ ఐ ఆర్ ఎలా నమోదు చేస్తారు ? హరీష్ రావు పై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేస్తే నా కేసు విషయం లో సీఎం రేవంత్ ,డీజీపీ ,ఇంటెలిజెన్స్ ఐజీ పై కూడా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాల్సిందే. నేనిచ్చిన పిర్యాదు పై ఎఫ్ ఐ ఆర్ చేయకుంటే తీవ్ర పరిణామాలు తప్పవు.

మా అగ్ర నేతలందరి ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి. సీఎం రేవంత్ దేవుళ్ళ మీద ఒట్లు వేయడం వల్లే రాష్ట్రం లో భూ కంపం వచ్చింది. సీఎం పాపాల నుంచి ప్రజలను దేవుళ్ళే కాపాడాలి. వచ్చేది మా ప్రభుత్వమే ..చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తున్న పోలీసులపై చర్యలు తప్పవు.

# విలువలు, ప్రశాంత జీవితానికి చిరునామా రోశయ్య

- రాజకీయ ఒడిదుడుకులు, ఉద్యమాలు ఎదుర్కొని ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకున్నారు
- ప్రతిపక్షాల విమర్శలకు సహేతుక సమాధానాలు ఇస్తూ ప్రభుత్వాన్ని నిలబెట్టిన ఘనుడు
- ఆయన నాయకత్వంలో పనిచేయడం నా అదృష్టం
- దివంగత సీఎం రోశయ్య మూడవ వర్ధంతి సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్,డిసెంబర్ 4 (వెలుతురు):

విలువలు, ప్రశాంతతో కూడిన జీవితాన్ని గడిపి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచిన నాయకుడు కొణిజేటి రోశయ్య గారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కీర్తించారు. బుధవారం హైటెక్స్‌లో జరిగిన రోశయ్య మూడవ వర్ధంతి సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. రోశయ్య గారి జీవితం అందరూ అనుకున్నట్టు సజావుగా సాగలేదని, ఆయన రాజకీయంలో అనేక ఒడిదుడుకులు, రాజకీయ ఉద్యమాలకు తట్టుకొని ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారని అన్నారు.

క్రమశిక్షణ, నిజాయితీ విద్యార్థి నాయకుడి నుంచి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్గా రోశయ్య ఎదిగేందుకు దోహద పడింది అన్నారు. ఆయన ఆర్థిక మంత్రిగా, సీఎంగా ఉన్న సమయంలో ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, చీఫ్ విప్పుగా ఆయన నాయకత్వంలో తనకు పని చేసే అదృష్టం కలిగింది అన్నారు. ఆయన రాజనీతి, సరళమైన భాష, ప్రతిపక్షాల విమర్శలకు సహేతుకమైన సమాధానాలతో ప్రభుత్వాన్ని నిలబెట్టిన విధానం అందరికీ ఆదర్శం అన్నారు. వ్యక్తిగత దూషణలు లేకుండా సమాధానం చెప్పే విధానం రోశయ్య దగ్గర నేర్చుకోవాలి అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు వారికి కట్టుబడి పని చేయాలి. పదవికి వన్నెతెచ్చేలా మసులుకోవాలి అని ఆయన పరితపించేవారు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర ఆదాయం, ఖర్చులపై ఆయనకు అపార అనుభవం ఉంది, అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఉమ్మడి రాష్ట్రంలో వారికే దక్కింది అన్నారు.

ఆయనకు వ్యవసాయం, వైద్యం గురించి లోతైన అవగాహన ఉందని... ఆచార్య ఎన్.జి.రంగా శిష్యునిగా వ్యవసాయ రంగంపై అవగాహన పెంచుకొని ఆయనకు ప్రియ శిష్యునిగా గుర్తింపు సాధించారని వివరించారు.

ఉమ్మడి రాష్ట్రంలో పిసిసి అధ్యక్షునిగా పనిచేసి ఆ తర్వాత అధికార ప్రతినిధి బాధ్యతలో కూడా సమర్ధవంతంగా పనిచేయడం అందరికీ ఆదర్శం అన్నారు. అధికార ప్రతినిధిగా ఆయన ప్రతిరోజు పిసిసి కార్యాలయానికి వచ్చి అధికార పక్షాన్ని ప్రశ్నించేవారని, తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావడంలో ఆయన కృషి ఎంతో దాగి ఉంది అన్నారు. మహాత్మా గాంధీ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆలోచనలను ఆయన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లారని తెలిపారు

# రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డిపై కేసు ఎందుకు నమోదు చేయలేదు?

- **సాయిరెడ్డి తన చావుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులే కారణం అని నోట్ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు**
- **కానీ పోలీసులు ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు**
- **మేము కూడా కేసులు పెడతాం**
- **పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా?**
- **మాజీ మంత్రి హరీశ్‌రావుపై తప్పుడు కేసు నమోదు చేయడంపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

హైదరాబాద్,డిసెంబర్ 4 (వెలుతురు):

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. ఈ సంవత్సర కాలంలో ప్రజలను మోసం చేశారు. ఎన్నికల సమయంలో ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. కానీ ఏడాది పూర్తయ్యినా ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే.. రేవంత్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతున్నారు.

ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ మంత్రి హరీశ్‌రావు కేసులు నమోదు చేయడం సరికాదు. ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఎవతలి వ్యక్తి ఎవరూ? వారి చరిత్ర ఏంటి, విశ్వసనీయత ఏంటీ అని పోలీసులు ఆలోచించాలి. చక్రదర్‌గౌడ్ అనే చీటర్ వెళ్లి కేసు పెడితే.. ఎలాంటి ఆధారాలు లేకున్నా హరీశ్‌రావు లాంటి వ్యక్తిపై కేసు నమోదు చేస్తారా?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే.. తప్పుడు కేసులు పెట్టడం హాస్యస్పదం.



మేము కూడా కేసులు పెడతాం.. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా?

కొడంగల్ నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన చావుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులే కారణం అని నోట్ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ పోలీసులు ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. లగచర్లలో గిరిజనులను ఇబ్బందులకు గురిచేసిన ముఖ్యమంత్రి రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదు?

ముఖ్యమంత్రి రేవంత్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను బుల్డోజర్లు ఎక్కిస్తాం అని అంటున్న పోలీసులు కేసులు నమోదు చేయడం లేదు? 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే కదా? రైతు రుణమాఫీ, రైతుబంధు, వృద్ధులకు, వికలాంగులు పింఛన్, మహిళలు 2500, కేసీఆర్ కిట్లు, నిరుద్యోగులకు భృతి, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అవన్నీ ఎందుకు ఇవ్వడం లేదని మాజీ మంత్రి హరీశ్ ప్రశ్నిస్తే.. వాటికి సమాధానం చెప్పలేక, తప్పుడు కేసులు పెడుతున్నారు.

కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వకుండానే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ప్రజలకు మౌళిక సదుపాయలు కల్పించలేక కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చితికల పడిపోయారు. బీఆర్ఎస్ పార్టీ నేతల గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.

ఫోన్ ట్యాపింగ్‌కు హరీశ్‌రావుకు ఎలాంటి సంబంధం లేదు. బీఆర్ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పలేకనే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. తక్షణమే మాజీ మంత్రి హరీశ్ రావుపై పెట్టిన బూటకపు కేసును తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# గురుకుల విద్యార్థుల గోస ప్రభుత్వానికి పట్టదా?

- ఒకప్పుడు తెలంగాణ గురుకుల పాఠశాలలో సీటు కోసం ఎగబడ్డ తల్లిదండ్రులు
- నేడు గురుకుల పాఠశాలలకు తమ పిల్లలను పంపించాలంటే భయపడే పరిస్థితి
- బీఆర్ఎస్ నేత ఏనుగు రాకేష్‌రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్ 4 (వెలుతురు):

కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యార్థులు పాఠశాలలో కంటే ఆసుపత్రులలోనే ఎక్కువ ఉంటున్నారు. మనదైతే మంగళవారం మంది అయితేఆదివారం అనే తీరులో ముఖ్యమంత్రి ఎందుకు ప్రవర్తిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అక్రమ అరెస్టులపై ఎప్పటికప్పుడు గొంతు చించుకున్న ముఖ్యమంత్రి నేడు రాష్ట్రంలో ఎక్కడికక్కడ ఎందుకు ఈ అక్రమ అరెస్టులు నిర్బంధాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వంగా మీరు గురుకుల విద్యార్థులకు




కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైతే ప్రధాన ప్రతిపక్షంగా టిఆర్ఎస్ పార్టీ చిత్తశుద్ధితో విద్యార్థుల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఎందుకు ఉలిక్కిపాటు ఎందుకు? ఎందుకు ఈ అడ్డగింతలు నిర్బంధాలు అరెస్టులు? గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించే సత్తా లేని ప్రభుత్వం అక్రమ అరెస్టులతో కాలం వెళ్లదీస్తుంది. ఒకప్పుడు తెలంగాణ గురుకుల పాఠశాలలో సీటు కోసం ఎగబడ్డ తల్లిదండ్రులు నేడు గురుకుల పాఠశాలలకు తమ పిల్లలను పంపించాలంటే భయపడే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎవరెస్టు శిఖరాలను అధిరోహించిన గురుకుల విద్యార్థులు కాంగ్రెస్ పాలనలో కలుషిత ఆహారం తిని హాస్పటల్ బెడ్డులు ఎక్కుతున్నారు.

రాష్ట్రంలో ఏదో ఒక మూల అనేక మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో హాస్పిటల్ లో పాలవుతుంటే రాష్ట్ర మంత్రివర్గం ప్రభుత్వ యంత్రాంగం ముఖ్యమంత్రి విజ యోత్సవ సంబరాల పేరిట ప్రభుత్వ సొమ్ముతో జల్సా చేస్తుంది ప్రపంచస్థాయి విద్యాలయాలు నెలకొల్పుతాననిప్రగల్భాలు పలికిన ముఖ్య మంత్రి కనీసం ఉన్న గురుకులాలనే కాపాడలేని పరిస్థితిలో ఉన్నాడు

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయి విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఇంతవరకు సంక్షేమ శాఖ మంత్రి విద్యాశాఖ మంత్రిని ఎందుకు నియమించలేక పోయారు.? ఢిల్లీకి హైదరాబాద్ కు తిరగడానికి మీకు సమయం సరిపోయిందా లేక ఢిల్లీకి డబ్బు మూటలు మోసే పనులు మంత్రివర్గాన్ని పూర్తిగా విస్తరించే పనిని మర్చిపోయారా.?

# మహాలక్ష్మి పథకం కింద ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ. 2500 ఇవ్వాల్సిందే

- **గత 12 నెలల కాలానికి గానూ బాకీ పడ్డ రూ 30 వేలు చెల్లించాలి**
- **రేవంత్ సీఎం అయిన తర్వాత ఆరు నెలల పాటు ఒక్కప్రాజెక్టు లో స్వాన్ మట్టి కూడా తియ్యలేదు**
- **నరసింహావతారంలా పేగులు మెడల వేసుకుంటా అని సీఎం అంటున్నారు**
- **ధైర్యం ఉంటే నాగార్జున సాగర్ వద్ద నరసింహావతారం ఎత్తి కేంద్ర బలగాలను వెనక్కి పంపించి మన నీళ్లు మనకు తీసుకురావాలని సవాలు చేస్తున్నా**
- **రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ జలాలను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్ రెడ్డి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు**
- **తెలంగాణ జాగృతి ఉమ్మడి వరంగల్, నిజామాబాద్ జిల్లాల నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్,డిసెంబర్ 4 (వెలుతురు):

అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలన్నీ అమలు చేసేంత వరకు వెంటపడుతూనే ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు.




ప్రభుత్వంలో జరిగే తప్పులను తెలంగాణ జాగృతి సంస్థ ఎప్పటికప్పుడు ఎత్తిచూపిస్తుందన్నారు.

బుధవారం నాడు తన నివాసంలో జరిగిన తెలంగాణ జాగృతి వరంగల్, నల్గొండ జిల్లాల నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ప్రసంగించారు. ముఖ్యమంత్రి తమకు ఏదో చేస్తారన్న విశ్వసం ప్రజల్లో లేదని స్పష్టం చేశారు. "మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా ఇవ్వడం లేదు. నెలకు రూ. 2500 చొప్పున రూ. 30 వేలు ఒక్కో మహిళకు సీఎం బాకీ ఉన్నారు. రూ. 2 వేలు పెన్షన్ పెంచామని చెప్పారు కానీ పెంచలేదు. ఆ మొత్తం కూడా ఒక్కొక్కరికి రూ. 24 వేలు సీఎం బాకీ పడ్డారు. వీటన్నింటిపై మనం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి."

మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసినప్పుడే తెలంగాణ తల్లికి నిజమైన నివాళి అర్పించినవాళ్లవుతారని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్పు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిమళ్లింపు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. ప్రజల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించడం, ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే తెలంగాణ సంస్కృతి అని తెలిపారు.

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు తెలంగాణ చేతిలో ఉండేదని, ఇప్పుడు అక్కడ కేంద్ర బలగాలు మోహరించాయని తెలిపారు. "నరసింహావతారంలా పేగులు మెడల వేసుకుంటా అని సీఎం అంటున్నారు కాదా ? నిజంగా ధైర్యం ఉంటే నాగార్జున సాగర్ వద్ద నరసింహావతారం ఎత్తి కేంద్ర బలగాలను వెనక్కి పంపించి మన నీళ్లు మనకు తీసుకురావాలని సవాలు చేస్తున్నాను" అని వ్యాఖ్యానించారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ జలాలను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతుంటే సీఎం రేవంత్ రెడ్డి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు.

ఏ హస్టల్ లో ఏ ఆడపిల్లకు అన్యాయం జరిగి చనిపోయినా అక్కడికి వెళ్లి ఆ అన్యాయాన్ని ప్రశ్నించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా వస్తున్న సామాజిక మార్పులను పరిగణలోకి తీసుకొని బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం అంశాన్ని తీసుకున్నాము అని వ్యాఖ్యానించారు. గతంలో ప్రారంభించిన కార్యచరణను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. అనేక వర్గాల నుంచి తమకు మద్దతు వస్తోందని చెప్పారు కేసీఆర్ స్ఫూర్తితో, ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకత్వంలో తెలంగాణ జాగృతి సంస్థ ఏర్పడిందని, తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా అనేక సామాజిక అంశాలపై తెలంగాణ జాగృతి ఉద్యమించిందని తెలిపారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం పోరాడి సాధించామని గుర్తు చేశారు. 16 రాజకీయ పార్టీలను ఒప్పించి మహిళా రిజర్వేషన్ చట్టం సాకారం కావడానికి కృషి చేశామని స్పష్టం చేశారు.



### మరెన్నో హనీమూన్ కేంద్రాలు:

హనీమూన్ కేంద్రాలుగా కేరళ నుంచి ఉత్తరాఖండ్ వరకు ప్రసిద్ధ ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. కేరళ బ్యాక్‌వాటర్స్, మున్నార్, కర్ణాటకలో కూర్గ్, మంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లో అరకులోయ, మధ్యప్రదేశ్‌లో ఖజురహో, పచ్‌మడీ, రాజస్థాన్‌లో జైసల్మేర్, గోవా, హిమాచల్‌ప్రదేశ్‌లో సిమ్లా, కులుమనాలి, నైనిటాల్, డల్హౌసి, ఉత్తరాఖండ్‌లో డెహ్రాడూన్, ముస్సోరి ఇలా ఎన్నో పర్యాటక ప్రదేశాలు కొత్త దంపతులకు స్వాగతం పలుకుతున్నాయి.

బిడియాలకు గడియేసే మంత్రం.. భర్త నాడి పట్టే తంత్రం..భార్య మనసును అర్థం చేసుకునే మార్గం.. హనీమూన్. ఈ వేసవి ముహూర్తాల్లో ఒక్కటవుతున్న జంటల కోసం కొన్ని హనీమూన్ కేంద్రాల వివరాలిస్తున్నాం. క్షేమంగా వెళ్లి.. ప్రేమతో రండి!!

# అమృత రాత్రులు... అద్భుత యాత్రలు...



హ్యాపీ హనీమూన్

## వసంత సంతసం..

హనీమూన్‌కు పశ్చిమ బంగలో అనువైన చోటేది అని అడిగితే టక్కున చెప్పే పేరు డార్జిలింగ్. ఇక్కడికి యాభై కిలోమీటర్ల దూరంలో మరో అందమైన ప్రాంతం ఉంది. దాని పేరు కాలింపాంగ్. ఎత్తయిన కొండలు.. వాటిపై బౌద్ధారామాలు.. ప్రశాంతతకు చిరునామాగా ఉంటుందీ ఊరు. ఆమని రాకతో పర్వతాలన్నీ పచ్చటి దుప్పటి కప్పుకొని పసందుగా కనిపిస్తాయి. అరవిరిసిన ఆర్చిడ్ పూలు వసంతగాలికి వలపులు నేర్పిస్తాయి. తీస్తా నది తీరంలో విహారం, కొండల్లో లోయల్లో ప్రయాణం.. కాలింపాంగ్‌కు వెళ్లిన నూతన వధూవరులకు మధురమైన అనుభూతినిస్తాయి. పనిలో పనిగా పక్కనే ఉన్న డార్జిలింగ్‌నూ సందర్శించి రావొచ్చు.



**ఎలా వెళ్లాలి**

* విమాన యానం: కాలింపాంగ్‌కు సమీపంలో ఉన్న విమానాశ్రయం బాగ్‌డోగ్రా. కోల్‌కతా, ఢిల్లీ నుంచి విమాన సర్వీసులు ఉన్నాయి. బాగ్‌డోగ్రా నుంచి కాలింపాంగ్‌కు 78 కిలోమీటర్లు. ట్యాక్సీలు, బస్సుల్లో వెళ్లొచ్చు.

* రైలు మార్గం: కాలింపాంగ్‌కు సుమారు 75 కిలోమీటర్ల దూరంలో జల్పాయ్‌గురి రైల్వేస్టేషన్ ఉంటుంది. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి గువాహటి వెళ్లే రైళ్లు జల్పాయ్‌గురి మీదుగా వెళ్తాయి. అక్కడి నుంచి బస్సులు, ట్యాక్సీలో కాలింపాంగ్‌కు చేరుకోవచ్చు.

**విడిది:** హనీమూన్ జంటల కోసం కాటేజీలుంటాయి. భారీ హోటళ్లు బోలెడున్నాయి. సిక్కిం వంటకాలు, టిబెటిన్ రుచులు, ఉత్తరాది పదార్థాలు ఆస్వాదించవచ్చు.

**అనుకూల సమయం:** వర్షాకాలం మినహా ఎప్పుడైనా వెళ్లొచ్చు. వసంత రుతువులో గిరులన్నీ విరులతో విశేషంగా అలరిస్తాయి.

## పగడపు దీవుల్లో..



ఎంత హనీమూన్‌కొచ్చినా.. ఆలుమగలిద్దరూ ఒకరినొకరు చూస్తూ ఎంతసేపు కూర్చుంటారు. పిల్లగాలితో అల్లరి చేయొద్దా! చల్లని సముద్ర గర్భంలో దాగిన అందాలు చూడొద్దా! ఇన్ని చేయాలంటే లక్షద్వీప్ వెళ్లాలి! ఈ పగడపు దీవుల్లోని ప్రకృతి సౌందర్యం బాలమిత్ర కథల్లో వర్ణించిన దానికన్నా గొప్పగా ఉంటుంది. అరేబియా సముద్రంలో చెల్లాచెదురుగా ఉన్న ఈ ద్వీపాలకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. మండువేసవిలోనూ గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు దాటదు. సాయంకాలం.. సాగర తీరంలో.. శీతల పవనాలు వీస్తుంటాయి. లక్షదీప్ 36 దీవుల సమూహం. ఇందులో 10 ద్వీపాల్లో మాత్రమే జనాలున్నారు. వీటిలో బంగారం, కడమట్, అగట్టి ద్వీపాలు చాలా బాగుంటాయి. ఒక ద్వీపం నుంచి మరో ద్వీపానికి వెళ్లడానికి ఫెర్రీలు ఉంటాయి. కయాకింగ్, వాటర్ స్కీయింగ్, విండ్ సర్ఫింగ్, స్కూబా డైవింగ్ వంటి సాహసక్రీడలకు వేదికలు ఈ ద్వీపాలు.

**ఎలావెళ్లాలి:**

* విమానయానం: లక్షద్వీప్ చేరుకోవాలంటే ముందుగా కొచ్చిన్ వెళ్లాలి. అక్కడి నుంచి అగట్టి ద్వీపానికి విమాన సర్వీసులు ఉన్నాయి. అగట్టి నుంచి బంగారం ద్వీపానికి స్పీడు బోట్‌లో వెళ్లాలి.

* **నౌకా విహారం:** కొచ్చిన్ నుంచి లక్షద్వీప్ ప్రధాన దీవులకు నౌకలో వెళ్లొచ్చు. అక్కడ విహారం, బస, బోటింగ్ అన్ని కలిపి ప్యాకేజీలు కూడా ఆఫర్ చేస్తుంటారు నౌకల నిర్వాహకులు. వీటి ధర రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు (జంటకు) ఉంటుంది.

**విడిది:** భారీ రిసార్టులు, కాటేజీలు, రెస్టారెంట్లు, బడ్జెట్ హోటళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

అనుకూల సమయం: జూన్‌సెప్టెంబర్ మినహా ఏడాదంతా వెళ్లొచ్చు.

## బంధంలో బందీల్లా..

కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులకు అండమాన్‌నికోబార్ దీవులు అద్భుతమైన హనీమూన్ స్పాట్. అందమైన వాతావరణం, రకరకాల మనుషులు, కాస్త హడావుడి.. ఇంకాస్త కలివిడితనం కలగలసిన దీవులివి. బడ్జెట్ లెక్కలు చూసుకునే వారు, డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేసే వారు.. ఎవరైనా అండమాన్‌లో జాలీగా గడిపేయొచ్చు. సాహస క్రీడలకు అండమాన్ కేరాఫ్. అండమాన్ రాజధాని పోర్ట్‌బ్లెయర్‌లో దర్శనీయ స్థలాలు ఎన్నో ఉన్నాయి. స్వతంత్ర సమరయోధులను అప్పట్లో బందీలుగా ఉంచిన కాలాపాని జైలును ఇప్పుడు మ్యూజియంగా మార్చారు. రోజూ సాయంత్రం స్వాతంత్ర్య సంగ్రామంపై లేజర్ ప్రదర్శన నిర్వహిస్తారు. పోర్ట్‌బ్లెయర్‌కు 35 కిలోమీటర్ల దూరంలోని హావెలాక్ బీచ్ చాలా అందంగా ఉంటుంది.

**ఎలా వెళ్లాలి?**

* **విమాన యానం:** హైదరాబాద్, విశాఖపట్టణం నుంచి పోర్ట్‌బ్లెయర్‌కు సింగిల్‌స్టాప్



విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

* **నౌకా విహారం:** విశాఖపట్టణం, చెన్నై నుంచి పోర్ట్‌బ్లెయర్‌కు క్రూయిజ్‌లు కూడా నిర్వహిస్తారు. సుమారు రెండున్నర గంటలు సాగే సాగరయానం మరుపురాని అనుభూతిని కలిగిస్తుంది.

**విడిది:**

బడ్జెట్ హోటళ్లు, భారీ రెస్టారెంట్లు, రిసార్ట్‌లు ఉన్నాయి. రకరకాల రుచులు లభిస్తాయి. అండమాన్‌లో తెలుగువారు చాలామంది ఉన్నారు. అన్నపూర్ణ మెస్, ఆంధ్రాభోజనం వంటి బోర్డులు చాలానే కనిపిస్తాయి.

**అనుకూల సమయం:**

వేసవిలో కాస్త ఉక్కపోత ఉన్నా.. సాయంత్రాలు మనోహరంగా ఉంటాయి. రుతుపవనాల వేళ అందంగా ఉంటుంది. శీతాకాలంలో అద్భుతంగా ఉంటుంది.

## గూటి పడవలో..

'అలల ఊపులో తీయని తలపులు చెలరేగుతాయ'ని ఓ సినీకవి సెలవిచ్చారు. అలాంటి మధురమైన భావన ఎక్కడ పడితే అక్కడ కలగదు. కొలనులో నీరు నిద్దరోయినట్టే ఉండాలి. కొత్త పెళ్లి కూతురు కుదురుగా కూర్చోవడానికి గూటి పడవ కావాలి. మంచుకౌగిట వణుకుతున్న కొండల ప్రతిరూపాలు.. నీలి నీటిలో తేలాడుతుండాలి. ఇవన్నీ ఉన్నాయంటే అది శ్రీనగర్‌లోని దాల్ సరస్సు అయి ఉంటుంది. మనదేశంలో ఎవర్‌గ్రీన్ హనీమూన్ స్పాట్ శ్రీనగర్.. కొత్త దంపతులకు ఇది ప్రేమ్‌నగర్. మదిని పరవశింపజేసే దాల్ సరస్సు.. ఆ పక్కనే ఊసులు పంచుకోవడానికి షాలీమర్ తోట.. దాని చెంతనే హౌస్‌బోట్లతో నగీన్ సరస్సు.. ఈ ఉత్సాహం నుంచి తేరుకోకముందే తులిప్ తోట.. స్వర్గమిక్కడే అంటుంది. కొత్తకాపురాన్ని దిద్దుకుంటున్న ఆలుమగలకు ఇంతకన్నా అనువైన చోటు ఎక్కడ దొరుకుతుంది చెప్పండి. అందుకే హనీమూన్ అనగానే టూరిస్ట్ ఆపరేటర్లు, ట్రావెల్ సంస్థలు కూడా ముందుగా కశ్మీర్ పేరే చెబుతారు. అందునా శ్రీనగర్ సౌందర్యం ప్రత్యేకమైనది. వేసవి ముహూర్తాల్లో ఒక్కటైన వారు.. మరింత దగ్గరవ్వడానికి ఇంతకన్నా మంచి ప్రదేశం మరొకటి ఉండదు.



**ఎలా వెళ్లాలి?**

* విమాన యానం: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి సింగిల్ స్టాప్, టూస్టాప్ విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

* **రైలు మార్గం:** సికింద్రాబాద్, విజయవాడ, వరంగల్, నెల్లూరు, ఒంగోలు నుంచి జమ్మూ వెళ్లే రైళ్లు (వీక్లీ) అందుబాటులో ఉన్నాయి. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు సుమారు 266 కిలోమీటర్లు. బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు. ఈ ప్రయాణం భలే పసందుగా ఉంటుంది.

**విడిది:**

శ్రీనగర్‌లో భారీ రెస్టారెంట్లు ఎన్నో. అద్దెకు హౌస్‌బోట్లు లభిస్తాయి. దేశీవిదేశీ వంటకాలు, కశ్మీరీ రుచులు కావాల్సిన రుచులన్నీ లభిస్తాయి.

**అనుకూల సమయం:** వానాకాలం మినహా ఏడాదంతా వెళ్లొచ్చు.

ఆ గిరిపై ఎప్పుడో ఒకటో శతాబ్దంలో నిలబడిన కోట గోడలవి. అప్పుడు తెరుచుకున్న ఖిల్లా ద్వారాలు.. శాతవాహనులను సాదరంగా ఆహ్వానించాయి. మౌర్యులను ఆదరించాయి. కాకతీయులకు దారి చూపాయి. ఢిల్లీ సుల్తానులకూ ప్రవేశం కల్పించాయి. బహమనీలు వస్తుంటే బహుపరాక్ అన్నాయి. రెడ్డి రాజులకు వత్తాసు పలికాయి. మొఘలాయి చక్రవర్తులు, గోల్కొండ నవాబులు, నిజాం రాజులు ఎవరొచ్చినా స్వాగతించాయి. వారంతా వచ్చారు.. వెళ్లారు. చరిత్రలో కలిసిపోయారు. ఆ ద్వారాలు ఇంకా అక్కడే ఉన్నాయి. ఇప్పుడు మనల్ని స్వాగతించడానికి ఏడాదికోసారి మాత్రమే తెరుచుకుంటున్నాయి. ఆ సమయం ఆసన్నమైంది..

## రామగిరి రమ్మంటోంది

ఈ రాజులెవరూ ఇక్కడికి రాకముందు ఇక్కడికి శ్రీరామచంద్రుడు వచ్చాడటంటారు. సీతమ్మ, లక్ష్మణస్వామి సమేతంగా ఇక్కడ కాలుమోపాడని చెబుతారు. అందుకే ఈ ప్రాంతం రామగిరి అయింది. రాజుల కన్ను పడటంతో రామగిరి కాస్తా ఖిల్లాగా మారింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో ఉంటుందీ ఖిల్లా. బేగంపేట గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న భారీ గుట్టపై.. ఇంతెత్తు గోడలతో.. ఓ పక్క బండలతో.. అన్నివైపుల నుంచి చుట్టిముట్టిన చెట్టూచేమతో ఠీవీగా దర్శనమిస్తుంది. శ్రావణ మాసం వచ్చిందంటే తండోపతండాలుగా భక్తులు తరలివస్తారు. కొండల్లో ఐదారు కిలోమీటర్లు ప్రయాణిస్తారు. దారిలో పచ్చని ప్రకృతిని చూసి పరవశిస్తారు. సెలయేళ్లను చూసి మురిసిపోతారు. రామచంద్రుడ్ని కీర్తిస్తూ ఖిల్లాలోకి ప్రవేశిస్తారు. కొండలలో నెలకొన్న సీతారామాలక్ష్మణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తారు. బృందాలుగా వన భోజనాలు చేస్తారు.

రామగిరిపైకి వెళ్లిన వారు ఖిల్లా అంతా కలియ తిరుగుతారు. కోటలు, బురుజులు చూసి ఆశ్చర్యపోతారు. తొమ్మిది ప్రాకారాలతో నిర్మించిన రాతిగోడలు ఔరా అనిపిస్తాయి. 120 అడుగుల ఎత్తుండే గోడలపై అడుగడుగునా ఆనాటి శిల్పకారుల కళావిన్యాసం అబ్బురపరుస్తుంది. దుర్గంలో గజశాల, అశ్వశాల, చెరశాల, ప్రతాపరుద్రుల కోట, నిమ్మకోట, సోలుకోట ఇలా అలరించే విశేషాలెన్నో! బ్రహ్మగుండం, గంగగౌరి సవతుల బావులు, కూర్మగుండం, మల్లెవనం, బృందావనం పర్యాటకులకు కనువిందు చేస్తాయి. శ్రీరాముడు ప్రతిష్ఠించాడని చెప్పే శివలింగం మరో అద్భుతం. కొండపై నుంచి వచ్చే నీటి ధార నేరుగా శివలింగంపై పడటం విశేషం. ఇలాంటి వింతలు, విశేషాలన్నీ ఆస్వాదించాలంటే శ్రావణ మాసంలో సాధ్యమవుతుంది. ఈ నెల దాటిందా.. కోట ద్వారాలు మూసుకుంటాయి. ఖిల్లా మీద మనుషుల సంచారం దాదాపుగా ఉండదు.



### శతాబ్దాల రాచనగరి

క్రీ.శ ఒకటో శతాబ్దంలో గౌతమీపుత్ర శాతకర్ణి రామగిరిని సైనిక స్థావరంగా చేసుకొని ఉత్తర భారతాన్ని పాలించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. మౌర్య చక్రవర్తులు చంద్రగుప్తుడు, బిందుసారుడు, అశోకుడు రామగిరి పాలనా కేంద్రంగా దక్షిణాదిని పాలించారు. కాకతీయ రాజులు ఓరుగల్లు తరహాలో రామగిరిపై తొమ్మిది కోటలు, దర్వాజాలను నిర్మించారట. ఢిల్లీ సుల్తాన్ మహ్మద్‌బిన్‌తుగ్లక్ ఓరుగల్లు కోటను ముట్టడించే ముందు రామగిరిని హస్తగతం చేసుకున్నాడు. తర్వాతి కాలంలో రామగిరిపై బహమనీ సుల్తానులు, వారి నుంచి రెడ్డిరాజుల ఆధిపత్యం కొనసాగింది. మొఘలాయిలు సైతం రామగిరిని పాలించారు. గోల్కొండ నవాబులు, నిజాం రాజుల వరకు రామగిరిపై రాచగిరి కొనసాగింది.

### ఇలా వెళ్లొచ్చు..

రామగిరిఖిల్లా.. పెద్దపల్లి నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. పెద్దపల్లిమంథని రహదారిలోని నాగేపల్లి (బేగంపేట అడ్డరోడ్డు)లో దిగాలి. ఇక్కడి నుంచి బస్సులో కాని, ఆటోలో 4 కిలోమీటర్లు ప్రయాణిస్తే బేగంపేట చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి 3 కిలోమీటర్లు కాలినడకన వెళ్తే ఖిల్లాకు చేరుకోవచ్చు.

* ఖిల్లాలోని విశేషాలు చూసుకుంటూ రాములోరి గుడికి చేరుకోవాలనుకుంటే దాదాపు 5 కిలోమీటర్లు నడవాల్సి వస్తుంది. నేరుగా దైవ దర్శనం చేసుకోవాలనుకుంటే.. రత్నాపూర్ గ్రామం నుంచి సొంత వాహనాల్లో ఖిల్లా వరకు వెళ్లవచ్చు. ఖిల్లాపై వన్యమృగాలు సంచరించే అవకాశం ఉండటంతో, ఒంటరిగా వెళ్తే ప్రమాదం. బృందాలుగా వెళ్లాలి.

# ఎప్పుడొచ్చామన్నది కాదు అన్నయ్యా..



పవన్‌తో డైరెక్టర్ సుజిత్ ఓజీ సినిమా

ఎప్పుడొచ్చామన్నది కాదు అన్నయ్యా.. పోకిరి సినిమాలోని ఈ డైలాగ్ ఎంత పాపులర్ అయ్యిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చాలా రోజుల తర్వాత ఈ డైలాగ్‌ను మరోసారి గుర్తు చేస్తున్నాడు యంగ్ డైరెక్టర్ సుజిత్. ఏ సినిమా అప్‌డేట్ అయినా షేర్ చేసే ప్లాట్‌ఫాంలలో ప్రత్యేకించి చెప్పుకోవాల్సింది సోషల్ మీడియా. ఇటీవల కాలంలో సాధారణంగా హీరోలు, డైరెక్టర్లు తమ తమ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌ను నెట్టింట షేర్ చేస్తూ అభిమానులను ఖుషీ చేస్తుంటారని తెలిసిందే. అయితే నెట్టింట (ఎక్స్‌లో)అకౌంట్ లేకున్నా సూపర్ క్రేజ్ ఉన్న అతికొద్ది యువదర్శకుల్లో టాప్‌లో ఉంటాడు సుజిత్. రన్ రాజా రన్ సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ తెలుగు దర్శకుడు ప్రభాస్‌తో సాహో తెరకెక్కించి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాడు.

ప్రస్తుతం పవన్ కల్యాణ్‌తో ఓజీ తెరకెక్కిస్తూ హాట్ టాపిక్‌గా నిలుస్తున్నాడు. మొత్తానికి ఫైనల్‌గా అభిమానులతో నేరుగా టచ్‌లోకి వచ్చేందుకు ట్విటర్‌లోకి ఎంట్రీ ఇచ్చేశాడు సుజిత్. ఎక్స్ అకౌంట్ కవర్‌ఫొటోపై ఓజీ స్టిల్‌ను పెట్టుకొని అభిమానుల్లో నయా జోష్ నింపుతున్నాడు సుజిత్. ఈ సందర్భంగా సుజిత్‌కు గ్రాండ్ వెల్‌కమ్ చెబుతున్నారు మూవీ లవర్స్, నెటిజన్లు. ఇంతకీ ఎక్స్ ఖాతాలో సుజిత్ ఫస్ట్ పోస్ట్ ఏం పెడతాడన్నది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేశాడు. ఇదిలా ఉంటే మరోవైపు ఓజీ సినిమాతో ఎప్పుడొచ్చామన్నది కాదు అన్నయ్యా.. బుల్లెట్టు దిగిందా లేదా అనే డైలాగ్‌ను ఫుల్ ఫిల్ చేస్తాడని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్.




# పుష్ప 2కు రాంగోపాల్ వర్మ సెటైర్లు

## ఇండ్లీ కథతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు

ఏదో ఒక కామెంట్‌తో నెటిజన్లను ఓ వైపు ఆలోచింపజేస్తూనే.. మరోవైపు కొంత అయోమయానికి గురి చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటాడు రాంగోపాల్ వర్మ. ఈ క్రేజీ డైరెక్టర్ నెట్టింట ఏది పోస్ట్ చేసినా అది ట్రెండింగ్ టాపిక్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పుష్ప 2 రిలీజ్‌కు ముందు రోజు డిసెంబర్ 4న బెనిఫిట్ షో వేసుకునేందకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించాయి. ప్రతీ టికెట్ ధర రూ.800 (జీఎస్టీ లేకుండా)కు పెంచుకునేందుకు అవకాశమిచ్చాయి. సమకాలీన పరిస్థితులపై తనదైన శైలిలో ట్వీట్స్ చేస్తూ వార్తల్లో నిలిచే వర్మ ఇప్పుడు పుష్ప 2 ది రూల్ ధరల పెంపుపై నెట్టింట జరుగుతున్న చర్చ నేపథ్యంలో పుష్ప 2 ఇడ్లీలు.. అంటూ ఓ కథను షేర్ చేస్తూ తనదైన శైలిలో సెటైర్లు వేశాడు. సుబ్బారావు అనే వ్యక్తి ఒక ఇడ్లీ హోటల్ పెట్టి.. ప్లేట్ ఇడ్లీల ధరను రూ.1000గా పెట్టాడు. సుబ్బారావు అంత ధర పెట్టడానికి కారణం, వాడి ఇడ్లీలు మిగతావారి ఇడ్లీల కంటే చాలా గొప్పవని నమ్ముతున్నాడు. కానీ కస్టమర్‌కు సుబ్బారావు ఇడ్లీలు అంత వర్త్ అనిపించకపోతే, అతను సుబ్బారావు హోటల్‌కు వెళ్లడు. దీని వల్ల నష్టపోయేది సుబ్బారావు ఒక్కడే తప్ప, ఇంకెవ్వరూ కాదు. 'సుబ్బారావు ఇడ్లీల ధర సామాన్య ప్రజలకు అందుబాటులో లేదని ఎవరైనా ఏడిస్తే.. అది సెవెన్‌స్టార్ హోటల్ సామాన్యులకు అందుబాటులో లేదని ఏడ్చినంత వెర్రితనం'.. అప్పుడు లగ్జరీ కార్లపై, విలాసవంతమైన భవనాలపై, బ్రాండెడ్ బట్టలపై ఎలాంటి ఏడుపూ ఏడవనోళ్లు సినిమా టికెట్ ధరల మీదే ఎందుకు ఏడుస్తున్నారు..? వినోదం (ఎంటర్‌టైన్‌మెంట్) నిత్యావసరమా? ఇల్లు, తిండి, బట్టలు ఈ మూడింటి కన్నా ఎక్కువ అవసరమా?.. వర్మ చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఎక్కువ రేట్ పెట్టి సినిమా చూడటం అనేది పర్సనల్ ఛాయిస్. మరి దీనిపై నెటిజన్లు, మూవీ లవర్స్ ఎలా స్పందిస్తారనేది చూడాలి.



# నెత్తుడి పిడికిలి బిగించిన చిరంజీవి

**శ్రీకాంత్ ఓదెలతో సినిమాకు గ్రీన్ సిగ్నల్**

ప్రస్తుతం విశ్వంభర సినిమాతో బిజీగా ఉన్నాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి. సోషియా ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగా.. మరోవైపు దసరా ఫేం శ్రీకాంత్ ఓదెలతో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. అలా అప్‌డేట్ ఇచ్చేశారో లేదో..? సినిమా ఉండబోతుందోనని ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న అభిమానులకు స్టన్నింగ్ ఫొటోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్.మెగాస్టార్ చిరంజీవితో పిడికిలి బిగించిన స్టిల్‌ను షేర్ చేశాడు. బ్యాక్‌డ్రాప్‌లో చిరు, శ్రీకాంత్ ముఖాలను కనిపించకుండా.. నెత్తుటితో పిడికిలి బిగించిన స్టిల్‌ను హైలెట్ చేస్తూ తీసిన ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. సినిమా వయొలెన్స్‌గా (హింసాత్మకంగా) ఉండబోతుందని ట్వీట్ చేశాడు. ఒక్క స్టిల్‌తో సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. శ్రీకాంత్ ఓదెల ఓ వైపు నానితో రెండో సినిమాను డైరెక్ట్ చేస్తూనే.. మరోవైపు మెగాస్టార్ సినిమాను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టులో చిరంజీవిని చాలా ఫ్రెస్ లుక్‌తో నయా అవతార్‌లో చూపించబోతున్నాడట.





# తుది దశకు చేరిన 'ది గర్ల్ ఫ్రెండ్'

రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రేమకథాచిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. దీక్షిత్‌శెట్టి కథానాయకుడు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. త్వరలోనే టీజర్ విడుదల చేయనున్నారు. రీసెంట్‌గా టీజర్ చూసిన అగ్ర దర్శకుడు సుకుమార్ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రష్మిక క్లోజప్ షాట్స్, ఆమె హావభావాలు బాగున్నాయని, దర్శకుడు సరైన యాక్టర్స్‌ని సెలక్ట్ చేసుకున్నాడని సుకుమార్ అభినందించారు. ఈ చిత్రానికి కెమెరా.. కృష్ణన్ వసంత్, సంగీతం.. హేషమ్ అబ్దుల్ వాహబ్, సమర్పణ..అల్లు అరవింద్, నిర్మాణం.. గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటైర్టైన్మెంట్స్. ఇదిలావుంటే.. రష్మిక నటించిన తాజా చిత్రం 'పుష్ప–2' ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. దీంతో పాటు ఆమె హిందీలో ఛావా, సికందర్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

# శోభిత.. చైతూ పెళ్లికి గెస్ట్ లిస్ట్‌లో ఉన్నది వీరే...!

అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆయన పెద్ద కుమారుడు నాగచైతన్య వివాహం ఇవాళ నటి శోభితతో జరగనున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్‌లో వీరి వివాహం పూర్తి సంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నారు. దాదాపు 8 గంటలపాటు పెళ్లి తంతు జరగనున్నట్లు తెలిసింది. ఇక ఈ వేడుకకు అక్కినేని, దగ్గుబాటి కుటుంబాలతోపాటు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు హాజరుకానున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన ఫ్యామిలీతో కలిసి ఈ వేడుకకు హాజరుకాబోతున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా అగ్ర కథానాయకులు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్..ఉపాసన, మహేశ్ బాబు..నమ్రత, ప్రభాస్, లేడీ సూపర్ స్టార్ నయనతార, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సహా పలువురు అగ్ర తారలు, దర్శకులు హాజరకానున్నారు. పెళ్లి వేడుకలో భాగంగా ఇటీవలే కాబోయే కొత్త జంటకు హల్దీ వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. చై–శోభిత జంటను ఒకేచోట ఉంచి మంగళస్నానాలు చేయించారు. అనంతరం శోభితను పెళ్లి కూతురిగా ముస్తాబు చేసి మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎరుపు రంగు చీరలో శోభిత మెరిసిపోతున్న ఫొటోలు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఇక పెళ్లిలో శోభిత బంగారు జరీ వర్క్‌తో కూడిన కాంచీవరం చీరను ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. కాబోయే కోడలికి నాగార్జున ఖరీదైన కారు బహుమతిగా ఇవ్వబోతున్నట్లు తెలిసింది. ఇటీవలే నాగ్ రూ.2.75 కోట్లతో లెక్సస్ లగ్జరీ కారును కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ కారును కొడుకు, కోడలికి గిఫ్ట్‌గా ఇవ్వబోతున్నట్లు సమాచారం. దీంతోపాటు బంగారు ఆభరణాలు ఇలా ఖరీదైన బహుమతులు శోభిత కోసం సిద్ధం చేసినట్లు టాలీవుడ్ సర్కిల్ నుంచి టాక్.

# కాదేదీ సంగీతానికి అనర్హం

**దోసె పెనపంపై శివమణి ప్రదర్శన**

ప్రఖ్యాత డ్రమ్మర్ శివమణి గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. డ్రమ్స్ వాయించడంలో ఆయన రూటే సపరేటు. అందుబాటులో ఉన్న దేని సాయంతో అయినా ఆయన అలవోకగా మ్యూజిక్‌ను వాయించ గలరు. తాజాగా ఆయన దోశ తవాను డ్రమ్స్‌లా మార్చుకుని అందరినీ ఆకట్టుకున్నారు. బెంగళూరులోని ఐకానిక్ సౌత్ ఇండియన్ రెస్టారెంట్ విద్యార్థి భవన్‌ను శివమణి సందర్శించారు. అక్కడ అల్పాహారం ఆస్వాదించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ కిచెన్‌లోకి వెళ్లిన శివమణి.. అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. దోశలు వేసే పెనంపై చిన్న కప్స్ సాయంతో సంగీతం వాయించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. 'శివమణి మ్యూజికల్ దోశ..', 'కాదేదీ సంగీతానికి అనర్హం' అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.





Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com